www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16 అనంతపురం
ఆదివారం 20 ఆగస్టు 2017





ప్రావీణ్యతకు
మనోధైర్యం తోడైతే
అన్నీ విజయాలే

దర్శకుడు, కళాతపస్వి
కే విశ్వనాథ్

● వివరాలు 12లో....



సత్యసాయి ఆరోగ్య ప్రణాంజలి త్రైమాసిక పత్రికను విడుదల చేస్తున్న మంత్రులు, ట్రస్టు సభ్యులు

నిస్వార్థ సేవలకు ప్రతిరూపం సత్యసాయి

- వైద్య సేవలకు రిటైర్మెంట్ లేదు
- మంత్రి కామినేని
- సత్యసాయి సేవలు అందరికీ ఆదర్శం
- కర్ణాటక మంత్రి సురేశ్‌కుమార్
- ఘనంగా సత్యసాయి వైద్యుల జాతీయ సమ్మేళనం

వివరాలు 14

చుట్టుముట్టిన రక్తపిపాసులు!

కాలువలు నిండుకున్నాయ్..
చెత్త కుప్పలు.. దిబ్బలుగా పెరిగాయ్..
మురుగు తీసేవారు లేరు..
చెత్త ఎత్తేవారు రారు..

ఇంకేముంది.. దోమలకు అడ్డేముంది..
ఆడిందే ఆట.. స్థావరమే ప్రతిచోటా..
ప్రజలు ఇబ్బందిగా జీవిస్తుంటే..
అవి మాత్రం దర్జాగా తిరుగుతున్నాయ్..

పల్లె, పట్నం.. నగరం.. ఎక్కడికెళ్లినా..
రక్తపిపాసుల్లా చుట్టుముడుతున్నాయ్..
రేయి, పగలు తేడాలేకుండా..
యమపాశాల్లా వెంటాడుతున్నాయ్..

కదిలితే కరుస్తున్నాయ్..
కదలకున్నా కరుస్తున్నాయ్..
దుప్పటి కప్పుకున్నా వదలవు..
దోమల చుట్ట అంటించినా.. వెళ్లవు..

కుట్టి.. కుట్టి.. చంపుతూ..
ఒంట్లోని రక్తాన్నంతా పీల్చేస్తున్నాయ్..
రోగాల పాలు చేస్తూ..
ఊళ్లకు ఊళ్లనే మంచాన పడేస్తున్నాయ్..

ప్రపంచంలో పాము కరచి చనిపోతోంది..
వందల మందే.. దోమ కరచి చనిపోతోంది
మాత్రం.. లక్షల మంది..
అయినా.. మనం నిర్లక్ష్యం వీడం..
ప్రాణాలు తోడేస్తున్న మహమ్మారిని తుదముట్టించం..

ఎక్కడికెళ్లినా
వెంటాడుతున్న దోమలు..

- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం..
- నిండుకున్న కాలువలు..
- శుభ్రం చేసే నాథుడేడీ?
- విషరోగాల బారిన పడుతున్న ప్రజలు..
- 30 మండలాల్లో 83 గ్రామాలు సమస్యాత్మకం..
- అరికట్టకుంటే.. పెనుముప్పు తప్పదు..





నేడు ప్రపంచ దోమల నివారణ దినం..

సెంటర్‌స్ప్రెడ్‌లో....



నెట్టికంటి
తొలి
దివ్య
దర్శనం..
అమోఘం

శ్రీ ఆంజనేయం



కసాపురంలో స్వామి దర్శనం కోసం భారీ క్యూ..

- వైభవంగా శ్రావణ చివరి శనివారం..
- భక్తులతో పోటెత్తిన కసాపురం, నేమకల్లు, మురడి

16

రైతులకు ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలు

- అక్రమాలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలి
- మంత్రి పరిటాల సునీత
- డీసీఎంఎస్‌లో పంపిణీ ప్రారంభం

2



ప్రత్యామ్నాయ విత్తనాలు అందజేస్తున్న మంత్రి

రైతులకు ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలు

అనంతపురం కలెక్టరేట్: రైతులకు ఉచితంగా ఏడు రకాల ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని స్త్రీ,శిశుసంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. స్థానిక డీసీఎంఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అంతకుముందు డీసీఎంఎస్ గోదాములో నిల్వ ఉంచిన ప్రత్యామ్నాయ విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ.. ప్రతిఏడాదీ ఖరీఫ్‌లో రైతులు ఎన్ని ఇబ్బందులున్నా విత్తనాలు కొనుగోలు చేసి వేసుకుంటున్నా రన్నారు. అనంత అంటే సీఎం చంద్రబాబునాయుడుకు ఎంతో ఇష్టమన్నారు. అందుకే జిల్లాకు రూ.87 కోట్ల ఖర్చు చేసే ఏడురకాల ప్రత్యామ్నాయ విత్తనాలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. సూక్ష్మపోషకాలయిన జింక్, జిప్సం, బోరాన్‌లను రైతులకు ఉచితంగా పంపిణీ చేయిస్తున్నామన్నారు. ఒక్కో రైతుకు ఐదెకరాల వరకు ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వనున్నామన్నారు. వేరుశనగ తరహాలోనే బయోమెట్రిక్ ద్వారా ప్రత్యామ్నాయ విత్తనాలు, నవధాన్యాలు అందజేస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయ, సూక్ష్మపోషకాల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జేడీఏను ఆదేశించారు. జిల్లాలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. వేరుశనగ సాగుకు అదును సమయం దాటిపోయిందన్నారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు రైతులు ప్రత్యామ్నాయవిత్తనాలు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల వారీగా షెడ్యూల్ తయారు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విత్తనపంపిణీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంపిణీ కేంద్రం వద్ద బ్యానర్ లేకపోవడంపై మంత్రి ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా పంపిణీ కేంద్రాల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేయించి పకడ్బందీగా విత్తనాలు పంపిణీ చేయించాలని ఆదేశించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గత ఏడాది పంట నష్టం కింద రూ.1032 కోట్లు మంజూరు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ప్రీమియం చెల్లించిన రైతులకు వాతావరణ బీమా కింద రూ.419కోట్ల జమ చేస్తున్నారన్నారు. జిల్లా రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ విత్తనాలు తెప్పించేందుకు ఏపీ సీడ్స్ తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమం లో జేడీఏ శ్రీరామమూర్తి, జడ్పీటీసీ వేణుగోపాల్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ పాములాయి వెంకటేష్, ఏరువాక శాస్త్రవేత్త సంపత్‌కుమార్, ఏడీఏ వాసుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పరిశీలిస్తున్న మంత్రి సునీత

విత్తనాలు స్టాక్ లేకుండా రైతులను ఇబ్బంది పెట్టకండి

- కలెక్టర్ వీరపాండ్యన్

అనంతపురం కలెక్టరేట్: పంపిణీ కేంద్రాల్లో ప్రత్యామ్నాయ విత్తనాలు స్టాక్ లేకుండా రైతులకు సమాచారం అందించి ఇబ్బంది పెట్టవద్దని కలెక్టర్ వీరపాండ్యన్ ఆదేశించారు. జేసీ-2 ఖాజామొహిద్దీన్, జేడీఏ శ్రీరామమూర్తితో కలిసి వ్యవసాయ అధికారులతో శనివారం సాయంత్రం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల్లో తగిన ప్రత్యామ్నాయ విత్తనాల స్టాక్ తెప్పించుకోవాలన్నారు. గ్రామాల వారీగా ఏఏ తేదీల్లో విత్తనాలు పంపిణీ చేస్తున్నారో ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. ఆ మేరకే పంపిణీ చేయాలన్నారు. ఈ క్రాపింగ్ ఆధారంగా వేరుశనగ సాగుచేయని రైతులకు మాత్రమే వందశాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. పంపిణీకేంద్రాలకు విత్తనాల కోసం వచ్చే రైతులు ఆధార్ కార్డు, పట్టాదారుపుస్తకం,సెల్ నెంబర్‌తీసుకువచ్చేలా సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పకడ్బందీగా ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంపిణీ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలని పోలీసు యంత్రాంగాన్ని కలెక్టర్ ఆదేశించారు.

బాలల చట్టాలపై అవగాహన అవసరం

-జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి



ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి

అనంతపురం లీగల్: బాలల హక్కులపై ప్రజలకు, పోలీసులకు అవగాహన అవసరమని, ముఖ్యంగా బాలనేరస్తుల విషయంలో మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఒక రోజు శిక్షణతరగతుల్లో ప్రసంగించిన ఆయన బాలలు, వారి నేరాల విషయంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని, నేరాలను, బాలల మనస్తత్వాలను బేరీజు వేసుకోవాలని, అందుకు అనుగుణంగా పరిశోధన జరగాలని సూచించారు. పోలీసు అధికారులు మూస పద్ధతిలో నేర పరిశోధన చేయకుండా, పిల్లల మానసిక పరిస్థితిని, వారి పరిసరాలు, కుటుంబ నేపథ్యం తదితర వాటిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీసులకు ఈ కేసులపై అవగాహన కల్పించేందుకు న్యాయమూర్తులు, జువైనల్ జస్టిస్ కోర్టు బోర్డు వారు శిక్షణ తరగతులు నిర్వహించడం హర్షణీయమన్నారు. పిల్లల చట్టాలు, వారిలోని నేర ప్రవృత్తి, త దితరవాటి గురించి, వారిలో నేర ప్రవృత్తిని నిర్మూలించడానికి పోలీసులు, న్యా యశాఖ, స్వచ్ఛంద సంస్థలు తీసుకోవాల్సిన చర్యల గురించి అదనపు జిల్లా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యకుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కమలాకర్‌రెడ్డి, న్యాయమూర్తి గీతావాణి, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఆనంద్, నారాయణస్వామి, పలువురు ఇన్‌స్పెక్టర్లు, పోలీసుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు అరకొరే..

15 మండలాల్లో ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ ప్రారంభం
స్టాక్ లేక మిగతాచోట్ల పంపిణీకి నోచుకోని వైనం
పలు ప్రాంతాల్లో రైతుల పడిగాపులు

అనంతపురం కలెక్టరేట్: తొలిరోజు శనివారం జిల్లాలో ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ అరకొరగానే సాగింది. ఈ పంపిణీ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. తొలిరోజు కేవలం 15 మండలాల్లోనే ప్రారంభం కావడం విశేషం. జిల్లాకు ఈఏడాది 1.12 లక్షల క్వింటాళ్ల లక్ష్యం కాగా ఇప్పటివరకు 7వేల క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే జిల్లాకు తెప్పించారు. 35 మండలాల్లో ఆయా విత్తనాలను నిల్వ చేశారు. కాగా, పలుమండలాల్లో తక్కువగా స్టాక్ ఉండడంతో పంపిణీ ప్రారంభించలేకపోయారు. పంపిణీ మొదలుపెట్టిన ప్రాంతాల్లోనూ సవ్యంగా సాగలేదు. లాంఛనంగా ప్రారంభించినట్టుగానే తొలిరోజు పంపిణీ చేసి సరిపెట్టారు.

ఏపీసీడ్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వం వందశాతం సబ్సిడీ వర్తింపజేసిన ఏడు రకాల ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా చేస్తున్నారు. మిగతా విత్తనాలను పలురకాల ప్రైవేటు కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. అయితే పంపిణీకి అవసరమైన మోతాదులో ప్రత్యామ్నాయ విత్తనాలను జిల్లాకు తెప్పించడంలో జాప్యం జరుగుతోంది. దీని మూలంగా అనేక మండలాల్లో విత్తన పంపిణీ నేటికీ ప్రారంభానికి నోచుకోలేదనే విమర్శలున్నాయి. మరోవైపు జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వస్తున్నారు. అయితే ఆశించిన స్థాయిలో స్టాక్ లేకపోవడంతో పంపిణీ చేయలేని దుస్థితి నెలకొంది. జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకుని విత్తనాలు సత్వరం జిల్లాకు తెప్పించకపోతే రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే ప్రమాదముందనే అభిప్రాయాలు వ్యవసాయశాఖ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి. మరి ఏ మేరకు ఉన్నతాధికారులు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

రెవెన్యూ ఉద్యోగులకు గుర్తింపు కార్డుల అందజేత

అనంతపురం కలెక్టరేట్: రెవెన్యూ ఉద్యోగులకు కలెక్టర్ వీరపాండ్యన్ చేతుల మీదుగా శనివారం గుర్తింపుకార్డులు అందజేశారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తయారు చేసిన ఈ గుర్తింపుకార్డులను స్థానిక కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో పలువురు ఉద్యోగులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు గుర్తింపుకార్డులివ్వడం మంచిదన్నారు. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూఉద్యోగులందరికీ కార్డులిచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అటెండర్లనుంచి సీనియర్ అసిస్టెంట్ల వరకు పదోన్నతుల కోసం కొన్నేళ్లుగా ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని కలెక్టర్ దృష్టికి యూనియన్ నాయకులు తీసుకువెళ్లారు. త్వరలో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయరామప్ప, నీలకంఠారెడ్డి, కోశాధికారి కుళ్లాయప్ప, వీఆర్‌ఓల సంఘం నాయకులు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు 441 మంది హాజరు

అనంతపురం కలెక్టరేట్: ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు 441 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ, ఇంటర్ కళాశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష కొనసాగింది. రెండవ రోజు 688 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 441 మంది హాజరయ్యారు. మిగిలిన 247 మంది గైర్హాజరయ్యారు. ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు వసంత, కుమార్‌రాజా, సురేష్‌బాబు పరీక్షా కేంద్రాల్లోనే ఉండి పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. ఈ పరీక్షలకు లైజనాఫీసర్‌గా సురేష్‌బాబు, అసిస్టెంట్ లైజనాఫీసర్లుగా నాగభూషణం, జయరాముడు వ్యవహరించారు.

కసాపురం ఆలయ సమాచారం ఖాద్రి


శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకాలు, అలంకారాలు, పూజా కార్యక్రమాలు. 5 గంటలకు సర్వదర్శనం. మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన, మహా మంగళ హారతి. మధ్యాహ్నం ఆలయం మూసివేత. 2 గంటలకు ఆలయంలో పూజల పునఃప్రారంభం. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. రాత్రి 8 గంటలకు మహామంగళ హారతి.



శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 20న ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు శ్రీవారి దర్శనం. 7.30 గంటల నుంచి 10 గంటల వరకు అభిషేకాలు. 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీవారి దర్శనం. సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారి దర్శనం. ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు కల్యాణోత్సవం.



మినీ లోకం



సీఎం ప్రారంభించిన నీటి కుంటకు జల కళ

పామిడి: మండలంలోని కాళాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో ఏప్రిల్ 20న నీరు - ప్రగతిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన నీటికుంట శనివారం కురిసిన వానతో జలకళ సంతరించుకుంది. 44వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ నీటికుంట వర్షపునీటితో నిండి ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. భూగర్భ జలాలు పెంపొందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తవ్విస్తున్న పారంపాండ్లు ఎంతో దోహదపడుతాయని మండల రైతులుఅభిప్రాయపడుతున్నారు.



సీఎం ప్రారంభించిన నీటికుంట వర్షపు నీటితో జలకళ సంతరించుకున్న దృశ్యం

సామాన్యుడి ఫోన్‌కాల్‌కు స్పందించిన కలెక్టర్

పారిశుధ్య సమస్యకు పరిష్కారం

కదిరి: నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ వీరపాండ్యన్ పారిశుధ్యంపై ఓ సామాన్యుడి ఫోన్‌కాల్‌కు స్పందించారు. తక్షణమే సమస్యను పరిష్కరించారు. ఆ తరువాత ఫిర్యాదుదారుడికి ఆ సమాచారంతో పాటు ఫొటో కూడా పంపించి ఎలా బాధ్యతాయుతంగా ఉండాలో ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారు. కదిరి పట్టణంలో మూడు రోజులుగా చెత్త తొలగించకపోవడంతో ప్రధాన కూడళ్లలో అది బాగా పేరుకుపోయింది. ఇందులో భాగంగానే స్థానిక రాయలసీమ సర్కిల్‌లో ఉన్న చెత్తకుప్ప నిండిపోయి నడిరోడ్డుపైకి విస్తరించడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చే యగా.. ఉన్నవి రెండే ట్రాక్టర్లని, వాటితోనే 36 వార్డుల్లో చెత్తను తొలగించాల్సి ఉన్నందున ఆలస్యమవుతుందని సమాధానమిచ్చారు. దీంతో చెత్త పేరుకుపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడిన ఫొటోను జిల్లా కలెక్టర్‌కు వాట్సప్ ద్వారా స్థానికులు పంపించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వెంటనే పట్టణంలో చెత్తకుప్పలు తొలగించి ఆ ఫొటోలను తనకు పంపించాలని ఆదేశించారు. కలెక్టర్ జోక్యం చేసుకోవడంతో మున్సిపల్ సిబ్బంది హుటాహుటిన పట్టణంలో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లి శుభ్రపరిచారు. ఈ ప్రక్రియనంతా ఫొటోలు తీసి జిల్లా కలెక్టర్‌కు పంపించారు. సమస్య పరిష్కారమైన వెంటనే జిల్లా కలెక్టర్ తనకు వాట్సప్ ద్వారా ఫొటో పంపించిన స్థానికుడికి 'సమస్య పరిష్కారమైంది' అనే సమాచారంతో పాటు చెత్తకుప్ప తొలగించి శుభ్రం చేసిన ఫొ టోను పంపించారు. జిల్లా కలెక్టర్ స్పందించిన తీరుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.




కలెక్టర్‌కు పంపిన రాయలసీమ సర్కిల్‌లో చెత్త పేరుకుపోయిన ఫొటో, శుభ్రం చేసిన తర్వాత దృశ్యం

సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడులు

ఉద్యాన పంటల ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రసాయనిక ఎరువులు ఎక్కువ మోతాదులో వాడడం వల్ల పండ్ల తోటల్లో దిగుబడులు తగ్గుతున్నాయని, సేంద్రియ ఎరువులు వాడితేనే అధిక దిగుబడులు సాధించవచ్చునని వైఎస్సార్ హార్టికల్చర్ పరిశోధన కేంద్రం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక కేకే అగ్రహారంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, గ్రోమోర్ రైతు ఖజానా ఆధ్వర్యంలో రైతులకు ఉద్యానపండ్లతోటలపై శనివారం అవగాహనాకార్యక్రమం నిర్వహించారు. దీనికి ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులుతో పాటు కోరమాండల్ జోనల్ మేనేజర్ గోవిందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉద్యాన పంటల సాగులో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించినప్పుడు మాత్రమే రసాయనిక ఎరువులు వాడాలన్నారు. అలా కాకుండా సొంత ప్రయోగాలు చేయడం వల్ల పలుచోట్ల పంటలు దెబ్బతింటున్నాయన్నారు. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల రైతుకు పెట్టుబడుల ఖర్చు ఆదా కావడంతో పాటు పండ్లు, కూరగాయలు నాణ్యతగా ఉంటాయని తెలిపారు. జిల్లాలో పండ్లతోటలు విస్తారంగా పెంచాలన్నారు. వాటి ద్వారా వచ్చే ఆదాయం ఇతర ఏ పంటల్లోనూ రాదన్నారు. రైతన్నలు పంటమార్పిడి తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం గ్రోమోర్ ఖజానా లక్కీడ్రా నిర్వహించగా కేకే అగ్రహారం గ్రామానికి చెందిన నాగప్ప అనే రైతుకు ద్విచక్ర వాహనం బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ శ్రీదేవి, భర్త గోవిందరెడ్డి, కోరమాండల్ సిబ్బంది అలి,మోహన్‌కుమార్, రమణారెడ్డి, మంజునాథ్‌రెడ్డి, శివశంకర్, చంద్రమోహన్, అమర్‌నాథ్‌రెడ్డి, పవన్‌కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు

ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సప్తగిరిసర్కిల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ మహిళా అధ్యయన కేంద్రంలో బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కేవీ రమణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2013 నుంచి 2017 వరకూ యూనివర్శిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్ష పాసైన వారు, ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, నర్సింగ్ డిప్లొమా పాసైన వారందరూ డిగ్రీలో ప్రవేశం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 08554-245908కు సంప్రదించాలన్నారు.

నేడు సార్వత్రిక ప్రాథమిక అక్షరాస్యతా పరీక్షలు

- సాక్షర భారత్ డిప్యూటీ డైరెక్టర్ ఉమాదేవి

అనంతపురం కలెక్టరేట్: జాతీయ సార్వత్రిక ప్రాథమిక అక్షరాస్యతాపరీక్షలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు సాక్షర భారత్ డిప్యూటీ డైరెక్టర్ ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 52 మండలాల పరిధిలోని 479 గ్రామ పంచాయతీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏదైనా మూడు గంటల వ్యవధిలో పరీక్షకు హాజరుకావచ్చునన్నారు. 14వ దశ ఎన్ఐఓఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కానివారు, ఆ పరీక్షలకు గైర్హాజరైన వారు తప్పనిసరిగా ప్రస్తుత పరీక్షకు హాజరుకావాలన్నారు. ఇందులో చదవడం, రాయడం, సంఖ్యా పరిజ్ఞానంపై పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైనవారికి జాతీయ సార్వత్రిక విద్యాసంస్థ ద్వారా ధ్రువపత్రాలు అందించనున్నామన్నారు. మండల, గ్రామస్థాయిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించాలని కోరారు. పరీక్షాకేంద్రాల వివరాలు మండల అభివృద్ధి అధికారి, సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. గత పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారు తక్కువగా ఉంటే తమ పొరుగు గ్రామాల్లో జరిగే పరీక్షాకేంద్రాల్లోకూడా పరీక్షకు హాజరుకావచ్చునన్నారు.

రీజియన్‌లో నలుగురు ట్రాఫిక్ సూపర్‌వైజర్ల బదిలీ

అనంతపురం సప్తగిరిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీ రీజియన్‌లో నలుగురు ట్రాఫిక్ సూపర్‌వైజర్లు బదిలీ అయ్యారు. హిందూపురం నుంచి ధర్మవరానికి ఎస్. హరిత, కదిరి నుంచి పుట్టపర్తికి రవికుమార్, పెనుకొండ నుంచి హిందూపురానికి బీ పెద్దన్న, హిందూపురం నుంచి పెనుకొండకు వీ రమణమ్మను పీఓ చంద్రాయుడు బదిలీ చేశారు.

ఆంధ్రజ్యోతి

4

కళ్యాణదుర్గం

ఆదివారం 20, ఆగస్టు 2017

● కళ్యాణదుర్గం ● కంబదూరు ● బ్రహ్మసముద్రం ● శెట్టూరు ● కుందుర్పి

అర్హులకు జిప్సం పంపిణీ చేయలేదంటూ ఫిర్యాదు

కంబదూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీచేస్తున్న జిప్సంను అర్హులైన రైతులకు పంపిణీచేయడం లేదని తహసీల్దార్ రఫీక్ అహమ్మద్‌కు కంబదూరు రైతులు ఫిర్యాదు చేశారు. శనివారం జిప్సంను తీసుకునేందుకు వెళ్లిన కంబదూరు రైతులకు వ్యవసాయాధికారులు పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు తహసీల్దార్, విలేకర్ల దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటివరకు అర్హులకు ఎంతమందికి ఇచ్చారో జాబితాను చూపించాలని రైతులు డిమాండ్ చేశారు. వేరుశెనగ వేసుకున్న రైతులకు మాత్రం జిప్సం సక్రమంగా అందడం లేదని రైతులు ఆరోపించారు. అర్హులైన వారికి అందజేయకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రైతులు హెచ్చరించారు.

మత సామరస్యానికి ప్రతీక రోషన్-షా-వలి ఉరుసు

ప్రారంభమైన ఉరుసు : భారీగా తరలివచ్చిన హిందూ, ముస్లింలు





కొండపై వెలసిన రోషన్-షా-వలి - ఉరుసుకు తరలివచ్చిన భక్త జన సందోహం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ శివార్లలోని రోషన్ వలి కొండవద్ద హాజరత్ సయ్యద్ జలాలీ రోషన్-షా-వలి ఉరుసు శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఉరుసులో భాగంగా గత రెండురోజులుగా పట్టణంలో గంధం, షంషీర్ కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం రోషన్‌వలి పీర్లను పట్టణ పురవీధుల గుండా ఊరేగిస్తూ రోషన్-షా-వలి కొండ వరకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలతో తీసుకు రావడం జరిగింది. ఈనెల 17న గంధం, 18న షంషీర్, 19న ఉరుసు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ శివార్లలోని రోషన్-షా-వలి వన్నూరుస్వామి కొండలో జీవసమాధిని భక్తాదులు పెద్దఎత్తున సందర్శించి చదివింపులు చేపట్టారు. మతసామరస్యానికి ప్రతీకగా హిందూ ముస్లింలు పెద్దఎత్తున తరలివచ్చారు. సుమారు 700 సంవత్సరాల క్రితం ఇరాన్ దేశానికి చెందిన ముస్లిం మతప్రవక్త ఇక్కడ జీవ సమాధి అయినట్లు, అప్పటి నుంచి ప్రతి ఏడాది ఉరుసు నిర్వహించడం జరుగుతోంది. రోషన్-షా-వలి ఉరుసును తిలకించడానికి కళ్యాణదుర్గం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచే కాకుండా పెనుగొండ, అనంతపురం, రాయదుర్గం, కర్నాటకలోని చెళ్లికెర, పావగడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉరుసు సందర్భంగా పలు రకాల తినుబండారాల అంగళ్లు, కొండ వద్ద వెలిశాయి. కొండపైకి వెళ్లే భక్తాదులకు దర్గా కమిటీ, ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక తరపున తాగునీటి సౌకర్యం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తుల కొంగు బంగారమైన రోషన్-షా-వలి సమాధిని దర్శించుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

లోకల్ గైడ్ (local guide)

ఎమ్మెల్యే డైరీ

కళ్యాణదుర్గం టౌన్: శాసనసభ్యులు, ఉన్నం హనుమంత రాయ చౌదరి ఆదివారం సంధ్యాలలో ఉంటారు. స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండరు.

కళ్యాణదుర్గం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోటా 40, పచ్చిమిర్చి 60, వంకాయలు 60, లావుమిర్చి 50, ఎర్రగడ్డలు 40, ఆలుగడ్డలు 20, బెండ 30, బీరకాయలు 30, బీన్స్ 40, కాకర 40, చౌడే కాయలు 30, క్యాబేజి 30, బీట్‌రూట్ 40, క్యారెట్ 60

కళ్యాణదుర్గంలో మాంసం ధరలు

మటన్ : 340, చికెన్ : 180, నాటుకోడి : 260
చేపలు : 120, కోడి గుడ్లు(డజన్) : 48

కళ్యాణదుర్గం సినిమాలు

సౌభాగ్య : జయజానకి నాయక, వెంకటేశ్వర : నేనే రాజు నేను మంత్రి, నూర్‌ముబారక్ : ఫిదా

పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామీణ పోస్టల్ ఉద్యోగులు

కళ్యాణదుర్గం టౌన్: పోస్టల్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనంతపురం డివిజన్ సర్కిల్ ఉపాధ్యక్షులు క్రిష్టయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలుచేయడంతో పాటు ఎనిమిది గంటల పని కల్పించి, ఉద్యోగాలను క్రమబద్దీకరించాలని, జడీఎస్‌లకు పెన్షన్ మంజూరు, తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్, శ్రీనివాసులు, శ్రీరాములు, రాజప్ప, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పోలీసుల ప్రచారం

శెట్టూరు: ప్రమాదాల నివారణ కొరకు శెట్టూరు పోలీసులు శనివారం ప్రయాణికులకు రోడ్డు నిబంధనలను వివరించే ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ కుళ్లాయప్ప మాట్లాడుతూ మితిమీరిన వేగంతో ప్రయాణించరాదని, హెల్మెట్, సీటు బెల్టును విధిగా ధరించాలన్నారు. రోడ్డు నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ రామాంజినేయులు కానిస్టేబుల్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కుందుర్పి: మండలంలో వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటుచేసేవారు కేవలం మూడు రోజులు మాత్రమే అనుమతి ఉంటుందని వారు పేర్కొన్నారు. మూడురోజులకు నిమజ్జనం చేపట్టాలని, అలా నిమజ్జనం చేయని యెడల అటువంటి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు

బొచ్చుపల్లిలో వనం -మనం

శెట్టూరు: మండల పరిధిలోని బొచ్చుపల్లి గొల్లలదొడ్డి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంబదూరు అటవీ శాఖ సెక్షన్ అధికారి రామచంద్రనాయక్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జగన్నాథం, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ రాజేశ్వరిలు హాజరయ్యారు. వనం- మనం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను విద్యార్థులకు అప్పచెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరారెడ్డి, ఉపాధ్యాయుడు తిప్పేస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి గ్యాస్ తప్పనిసరి

శెట్టూరు: ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండటానికి గ్యాస్ కనెక్షన్ తప్పనిసరిగా వాడాలని తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంఈఓ శ్రీధర్‌లు కోరారు. స్థానిక ఎమ్మార్సీలో శనివారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాల గ్రాంటు నుంచి రూ.4వేలతో గ్యాస్ కనెక్షన్ పొందాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పొగరహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా గ్యాస్ కనెక్షన్లు తప్పనిసరిగా వాడాలని సూచించారు.

వర్షం కోసం పూజలు

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని నారాయణపురంలో శనివారం గ్రామస్తులు వర్షం కోసం పూజలు చేశారు. గ్రామ చావిడిలోని బొడ్రాయి వద్ద పూజలతో పాటు 101బిందెల నీటితో అభిషేకం చేశారు. సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు పండాలని, రైతులను చల్లగా చూడాలని ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ పూజల్లో గ్రామపెద్దలు హనుమంతప్ప, వెంకటేశులు,తిమ్మన్న, ఈరన్న, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

మిశ్రమ వ్యవసాయ పద్ధతులను పాటించండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

కళ్యాణదుర్గం టౌన్: మిశ్రమ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ జాన్ సుధీర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కేవీకేలో ముదిగల్లు, నారాయణపురం, కోనాపురం, చాపిరి గ్రామాల రైతులకు మిశ్రమ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ నాగన్న, శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు, తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై దృష్టిసారించి మిశ్రమ వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని, అప్పుడే కుటుంబ ఆదాయ వృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం ప్రపంచ తేనెటీగల దినోత్సవం సందర్భంగా తేనెటీగల పెంపకం ప్రాముఖ్యతను వివరించారు. ప్రకృతి వ్యవసాయంపై అక్టోబర్ 5నుండి 10వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు తిమ్మప్ప, రాజేష్, ఆదినారాయణ, మహేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు విజ్ఞానమేళా ఎంతో ఉపయోగం



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న సభికులు

కళ్యాణదుర్గం టౌన్: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి విజ్ఞాన మేళాలు ఎంతగానో ఉపయోగపడుతాయని డాక్టర్ రంగనాథ్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బీకేహెచ్ రాజగోపాల్‌లు పేర్కొన్నారు. స్థానిక సరస్వతి విద్యామందిరంలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు కరణం తిరుమలరావు అధ్యక్షత వహించగా, డాక్టర్ రంగనాథ్, బీకేహెచ్ రాజగోపాల్, శ్రీదేవి విద్యాసంస్థల అధినేత సంపత్‌కుమార్, రామమోహన్ గుప్తా, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోను ఏదో ఒక నైపుణ్యం దాగిఉంటుందని, అది వెలుగులోకి వచ్చినప్పుడే తగిన గుర్తింపు దక్కుతుందన్నారు. ప్రతి విద్యార్థి తనవంతుగా ప్రత్యేకతను చాటుకోవడానికి ఇలాంటి విజ్ఞాన మేళాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన నమూనాలు సభికులతో పాటు తిలకించడానికి వచ్చిన వారిని అబ్బుర పరిచాయి. ఈ కార్యక్రమంలో లక్ష్మన్న, పొణ్యాం రంగనాథ్, శిరిడినాథ్, జయరాం పూజారి, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాలకు

జింక్ పంపిణీ

బొమ్మనహాళ్ : మండలంలోని బొమ్మనహాళ్, దేవగిరి గ్రామాలకు శనివారం జింక్ పంపిణీ చేసినట్లు ఏఓ అహ్మద్ బాషా తెలిపారు. బొమ్మనహాళ్, దేవగిరిలకు చెందిన 96 మంది రైతులకు మూడు టన్నుల జింక్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటనారాయణ, ఎంపీఈఓలు ఇలియాజ్, అనిల్, అవినాష్, ధనుశ్రీ, నాగరత్న పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

బ్రహ్మసముద్రం: మండలంలోని అజ్జయ్యదొడ్డి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త శ్యామలాదేవి ఆధ్వర్యంలో గర్భవతులకు పసుపు, కుంకుమ, జాకెట్‌లు అందజేసి సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, ఆకుకూరలు, పాలు, పండ్లు అధిక సంఖ్యలో తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కుందుర్పి: మండల పరిధిలోని మలయనూరు, అల్లాపురం, అపిలేపల్లి, బెస్తరపల్లి, వడ్డుపాళ్యం, కుందుర్పి, వడ్రపల్లి, నిజవెళ్లి, తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా ఆలయాల్లో ఉదయం నుండి గంగపూజ, పుష్పాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.




నవగ్రహ హోమం - అలంకరణలో నృసింహ స్వామివారు

శ్రావణ శని త్రయోదశి వేడుకలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణ శని త్రయోదశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కోట వీధిలోని భవాని శంకర దేవాలయం, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం, శృంగేరి శంకరమఠం నందు ఉదయాన్నే ప్రత్యేక అభిషేకాలతో పాటు నవగ్రహ హోమం నిర్వహించారు. అదేవిధంగా శ్రావణమాస చివరి శనివారం కావడంతో మండల పరిధిలోని తిమ్మప్ప కొండపై పెద్దఎత్తున పూజలు నిర్వహించగా, భక్తాదులు తరలివచ్చారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ర్యాలీ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఫొటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఇందు కు సంబంధించి ఐదుమండలాల ఫొటో, వీడియో గ్రాఫ ర్లు వాల్మీకి విగ్రహం నుండి టీసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రి, ఆర్డీటీ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోవిందరాజులు మాట్లాడుతూ ఎన్నో కుటుంబాలు ఫొటోగ్రఫీ, వీడియో గ్రాఫర్లుగా ఆధారపడి జీవిస్తున్నారని, తమకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించాలని కోరారు.

జెక్కిరెడ్డిపల్లిలో వైద్య శిబిరం

కంబదూరు: మండల పరిధిలోని జెక్కిరెడ్డిపల్లిలో రెండవ రోజుల వైద్యసిబ్బంది పర్యటించి రోగులకు వైద్య చికిత్సలు అందించారు. శనివారం వైద్యాధికారి రంగవేణి ఆధ్వర్యంలో గ్రామంలోని ఇంటింటికి వెళ్లి మంచినీటి తొట్లెలను శుభ్రం చేయించారు. రోగులకు వైద్య చికిత్సలు అందజేసి మందులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కుమార వెంకటేశ్వర్లు, పీహెచ్ఎన్ రాజేంద్రమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.



నీటి తొట్టెలను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

డెంగీ నివారణకు సమష్టి కృషి : ఆర్డీఓ

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతను పెంపొందించడమే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిదినని ఆర్డీఓ కేఎస్ రామారావు పేర్కొన్నారు. శనివారం శ్రీ వాసవి సొసైటీ, ఆయుష్ హోమియో విభాగం ఆధ్వర్యంలో ఐదు మండలాలకు సంబంధించి విద్యార్థులకు ఉచితంగా హోమియో మందులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో మండల విద్యాశాఖాధికార్లకు రుటాక్స్-200 హోమియో మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఐదు మండలాల పరిధిలో 307 పాఠశాలల పరిధిలో 30,747మందికి సరిపడే హోమియో మందులను అందజేయడానికి ముందుకు వచ్చిన శ్రీ వాసవి సొసైటీ సభ్యులను అభినందించారు. మూడు రోజుల పాటు ప్రతిరోజు విద్యార్థులకు ఈ మందులు పంపిణీచేయాలన్నారు. ప్రాణాంతక వ్యాధి అయిన డెంగ్యూ వాధి నివారణకు సమిష్టిగా కృషిచేయాలన్నారు. దోమలు దరి చేరకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్య, ఆరోగ్య శాఖతో సంప్రదించి పాఠశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ లాల్యానాయక్, వాసవి సొసైటీ సభ్యులు జయం ఫణీంద్ర, నాగరాజు, బాలాజి, ఎంఈఓలు పాల్గొన్నారు.



హోమియో మందులను పంపిణీచేస్తున్న ఆర్డీఓ

వంట ఏజెన్సీల పొగ కష్టాలను తొలగించడమే లక్ష్యం

కళ్యాణదుర్గం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు పొగ కష్టాలను తొలగించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్డీఓ కేఎస్ రామారావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్సీ కేంద్రం వద్ద ఎంఈఓ విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి, సీఎస్‌డీటీ అన్వర్‌లతో కలిసి వంట ఏజెన్సీలకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీని చేపట్టారు. అనంతరం మండల పరిధిలోని 81పాఠశాలల వంట ఏజెన్సీలకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు.



గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేస్తున్న ఆర్డీఓ

తెలుగుదేశం పార్టీ కార్యాలయాలకు భూమి పూజ

బ్రహ్మసముద్రం: మండలకేంద్రంలో తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ కార్యాలయ నిర్మాణానికి శనివారం తెలుగు యువత నాయకులు ఉన్నం మారుతి చౌదరి భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం నిర్మాణానికి కన్వీనర్ శ్రీరాములు చొరవచూపి భూమిపూజ నిర్వహించారు. కార్యాలయం లేక పార్టీ కార్యకర్తలు, నాయకులు వ్యవసాయ తోటలలో సమావేశాలు నిర్వహించుకునేవారు. ఇబ్బందులను గుర్తించిన కన్వీనర్ స్థానిక కార్యకర్తలు అందుబాటులో ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలంటే మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ఉండాలని గుర్తించి నిర్మాణానికి పూనుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు ఉదయ్‌భాస్కర్ చౌదరి, నాయకులు వన్నూరుస్వామి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని చెరువుకట్ట సమీపంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చే పట్టారు. ఈ భూమిపూజ కార్యక్రమానికి తెలుగుయువత నాయకులు ఉన్నం మారుతి చౌదరి, ఉన్నం ఉదయ్‌భాస్కర్ చౌదరిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీ నియర్ నాయకులు ఆర్‌జీ శివశంకర్, మండల కన్వీనర్ తిప్పారెడ్డి, స్థానిక నాయకులు గురుప్రసాద్, రామరాజు, చిత్త ప్ప, ఎంపీటీసీ నాగరాజు, బీసీసెల్ నాయకులు నగేష్, రంగ ప్ప, ఆదిశేషు, రంగనాథశెట్టి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఉన్నం మారుతీ

నంద్యాల ఉప ఎన్నిక తీరు

సిగ్గు చేటు : లోక్‌సత్తా



మాట్లాడుతున్న నాయకులు

కంబదూరు (నూతిమడుగు): కర్నూలు జిల్లా నంద్యాల నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల తీరును చూసి రాష్ట్ర ప్రజలు సిగ్గుతో తల దించుకుంటున్నారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. వెంకటరమణబాబు విమర్శలు గుప్పించారు. శనివారం మండల పరిధిలోని నూతిమడుగులో లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు ఆదిశేషయ్యతో కలిసి పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో జరుగుతున్న రాక్షస రాజకీయంపై నిఘా వేయాల్సిన ఎన్నికల కమీషన్ మౌనంగా కళ్లు మూసుకుని వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎన్నికల కమీషన్‌కు ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే లోక్‌సత్తా పార్టీ వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చేసేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో లోక్‌సత్తా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కళ్యాణదుర్గం టౌన్: స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్లిన గోవిందరాజులు, వాణి, లలితేశ్వరి, శీన, మోహన్, విజయ, తదితరులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మన్న, సత్యనారాయణ, నీలిమ, నాగవేణి పాల్గొన్నారు.

శెట్టూరు: మండల పరిధిలోని ములకలేడు జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన 14మంది ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. ప్రస్తుత హెచ్ఎం జయచంద్రనాయుడు, ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ గోపాల్‌లు పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు.

కుందుర్పి: మండల పరిధిలోని బసాపురం ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశులుతో పాటు గ్రామస్తులు, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన ఐదు మంది ఉపాధ్యాయులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా విద్యనందించారన్నారు.



కుందుర్పి మండలం బసాపురంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

అద్దెల రూపంలో వ్యాపారం చేస్తే ఎలా..?

- పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఖాళీ చేయాల్సిందే..
- అనుమతి ఉన్న వారే క్వార్టర్స్‌లో ఉండాలి
- బయటి వ్యక్తులు తక్షణమే వెళ్లిపోవాలి
- నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం : ఆర్ఎంఓ లలిత

అనంతపురం వైద్యం: ప్రభుత్వాస్పత్రి ఉద్యోగుల నివాసం కోసం తక్కువ అద్దెకు క్వార్టర్స్ సదుపాయం కల్పిస్తే.. కొందరు ఉద్యోగులు కాసులకు కక్కుర్తిపడి.. నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు వాటిని అధిక అద్దెలకు ఇచ్చి వ్యాపారం చేయడమేమిటి..? అని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్ఎంఓ లలిత మండిపడ్డారు. ఈమేరకు 'దందాకు కాదేదీ... అనర్హం..!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి మేనేజర్ శ్వేత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్నతో కలిసి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

స్థానిక జీసస్‌నగర్‌లోని ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్స్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ముందుగా గతంలో నిర్మించి ఇచ్చిన 48 క్వార్టర్స్‌కు సంబంధించి మొదట్లో ఎవరికి అనుమతి ఇచ్చాం..? ప్రస్తుతం ఎవరు ఉన్నారు..? ఎవరెవరు ఎంత అద్దె బకాయి ఉన్నారు? ఎంతమంది బయటి వ్యక్తులు క్వార్టర్స్‌లో ఉన్నారు..? తదితర విషయాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇందులో కొందరు ఉద్యోగులు తక్కు వ అద్దెకు క్వార్టర్స్‌కు అనుమతి పొంది..అదే విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అధిక మొత్తానికి అద్దెకివ్వడం.. అడ్వాన్స్‌గా వేలాది రూపాయలు తీసుకోవడం.. పైగా అద్దెలు చెల్లించకపోవడం వంటివి ఆమె దృష్టికి రావడంతో అవాక్కయ్యారు. 'మరీ ఇంత దారుణమా..? ఇంతలా అద్దె రూపంలో వ్యాపారం జరుగుతోందా?' అని విస్తుపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి కథనంపై జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. దీంతో పాటు అర్హులైన వారికి మాత్రమే క్వార్టర్స్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు' అన్నారు. క్వార్టర్స్‌లో కేటాయించిన వారు కాకుండా ఇతరులు ఉన్న విషయం వాస్తవమేనన్నారు. కేటాయించిన వారే ఉండడంతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లిస్తే క్వార్టర్స్‌లో ఉంచుతామని, లేదంటే ఖాళీ చేయిస్తామన్నారు. రానున్న నాలుగు రోజుల్లో పెండింగ్ బకాయిలు చెల్లించాలని.. లేకపోతే వారి జీతాల్లో కట్ చేయిస్తామన్నారు. అనుమతి ఉన్న ఉద్యోగులు మాత్రమే క్వార్టర్స్‌లో ఉండాలని, బయటి వాళ్లను వారం రోజుల్లో ఖాళీ చేయిస్తామన్నారు. గతంలో క్వార్టర్స్ పొందిన వారు పెండింగ్ బకాయిలు చెల్లించాలని హెచ్చరించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహ రించిన వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు వారిని తక్షణమే ఖాళీ చేయించి ఇతర ఉద్యోగులకు ఆ క్వార్టర్స్‌ను కేటాయిస్తామన్నారు. కొందరు ఉద్యోగులైతే తక్కువ అద్దెకు అనుమతి పొంది.. అదే విభాగంలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులకు ఎక్కువ అద్దెలకు ఇచ్చిన వారిపై ప్రత్యేక దృష్టిసారించి.. ప్రస్తుతం ఉంటున్న వారు అర్హులైతే వారికే క్వార్టర్స్ కేటాయి స్తామన్నారు. ఈనెలాఖరు వరకూ చూసి సెప్టెంబర్ 1న నిబంధనలకు విరుద్ధంగా వ్యవరించిన వారిని పోలీసుల ద్వారా ఖాళీ చేయిస్తామన్నారు.

తమకు క్వార్టర్స్ కావాలనుకున్న వారు పెండింగ్ బకాయిలు త్వరగా చెల్లించి నిబంధనల ప్రకారం నూతన అనుమతి పత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జాఫర్, ఎంఎన్ఓ రమణయ్య, సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఫారూక్, సిబ్బంది మాదవరెడ్డి, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.



క్వార్టర్స్‌లోని ఉద్యోగుల వివరాలను పరిశీలిస్తున్న ఆర్ఎంఓ లలిత

ఘాటెక్కిన మిర్చి

ధరలు లేక గత సీజన్‌లో రైతన్న కుదేలు - నేడు పైపైకి..
గత ఏడాది 14వేల హెక్టార్లలో సాగు - ఈ ఏడాది 2వేల హెక్టార్లకే పరిమితం
క్వింటాల్‌పై రూ. 2వేలపైగా ధర పెరుగుదల - పురంలో 30 వేల క్వింటాళ్ల నిల్వలు

హిందూపురం: ఈ సంవత్సరం మిర్చి ధరలు బాగా పెరిగాయి. అయితే దీనివల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూరడం లేదు. కారణం వర్షాభావంతో ఈసారి జిల్లాలో మిరప సాగువిస్తీర్ణం గణనీయంగా తగ్గిపోవడమే. అయితే గత ఏడాది పంటను శీతలగిడ్డంగుల్లో నిల్వ ఉంచిన వ్యాపారులకు మాత్రం లాభాల పంట పండనుంది. ఈఏడాది మే, జూన్ నెలల్లో పురం మార్కెట్‌లో ఎండుమిర్చి ధర నేలచూపులు చూసింది. అలాంటిది ప్రస్తుతం అమాంతం పెరిగిపోయింది. క్విం టాల్‌పై రూ. 2000 నుంచి రూ.2500 వరకు పెరిగింది. ఎండుమిర్చి నిల్వ ఉంచిన వ్యాపారులు, రైతులు దీన్ని అవకాశంగా తీసుకుని పెరిగిన ధరలకు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. హిందూపురం మార్కెట్‌లో 2016 జూలై, ఆగస్టులో ఎండు మిర్చి మొదటి రకం (క్వింటాల్) ధర గరిష్ఠంగా రూ.16 వేల నుంచి రూ.19 వేల వరకు పలికింది. అదే సెప్టెంబర్ నెల వచ్చేసరికి రూ. 13వేలకు పడిపో యింది. ఇక జనవరిలో అయితే రూ.10 వేలకు చేరుకుంది. మే, జూన్ నాటికి రూ.4వేల నుంచి 6వేల వరకు పడి పోయింది. దీంతో ఆరుగాలం కష్టించి పండించిన రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటకు పెట్టుబడులు కూడా చేతికందక నిరాశ చెందారు. గత్యంతరం లేక చాలామంది రైతులు మార్కెట్‌లో ఎంతోకొంత ధరకు విక్రయించి చేతులు దులుపుకోగా.. మిరికొందరు మాత్రం నిల్వ ఉంచుకున్నారు. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కర్నూలు, కడప, కర్ణాటకలోని మధుగిరి, తుమకూరు, గౌరీబిదనూరు ప్రాంతాల నుంచి కారుచౌక ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఇక్కడికి తీసుకువచ్చి శీతలగిడ్డంగుల్లో నిల్వఉంచారు. ఈనెల ప్రారంభం నుంచి ధరలు పెరగడంతో నిల్వ ఉంచిన పంటను బయటికి తీసి విక్రయిస్తున్నారు. బళ్లాపురం, బ్యాడిగ రకాలపై ప్రతి క్వింటాల్‌కు రూ. 2 వేలకు పైగా ధరలు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతుండగా.. వాస్తవానికి మరింత ధర పెరిగినట్లు తెలుస్తోంది. ఇందుకు ప్రధాన కారణం.. ఈఏడాది మిర్చి సాగు విస్తీర్ణం తగ్గిపోవడమేనని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ధరలు మరింతగా పెరిగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటున్నారు. ధరల పెరుగుదలతో నిల్వ ఉంచిన వ్యాపారులు, రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఆగస్టు నెల సగం గడిచినా పెరగని సాగు విస్తీర్ణం

ప్రతిఏటా జూలై నుంచి సెప్టెంబర్ 15లోపు అధికంగా మిర్చి నాట్లు వేస్తారు. ఈఏడాది ఆగస్టు రెండవవారం దాటినా జిల్లాలో కేవలం వందల ఎకరాల్లోనే పంట సాగుచేశారు. ఇందుకు వర్షాభావ పరిస్థితులు, గత ఏడాది ధరలు లేకపోవడం ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. నాట్లు వేయడానికి మరో నెలన్నర రోజుల గడువు ఉన్నా.. జిల్లావ్యాప్తంగా 2నుంచి 3 వేల హెక్టార్లలోపే మిరప సాగుచేయవచ్చునని ఉద్యానశాఖ అధికారులు భావిస్తున్నారు. గత ఏడాది జి ల్లావ్యాప్తంగా 14వేల హెక్టార్లలో పచ్చిమిర్చి సాగుచేశారు. హిందూపురం ప్రాంతంలో గత ఏడాది చిలమత్తూరు, లేపాక్షి, పరిగి మండలాల్లోనే వెయ్యి ఎకరాల వరకు సాగుచేయగా ఈ ఏడాది ఇప్పటివరకు 50 ఎకరాలు దాటలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏప్రిల్, మేనెలల్లో ఎండు మిర్చి ధర పతనం కావడంతో ఈఏడాది మిరపసాగు ప్రశ్నార్థకంగా మారింది. జూన్, జూలై నెలల్లో పచ్చిమిర్చి కిలో ధర రూ.100లు పలకగా.. ఎండుమిర్చి కనీసం రూ.50లు కూడా పలకకపోవడం రైతులను నిరాశపరిచింది. దీనితోడు ధరలు లేక నిల్వ ఉంచుకున్న రైతులకు వ్యాపారులు జూన్‌లో ధరల రూపంలో షాక్ ఇచ్చారు.జీఎస్టీ అమలు కూడా ఇబ్బంది కలిగించింది.గత ఏడాది ఆగస్టు నుంచి జిల్లాలోని పలు ప్రాంతాలు, కర్ణాటక నుంచి పురం మార్కెట్‌లో సుమారు 30 వేల క్వింటాళ్ల వరకు బళ్లాపురం, బ్యాడిగ, గుంటూరు రకాలు నిల్వ ఉంచినట్లు తెలిసింది.

మహిళ అదృశ్యం

ఆంధ్రజ్యోతి అనంతపురం : ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామానికి చెందిన పుష్పలత అనే మహిళ అదృశ్యమైంది. ఈ మేరకు ఆమె భర్త వీరాంజనేయులు శనివారం అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నగర శివారులోని సీఆర్ఐటీ కళాశాలలో పుష్పలత ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈనెల 17వ తేదీ ఉదయం 9.40గంటల సమయంలో ఇంటి నుంచి కళాశాలకు వచ్చింది. ఆ తరువాత ఆమె ఇంటికివెళ్లలేదు. భార్య ఆచూకీ కోసం బంధువులు, మిత్రులతో వాకబు చేశాడు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. పలు ప్రాంతాల్లోనూ ఆరా తీశాడు. భార్య ఆచూకీ లభించకపోవడంతో శనివారం అనంపురం రూరల్ పోలీసులను ఆశ్రయించి, ఆ మేరకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ క్రిష్ణమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వీడండి

- కలెక్టర్ వీరపాండ్యన్

అనంతపురం కలెక్టరేట్: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వీడాలని కలెక్టర్ వీరపాండ్యన్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వ్యక్తిగత మరుగుదొడ్లనిర్మాణాల పురోగతిపై శనివారం మండల స్థాయి అధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 22వ తేదీలోగా పెండింగ్‌లోని మరుగుదొడ్లు పూర్తి చేయాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులకు వ్యక్తిగత మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించి ఆ మేరకు ముందుకు వెళ్లాలన్నారు. కారణాలు చెప్పకుండా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాల్సిందేనన్నారు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన కేంద్ర బృందం పరిశీలన

- మూడో రోజు నాలుగు పాఠశాలల తనిఖీ



సీకేపల్లిలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

అనంతపురం అర్బన్: రాష్ట్రీయమాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) పథకాల అమలుపై అధ్యయనం కోసం జిల్లాకు వచ్చిన కేంద్రబృందం శనివారంతో తన పర్యటన ముగించింది. మూడు రోజులగా వివిధ ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలలను కమిటీ పరిశీలించింది. మూడవ రోజు శనివారం నాలుగు పాఠశాలలను పరిశీలించింది. పుట్టపర్తి మండలం పెడబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ధర్మవరం ఆదర్శ పాఠశాల, ధర్మవరం రూరల్ మండలంలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, సీకేపల్లి మండలం వెంకటాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలను కేంద్ర ప్రతినిధులు పరిశీలించారు. తొలి రెండు రోజులు పాఠశాలల నిర్వహణ తీరుపై ఆ బృందం కొంత అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలసిందే. అయితే మూడవరోజు కొంత సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా సీకేపల్లి మండలం వెంకటాంపల్లి పాఠశాలను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్థాయిలో ఆహ్లాదకర వాతావరణంలో ఉండడం చూసి.. ఆ బృందం హర్షం వ్యక్తం చేసింది. ఆ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులను అభినందించారు. మూడు రోజుల పరిశీలన ముగియడంతో నివేదికలను కమిటీ తయారు చేసింది. నివేదికలను కేంద్రప్రభుత్వానికి అందజేయనున్నారు.

పాఠశాల నిర్వహణ తీరు భేష్...

- వెంకటాంపల్లి ఉన్నతపాఠశాల సందర్శనలో కేంద్రబృందం సభ్యులు
- విద్యార్థులతో ముఖాముఖి

చెన్నేకొత్తపల్లి: పాఠశాల వాతావరణం, నిర్వహణతీరు చాలా అద్భుతంగా ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి విద్యాభివృద్ధికి కృషి చే స్తుండడం అభినందనీయమని కేంద్ర బృందం సభ్యులు ప్రశంసించారు. మండలంలోని వెంకటంపల్లి ఉన్నతపాఠశాలను శనివారం ఆర్ఎంఎస్ఏ దక్షిణభారత పరిశీలన బృందం సభ్యులు వాసుదేవన్, విజయ్‌కుమార్, శ్రీరాములు, తరుణ్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోకి రాగానే అక్కడ ఉన్న పచ్చదనాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ప్రభుత్వ పాఠశాలను ఇంత పెద్దఎత్తున అభివృద్ధి చేయడం ఇక్కడే చూస్తున్నామని కొనియాడారు. గ్రామస్థులతో పాటు ప్రధానోపాధ్యాయుడు లోకేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందాన్ని వారు అభినందించారు. అనంతరం ప్రతి తరగతి గదినీ క్షుణ్ణంగా పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన వసతులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా ల్యాబ్‌తో పాటు స్టాఫ్‌రూం, మైదానం, గ్రంథాలయం, పిల్లలకు అందిస్తున్న విద్యావిధానం పరిశీలించి బాగా ఉన్నాయని ప్రశంసించారు. ప్రభుత్వం ఆర్ఎంఎస్ఏ కింద అందించిన నిధులతో తరగతి గదులను కూడా బాగా నిర్మించారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాలలోని పలువురు విద్యార్థినీవిద్యార్థులతో కేంద్ర బృందం సభ్యులు ముఖాముఖి నిర్వహించారు. 'మీ జీవిత లక్ష్యం ఏమిటి?' అని వారు ప్రశ్నించగా పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలు తెలిపారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ఏ తరగతి చదువుతున్నారు, పాఠశాలలో సౌకర్యాలు బాగున్నాయా, విద్యాబోధన ఎలా ఉంది, ఇంకా ఏమి అవసరాలు ఉన్నాయని బృందం సభ్యులు విద్యార్థులను ప్రశ్నించారు. దీంతో విద్యార్థులు క్రీడా సామగ్రితో పాటు దుస్తులు అవసరమని తెలిపారు. వ్యక్తిగతంగా ఏఏ క్రీడలంటే ఇష్టమని అడగడంతో విద్యార్థులు తమకిష్టమైన క్రీడల గురించి వివరించారు. ప్రతిరోజూ ఏ సమయానికి పాఠశాలకు వస్తారని అడగడంతో, ఉదయం 9.45 గంటలకు పాఠశాలకు వస్తామని, ప్రార్థన అనంతరం తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పిల్లలతో ముఖాముఖి అనంతరం బృందం సభ్యులు వారితో మాట్లాడుతూ..మంచి వాతావరణంలో ఉపాధ్యాయుల నడుమ బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.

అనంతరం కేంద్రబృందం సభ్యులు పాఠశాల బోధనాసిబ్బందితో పాటు ఎస్ఎంసీ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులతో తమ అభిప్రాయాలు తీసుకున్నారు. అనంతరం సభ్యులను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏపీఓ వేణుగోపాల్‌కృష్ణ, గోపాల్, సురేష్, జడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు లోకేశ్వర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ భజన మందిరం కూల్చివేత

పురంలో ఉద్రిక్తం..

ఆర్యవైశ్యుల ఆందోళన..

స్థల వివాదమే కారణం..

నిందితులను అరెస్టు చేస్తామన్న డీఎస్పీ..

హిందూపురం టౌన్/అర్బన్: స్థానిక బాలాజీనగర్‌లో ఉన్న వాసవీ భజన మందిరాన్ని శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఎక్స్‌కవేటర్లతో కూల్చేశారు. దీంతో శనివారం పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 1978లో బాలాజీ నగర్‌లో అశ్వత్థనారాయణకు పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని బుడేన్‌సాబ్‌కు విక్రయించినట్లు 1978లో బుడేన్‌సాబ్.. రంగయ్య అనే వ్యక్తికి ఆ స్థలాన్ని అమ్మేశారు. ఇతడి నుంచి డీఎస్ నాగేంద్రప్రసాద్, కృష్ణమూర్తి, సత్యనారాయణకు విక్రయించారు. వీరు అక్కడ గతంలో 15 సెంట్ల భూమిలో పప్పుల పరిశ్రమకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం పొందారు. దానిని చెల్లించకపోవడంతో వేలం వేశారు. వేలంలో సత్యవతమ్మ అనే మహిళ కొనుగోలు చేసింది. 2011లో ఈ భూమి తమదేనని బుడేన్‌సాబ్ కుమారుడు.. అబూసలేహా అనే వ్యక్తికి విక్రయించినట్లు చెబుతున్నారు. 2014లో అబూసలేహా కూమారుడు బాషా నుంచి తాడిపత్రికి చెందిన ఆదినారాయణరెడ్డి స్థలాన్ని కొనుగోలు చేశాడు. దీంతో స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లగా.. అక్కడ ఆర్యవైశ్య భజన మందిరం ఉంది. తమకు భూమి చూపించాలని బాషాను ఆదినారాయణ రెడ్డి అడిగినట్లు తెలిసింది. నాలుగు నెలల కిందట బాషా భూమి తమదంటూ మందిరం గోడలను కూల్చేందుకు యత్నించగా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ వివాదం నేపథ్యంలోనే శుక్రవారం రాత్రి తాడిపత్రి వ్యక్తితోపాటు హిందూపురానికి చెందిన మరికొంతమంది కలసి ఎక్స్‌కవేటర్‌తో భజనమందిరాన్ని కూల్చేశారు. అందులోని వాసవీమాత విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విషయం శనివారం ఉదయం పట్టణమంతా వ్యాపించింది. దీంతో ఆర్యవైశ్యులు పట్టణంలో స్వచ్ఛందంగా దుకాణాలు మూసేసి, అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. భజన మందిరాన్ని కూల్చేసిన దుండగులను అరెస్టు చేయాలని డీఎస్పీ కరీముల్లా షరీఫ్‌కు వినతి అందించారు. శనివారం ఉదయం భజన మందిరం కూల్చి, అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారన్న సమాచారంతో భారీ ఎత్తున జనం అక్కడికి చేరుకున్నారు. ఒకానొక దశలో ఒక వర్గానికి సంబంధించి మనోభావాలు దెబ్బతీశారని ధర్నాలకు సిద్ధమయ్యారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామనీ, వెంటనే అరెస్టు చేస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో శాంతించారు. ఉదయం నుంచి పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.




నేలమట్టమైన వాసవీ భజన మందిరం

2014లో రిజిస్ట్రేషన్ సందర్భంగా జరిగిన తప్పిదమే ఈ ఘటనకు తావిచ్చిందని ఓ అధికారి పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాలయ్య నియోజక వర్గంలో శాంతిభద్రతలు విఘాతం కలిగితే చెడ్డపేరు వస్తుందని ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆయన పీఏ వీరయ్యకు విషయం తెలియజేశారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిపై ఆరాతీశారు. న్యాయం చేయాల్సిందిగా పోలీసులను కోరారు. హిందూసురక్ష సేవాసమితి ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేసి, పూజలు చేశారు. భజన మందిరాన్ని కూల్చివేశారన్న విషయం తెలుసుకున్న హిందూ సరక్ష సేవా సమితి సభ్యులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఒకానొక దశలో ఉద్రిక్తత తలెత్తొచ్చని అందరూ భయపడ్డారు. అంతా సద్దుమణగడంతో ఊపిరి పీల్చుకున్నారు.





ధ్వంసమైన వాసవీ మాత విగ్రహం, అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసిన దృశ్యం, డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఆర్యవైశ్యులు

పాము కాటుతో రైతు మృతి

నేత్రాలను దానం చేసిన కుటుంబికులు..

కూడేరు: అన్నదాత చావు తర్వాతా దాతృత్వాన్ని చాటుకున్నాడు. మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు కాకర్ల వెంకటనాయుడు (55) పాము కాటుతో శనివారం మృతి చెందాడు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. శనివారం ఉదయం రైతు వెంకటనాయుడు కౌలుకు తీసుకున్న భూమిని కూలీలతో కలిసి శుభ్రం చేస్తుండగా... చేతికి పాము కాటేసింది. వెంటనే కుమారుడు మంజునాథ్ ద్విచక్రవాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు, బంధువులు భారీగా తరలివచ్చారు. రైతుకు భార్య సువర్ణమ్మ ఉంది. కుమారుడు మంజునాథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



మృతిచెందిన వెంకటనాయుడు

రైతు నేత్రాలు దానం...

పాము కాటుతో మృతి చెందిన రైతు వెంకటనాయుడు నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ప్రభుత్వాస్పత్రి వైద్యులు నేత్రాలను దానం చేయాలని రైతు కుటుంబ సభ్యులను కోరడంతో వెంటనే అంగీకరించారు. తమ కుటుంబ పెద్ద కళ్లు మరొకరికి ఉపయోగపడతాయన్న ధృక్పథంతో దానం చేశారు.

గుర్తుతెలియని మహిళ శవం లభ్యం

తాడిపత్రిరూరల్: మండలంలోని తలారిచెరువు సమీపాన శనివారం గుర్తుతెలియని మహిళ శవాన్ని పోలీసులు గుర్తించారు. సమీపంలోని పవర్‌గ్రిడ్ లైన్‌కు సంబంధించిన టవర్ పక్కనున్న గుట్ట వద్ద మహిళ శవం పడి ఉండగా.. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెళ్లి, పరిశీలించారు. ఆమె వయసు 28-33 సంవత్సరాల మధ్య ఉంటుందని ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. కుడి చేతిపై హెచ్ఎస్ అనే ఆంగ్ల అక్షరాలు, పచ్చబొట్టు, ఎడమ చేతిపై ఒక పచ్చబొట్టు ఉన్నాయన్నారు. చెవికి కమ్మలు, ఎడమ చేతికి ఉంగరం, రెండు కాళ్లకు కడియాలు ఉన్నాయన్నారు. తెలుపు, పింక్ కలర్ చీర, నల్లని, పింక్ కలర్ జాకెట్ ధరించిందన్నారు. ఎడమ కంటి కణతి కింద, ఎడమ చెవి కింద లోతైన గాయాలున్నాయన్నారు. చనిపోయి మూడునాలుగు రోజులు అయి ఉంటుందని తెలిపారు. తలారిచెరువు వీఆర్వో గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కసాపురంలో భక్తుల నగదు చోరీ

గుంతకల్లురూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల జేబులకు దొంగలు కన్నం వేశారు. అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గార్లదిన్నె నారాయణరెడ్డి స్నేహితులతో కలసి శనివారం స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చారు. నాలుగో శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయం కిక్కిరిసింది. క్యూలైన్‌లో నిలిచి ఉన్న నారాయణరెడ్డి ప్యాంటు జేబులోని రూ.82 వేల నగదును దొంగలు చోరీ చేశారు. రాయదుర్గానికి చెందిన హరి అనే భక్తుడి జేబు నుంచి రూ.3వేలు చోరీ చేసినట్లు ఆలయ అవరణలోని పోలీసు అవుట్‌పోస్టులో బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సద్గురుడు, ఆలయ అధికారులు దొంగల కదిలికలను పసిగట్టేందుకు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. దొంగల ఆచూకీ కనిపించకపోవడంతో సీసీ కెమెరా పరిధిలో లేనిచోట చోరీ చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బందోబస్తు ఉన్నప్పటికీ దొంగలు తమ పని కానిచ్చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది. దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేపట్టారు.

రిమోట్ సెల్స్ పేలి విద్యార్థులకు గాయాలు

పుట్టపర్తిరూరల్: మండలంలోని పెడబల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం రిమోట్‌కు ఉపయోగించే సెల్స్ పేలి, ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. పాఠశాలలో ఉదయం ప్రార్థన ముగిసన తరువాత తరగతులు ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయుడు గోపాల్‌నాయక్ మూడో తరగతి గదిలో విద్యార్థుల హాజరును వేస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థి నాగేంద్రనాయక్ వెంట తెచ్చుకున్న పాత చైనా సెల్స్‌లతో ఆడుకుంటుండగా.. ఒకదానితో ఒకటి రాపిడి జరిగి పేలిపోయాయి. దీంతో నాగేంద్రనాయక్‌తోపాటు పక్కనే ఉన్న మరో విద్యార్థి అరవింద్ కూడా గాయపడ్డాడు. వారిని హుటాహుటిన 108 ద్వారా సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖాధికారి వెంకటరమణనాయక్ ఆస్పత్రికి వచ్చి, విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులు గాయపడటంపై పుట్టపర్తిరూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంఈఓలను అడగ్గా.. ఇంట్లో టీవీ రిమోట్‌కు వాడిన చైనా సెల్సులను విద్యార్థి నాగేంద్ర నాయక్ వెంట తెచ్చుకున్నాడనీ, వాటిని గట్టిగా నొక్కడంతో పేలినట్లు తోటి విద్యార్థుల ద్వారా తెలుస్తోందన్నారు. సెల్సుల మూలంగానే పేలుడు వాటిల్లిందని ఎస్ఐ వివరించారు.




పేలుడుకు కారణమైన రిమోట్ సెల్ ↑

ప్రమాదంలో గాయపడిన విద్యార్థి నాగేంద్రనాయక్ ←

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడిపత్రిరూరల్: మండలంలోని ఆటోనగర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి మద్యం మత్తులో రోడ్డుపై ఉన్న గుర్తుతెలియని వ్యక్తిపై వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడు గళ్లచొక్కా వేసుకుని, గడ్డంతో ఉన్నాడని ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

వేర్వేరుచోట్ల ఇద్దరి ఆత్మహత్య

పామిడి/రొద్దం: పట్టణంలోని పామిడి రైల్వే స్టేషన్ సమీపాన సపోటా తోటలో గుర్తుతెలియని వ్యక్తి (55) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం వద్ద నీటి బాటిల్, విషపు గుళికలు పడి ఉన్నాయి. మృతుని కుడి చేతిపై చంద్రశేఖర్ అని పచ్చబొట్టు ఉంది. తెల్లపంచె, తెల్ల చొక్కా ధరించాడు. మృతదేహాన్ని సీఐ నరేంద్రరెడ్డి పరిశీలించారు. విషపు గుళికలు మింగి, చనిపోయినట్లు తెలిపారు. మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిప్పంటించుకుని వృద్ధురాలు..

రొద్దం మండలంలోని తాడంగిపల్లి గ్రామానికి చెందిన నేసే వెంకటలక్ష్మమ్మ (75) ఒంటరి తనాన్ని భరించలేక, జీవితంపై విరక్తి చెంది శనివారం కిరోసిన్ పోసుకుని, నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్తకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య అయిన ఈమెకు పిల్లలు లేకపోవడంతో 40 ఏళ్లపాటు ఒంటరి జీవితం గడిపింది. దీనిని భరించలేక వృద్ధాప్యంలో ఆలనాపాలనా చూసుకునేవారు లేక మనస్తాపం చెంది, ఆత్మహత్య చేసుకున్నట్లు జమేదార్ నర్సింహులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామన్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన కారు

10 జీవాల మృతి

ఉరవకొండ: మండలంలోని బూదగవి సమీపంలో శనివారం రాత్రి గొర్రెల మందపై కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 10 గొర్రెలు మృతిచెందాయి. బూదగవి గ్రామానికి చెందిన రామస్వామి, వన్నూరుస్వామి, రామాంజనేయులు, మరికొందరు గొర్రెలను ఇంటికి తోలుకెళ్తుండగా.. అనంతపురం నుంచి బళ్ళారి వైపు వెళ్తున్న కారు వేగంగా గొర్రెల మందపై దూసుకెళ్లింది. దీంతో 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరికొన్ని గాయపడ్డాయి. దీంతో రూ.1.50 లక్షల వరకూ నష్టపోయినట్లు బాధితులు తెలిపారు. ఆ మేరకు వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



చుట్టుముట్టిన రక్తపిపాసులు!

పల్లెలు, పట్నాలు, నగరాలు అన్న తేడాలేకుండా అన్నీ పరిశుభ్రతకు దూరమయ్యాయి. మురుగు కాలువలు నిండుకున్నాయి. చెత్త దిబ్బలు పెరిగిపోయాయి. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎక్కడికెళ్లినా.. చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. గ్రామాలు, పట్నాల ప్రధాన వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో ప్రజలు విషజ్వరాలు, ఇతర రోగాలతో నరక యాతన అనుభవిస్తున్నారు. ఎందరో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇప్పటికైనా దోమలను అరికట్టకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఆదివారం ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్..

- ఎక్కడికెళ్లినా వెంటాడుతున్న దోమలు..
- పల్లెలు, పట్నాల్లో పడకేసినపారిశుధ్యం..
- నిండుకున్న కాలువలు..
- శుభ్రం చేసే నాథుడేడీ?
- విషరోగాల బారిన పడుతున్న ప్రజలు..
- 30 మండలాల్లో 83 గ్రామాలు సమస్యాత్మకం..
- అరికట్టకుంటే.. పెనుముప్పు తప్పదు..

నేడు ప్రపంచ దోమల నివారణ దినం..

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యుల కొరత, అధికారుల నిర్లక్ష్యంతో జిల్లాలో దోమలు రోజురోజుకీ వ్యాప్తి చెందుతున్నాయి. జిల్లాలో పట్టణ, గ్రామాలు తేడాలేకుండా అపరిశుభ్రత, కలుషిత నీరు, ఆహారం రోగులను మంచాన పడేస్తున్నాయి. దీంతో జిల్లాలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రధానంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. వైద్యులు, అధికారులు తూతూ మంత్రంగా దోమల నివారణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారే.. తప్పా.. క్షేత్రస్థాయిలో చొరవ చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు జిల్లాలో విజృంభిస్తున్న జ్వరాలే నిదర్శనం. దోమల నివారణకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మస్కిటో కాయిల్స్, లిక్విడ్, దోమతెరలు తదితరాలెన్నో వాడుతున్నారు. స్థోమతకు మించి ఖర్చు పెడుతున్నారు. వారి నెల బడ్జెట్‌లో దోమల నివారణకు భారీగా వెచ్చిస్తున్నారు.




ధర్మవరంలో..

ధర్మవరం మున్సిపాలిటీలో దోమల నివారణకు గతేడాది రూ.4లక్షల దాకా వెచ్చించినట్లు రికార్డులు చెబుతున్నారు. ఫాగింగ్ మిషన్‌కు డీజిల్ ఖర్చు మాత్రమే మున్సిపాలిటీ భరిస్తుంది. పాలిథిన్, ఆయిల్ బాక్స్‌లు, మిలాథిన్ తదితరాలను వైద్యశాఖ భరిస్తుంది. ఫాగింగ్ మిషన్ డీజిల్ కోసం రూ.4లక్షలు కేటాయించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది రూ.లక్ష దాకా ఇచ్చినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణశర్మ పేర్కొన్నారు. గతేడాది ఫాగింగ్ మిషన్లు మొరాయించడంతో 30 రోజులు కూడా పూర్తిగా పనిచేయలేదు. అలాంటపుడు డీజిల్ ఖర్చు అంత మొత్తంలో రావడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది.

అనంతలో..


అనంతపురం నగరంలో సరాసరి నెలకు ఏకంగా రూ.98 లక్షల వరకూ ప్రజలు మస్కిటో కాయిల్స్, లిక్విడ్ వంటి వాటి కోసం వెచ్చిస్తున్నారంటే ఆశ్చర్యపోనక్కరలేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం నగరంలో 2.61 లక్షల మంది నివసిస్తున్నారు. 62,452 కుటుంబాలున్నాయి. ఈ ఆరేళ్లలో నగర జనాభా 3.65 లక్షలకు చేరుకుంది. కుటుంబాల సంఖ్య 70 వేలకు చేరుకుందని అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఒక్కో కుటుంబం నెలకు రీఫిల్స్‌పై రూ.140 వరకూ ఖర్చు చేస్తోంది. కాయిల్స్‌పై రూ.120 వరకూ వెచ్చిస్తోంది. ఈ లెక్కన నగరంలోని 70 వేల కుటుంబాలు సరాసరి నెలకు రూ.98 లక్షలు వెచ్చిస్తున్నాయని తెలుస్తోంది. అధికారులు.. కాలువల్లో స్ప్రేయింగ్, వీధుల్లో ఫాగింగ్ చేయాల్సి ఉంది. నగర పాలక సంస్థ బడ్జెట్‌లో ఏకంగా రూ.20 లక్షలు వీటి కోసం వెచ్చించారు. అధికారులు మాత్రం నగరంలో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేసిన దాఖలాలు వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. చాలా డివిజన్లలో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయలేదని స్థానికులు, కార్పొరేటర్లే మండిపడుతున్నారు.





పంచాయతీల్లో..

ఎన్నడూ లేని విధంగా గ్రామ పంచాయతీలకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జిల్లా పరిషత్‌కు సంబంధం లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలకే నిధులు కేటాయించింది. అవి పక్కదారి పడుతున్నాయి. ఉన్న నిధులన్నీ సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్ల నిర్మాణం, తాగునీటికే వినియోగిస్తున్నారన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. పారిశుధ్యానికి అతితక్కువ శాతం నిధులు ఖర్చు చేస్తున్నారనే విషయం స్పష్టమవుతోంది. విచిత్రమేమిటంటే.. చిన్న పంచాయతీల్లో మురికి కాలువల్లో పూడికతీసే నాథుడే లేడు. మేజర్ పంచాయతీల్లో మాత్రమే పారిశుధ్య సిబ్బందికి వేతనం అందుతోంది. జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రికి వచ్చే రోగుల్లో 80 శాతం మంది గ్రామీణ ప్రాంత ప్రజలున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ కూడా చేయడం లేదనే విమర్శలున్నాయి. జిల్లాలోని ప్రతి మండలంలోనూ 20కిపైగా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



తాడిపత్రిలో

తాడిపత్రి మున్సిపాలిటీలో దోమల నియంత్రణకు 2015-16 సంవత్సరంలో రూ.8.60లక్షలు ఖర్చు చేశారు. ఫాగింగ్, మలాథియన్, మురికి కాలువలు, కుంటల్లో స్ప్రేయింగ్, అబెట్, ఎంఎల్ ఆయిల్‌కు ఈ మొత్తం ఖర్చు చేశారు. 2016-17లో రూ.3 లక్షల వరకు ఖర్చు చేయాలని అధికారులు నిర్ణయించారు. గతేడాది దోమల నియంత్రణకు చేసిన ప్రయత్నాలు ఫలితాలివ్వడంతో ఖర్చును 50శాతం వరకు తగ్గించామని అధికారులు చెబుతున్నారు.



మడకశిరలో..

మడకశిర మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు గతేడాది రూ.2 లక్షలు ఖర్చు చేశారు. ఇందులో రెండు ఫాగింగ్ మిషన్లు, మిగతా మొత్తాన్ని ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్ పౌడర్ వంటి వాటికి ఖర్చు చేశారు. ఈ సంవత్సరం మూడు నెలలకుగాను రూ.80 వేల వరకు వెచ్చించారు. నెలలో ఫాగింగ్ చేయడానికి 15 లీటర్ల డీజిల్, పెట్రోల్ 4 లీటర్ల చొప్పున వినియోగిస్తున్నారు.



రాయదుర్గంలో..

గతేడాది రాయదుర్గంలో పారిశుధ్యం మెరుగుకు రూ.1.06 కోట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అంతకుమించి రూ.1.47 కోట్ల వరకు వెచ్చించినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. వీటిలో 57 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు రూ.96.67 లక్షలు వేతనాలుగా చెల్లించారు. చెత్తను తరలించే ట్రాక్టర్లు, ఆటోలకు రూ.12 లక్షల వరకు వెచ్చించారు. క్రిమిసంహారక మందుల కొనుగోలుకు రూ.5.05 లక్షలు, కార్మికులకు దుస్తులు, సోప్‌లు, పరికరాలకు రూ.4 లక్షలు చెల్లించారు. ప్రస్తుత ఏడాది బడ్జెట్‌లో రూ.1.51 కోట్లు కేటాయించారు.



కదిరిలో..

దోమల నివారణకు కదిరిలో ఆగస్టు నెలలోనే రూ.48వేలు ఖర్చు చేశారు. ఇందులో రూ.38వేలు మలాథియాన్ మందు కొనుగోలుకు, రూ.9,884 ఫాగింగ్ మిషన్ల డీజిల్‌కు వెచ్చించారు. ఇలా ఏడాదిలో రూ. 6 లక్షల దాకా ఖర్చు చేసినట్లు, గత ఏడాది కూడా దాదాపు ఇంతే మొత్తం వెచ్చించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ తెలిపారు.

గత ఐదేళ్లలో జిల్లాలో నమోదైన మలేరియా కేసుల వివరాలు..

సంవత్సరం	కేసుల సంఖ్య
2014	515
2015	559
2016	757
2017	264

2017లో నమోదైన డెంగీ కేసుల వివరాలు..

నెల	లక్షణాలు బయటపడిన వారి సంఖ్య	నిర్ధారణ అయిన వారి సంఖ్య
జనవరి	622	50
ఫిబ్రవరి	617	37
మార్చి	449	26
ఏప్రిల్	271	23
మే	124	14
జూన్	45	4
జూలై	30	7
ఆగస్టు	10	3
మొత్తం		164



హిందూపురంలో..

హిందూపురం మున్సిపాలిటిలో ఏటా దోమల నివారణకు రూ.6 లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నారు. ఫాగింగ్, మురికి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రేయర్లు, యంత్రాలకు ఇంధనంతోపాటు దోమల నివారణకు కరపత్రాలు, అవగహన సదస్సుల నిర్వహణకు ఖర్చు చేస్తున్నట్లు పారిశుధ్య విభాగ సిబ్బంది లెక్కలు చూపుతున్నారు. 2017-18గాను రూ.7లక్షల అంచనాలు సిద్ధం చేశారు. నిధులు ఖర్చు చేస్తున్నా పట్టణంలో ఎటుచూసినా మరుగునీరు చెరువులను తలపిస్తోంది.

గుంతకల్లులో.....

దోమల నివారణకు గతేడాదితో పోలిస్తే గుంతకల్లు, పామిడి మున్సిపాలిటీల్లో ఎక్కువ నిధులను కేటాయించారు. కిందటి సంవత్సరం గుంతకల్లు మున్సిపాలిటీలో దోమల నిరవారణకు అవసరమైన ఫాగింగ్, స్ప్రేయర్ల నిర్వహణ నిమిత్తం డీజిల్, పెట్రోలు, బయోటెక్స్, ఆయిల్ బాల్స్, మెలాథిన్, టెక్నికల్ కింగ్ ఫాగ్ తదితరాల కోసం రూ.4 లక్షలు వెచ్చించారు. ఈ సంవత్సరం రూ.6 లక్షలను కేటాయించారు. పామిడి నగరపాలక సంస్థలో గతేడాది రూ.1.50 లక్షలను కేటాయించగా, రూ.86 వేలు వెచ్చించారు. ఈ ఏడాది రూ.2.75 లక్షలను కేటాయించారు.



గ్రామాల్లో పారిశుధ్య సమస్య పీడిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రజలను మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గన్యాతో పాటు సీజనల్ వ్యాధులు చుట్టుముట్టాయి. జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో 83 గ్రామాలను సమస్యాత్మకంగా వైద్యాధికారులు గుర్తించారు.

83 గ్రామాలు సమస్యాత్మకం..

జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే....?



ఇటీవల అనంతపురం సర్వజనాస్పత్రి ఓపీ వద్ద ఇదీ పరిస్థితి...

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



జిల్లాలోదోమలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. విషజ్వరాలైన డెంగీ, మలేరియా నివారణపై విడుతల వారీగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఆరోగ్య విషయాలతోపాటు వైద్య శిబిరాలు నిర్వహించి, వారి ఆరోగ్యాన్ని కాపాడే దిశగా వైద్య సిబ్బందిని క్షేత్ర స్థాయికి పంపుతున్నాం. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలైన 23 పీహెచ్‌సీల పరిధిలోని 83 గ్రామాల్లో ఫాగింగ్, మురుగునీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, అపరిశుభ్రత తొలగించడం వంటివి చేస్తున్నాం. నివారణ చర్యలు చేపట్టని వారిపై చర్యలు తీసకుంటాం. దోమల లార్వాను నాశనం చేసేందుకు ఆబిట్ స్ప్రే, డెంగీ నమోదైన ప్రాంతాల్లో వ్యాధి వ్యాప్తి చెందకుండా పైరత్రమ్ స్ప్రే, ఫాగింగ్ చేస్తున్నాం. జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, మున్సిపాలిటీ, ప్రజారోగ్య, గ్రామీణ, నీటి సరఫరా తదితర శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడతాం.

- వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి



రాయదుర్గంలో దుర్గంధం ఇలా...

డబ్ల్యూహెచ్ఒ రాయబారి మిల్కాసింగ్

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

అంతర్జాతీయం

పోలియో రహిత దేశంగా సోమాలియా

ప్రపంచ ఆరోగ్య సంస్థ సోమాలియాను పోలియో రహిత దేశంగా ఆగస్టు 13న ప్రకటించింది. మూడేళ్లగా సోమాలియాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆఫ్ఘనిస్థాన్, నైజీరియా, పాకిస్థాన్లలో మాత్రమే పోలియో కేసులు నమోదవుతున్నాయి. సోమాలియాలో చివరిగా 2014లో పోలియో కేసు నమోదైంది. సోమాలియాను పోలియో రహిత దేశంగా ప్రకటించినా వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నందువల్ల టీకాలను నిరంతరం అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది.

బార్సిలోనాలో ఉగ్రదాడి



స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఆగస్టు 17న ఉగ్రవాదులు జరిపిన దాడిలో 13 మంది మరణించారు. బార్సిలోనాలోని లస్ రంబ్లస్ రహదారిలో ఉగ్రవాదులు వ్యానుతో పాదచారుల పైకి దూసుకెళ్లడంతో పలువురు గాయపడ్డారు. దాడి తమ పనేనని ఐసిస్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. పోలీసులు ఐదుగురు ఉగ్రవాదులను కాల్చి చంపారు. పర్యాటకులు, జనసంచారంతో ఉండే ఈ దారిని దాడికి ఉగ్రవాదులు ఎన్నుకొన్నారు. 2004లో స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో అల్‌ఖైదా ప్రేరేపిత ఉగ్రవాదులు రైళ్లలో పేలుళ్లకు పాల్పడటంతో 191 మంది మరణించారు.

అమెరికా ఉగ్ర జాబితాలో 'హిజ్బుల్ ముజాహిదీన్'

కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిజ్బుల్ ముజాహిదీన్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. హిజ్బుల్ అధిపతి సయ్యద్ సలావుద్దీన్‌ను రెండు నెలల క్రితం అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. 1989లో ఏర్పాటైన హిజ్బుల్ కశ్మీర్‌లో పెద్ద ఉగ్రవాద సంస్థల్లో ఒకటి. తాజా ప్రకటనతో ఆ సంస్థకు నిధుల సమీకరణ కష్టతరం కానుంది. ఆంక్షల కారణంగా హిజ్బుల్‌పై చట్టపరమైన సంస్థలు చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

జాతీయం

రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల దిగుబడి

దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి 2016-17 సంవత్సరంలో రికార్డు స్థాయిలో నమోదైంది. 2016-17 మొత్తం 27.56 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయినట్లు కేంద్రం ఆగస్టు 16న ప్రకటించింది. 2015-16లో 25.17 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి వచ్చింది. వరి దిగుబడి 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు పెరిగింది. గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, పప్పు ధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది.

ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా రాజీనామా



ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా తన పదవికి ఆగస్టు 18న రాజీనామా చేశారు. సీఈవోగా తప్పుకొన్న సిక్కాను కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా నియమించారు. తాత్కాలిక సీఈవో & ఎండీగా యూబీ ప్రవీణ్ రావును నియమించారు. 2014 జూన్ 12న సిక్కా ఇన్ఫోసిస్ సీఈవో & ఎండీగా బాధ్యతలు చేపట్టారు. 1986లో ఇన్ఫోసిస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీఐఐ నేషనల్ కౌన్సిల్, నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ప్రవీణ్ సభ్యుడిగా ఉన్నారు. ఇన్ఫోసిస్ బీపీవోకు కూడా ప్రవీణ్ చైర్మన్.

డబ్ల్యూహెచ్ఒ రాయబారి మిల్కాసింగ్

పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి మిల్కాను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపిక చేసింది. ఈ ప్రాంతంలో 2025 నాటికి శారీరక శ్రమ 90 శాతం ఉండేలా, అంటువ్యాధులు కాని రోగాల విస్తృతిని 25 శాతానికి పరిమితం చేసేలా డబ్ల్యూహెచ్ఒ కార్యాచరణ రూపొందించింది. దీనికి ప్రచారకర్తగా మిల్కాను నియమించింది.

పురస్కారం

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

చత్తీస్‌గఢ్ పోలీస్ జవానుకు ఈ ఏడాది అత్యున్నత పోలీస్ పురస్కారం లభించింది. కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం 'రాష్ట్రపతి పోలీస్ శౌర్య' పతకాన్ని ప్రకటించారు. 2015లో నక్సల్స్‌తో జరిగిన పోరులో చత్తీస్‌గఢ్ పోలీస్ ప్లటూన్ కమాండర్ శంకర్‌రావు ప్రాణాలు కోల్పోయారు. పోలీస్ విభాగంలో అత్యున్నత పురస్కారంగా భావించే రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని పొందారు.

ఐదుగురికి 'కీర్తిచక్ర'

శాంతి సమయంలో సైనికులకు ఇచ్చే రెండో అత్యున్నత పురస్కారం 'కీర్తిచక్ర'కి ఈ సారి ఐదుగురిని ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురికి మరణానంతరం ప్రకటించారు. వారిలో గూర్ఖా రైఫిల్స్‌కి చెందిన హవాల్దార్ గిరిస్ గురుంగ్, నాగా రెజిమెంట్‌కు చెందిన మేజర్ డేవిడ్ మన్లుం, సీఆర్పీఎఫ్ 49వ బెటాలియన్ కమాండెంట్ ప్రమోద్ కుమార్ ఉన్నారు. గార్వారా రైఫిల్స్‌కు చెందిన మేజర్ ప్రీతం సింగ్, సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారి చేతన్‌కుమార్ చీతా కీర్తిచక్ర పొందిన మిగిలిన ఇద్దరు.

క్రీడలు

బల్గేరియా ఓపెన్ విజేత లక్ష్యసేన్



బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత యువ క్రీడాకారుడు లక్ష్యసేన్ నిలిచాడు. బల్గేరియా రాజధాని సోఫియాలో జరిగిన టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 18-21, 21-12, 21-17తో క్రొయేషియాకు చెందిన రెండో సీడ్ డుర్‌కిన్ జాక్‌పై గెలిచి టైటిల్ సొంతం చేసుకొన్నాడు. లక్ష్యకు ఇది రెండో అంతర్జాతీయ టైటిల్. గతేడాది ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్‌ను గెలుచుకొన్నాడు. ప్రస్తుతం జూనియర్ ప్రపంచ నెంబర్ వన్‌గా ఉన్న లక్ష్యసేన్‌కు సీనియర్ విభాగంలో ఇది రెండో అంతర్జాతీయ టైటిల్.

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్

శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది.



'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' శిఖర్ ధావన్‌కు, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు హర్దిక్ పాండ్యకు లభించింది. చివరి టెస్టులో భారత ఇన్నింగ్స్ 171 పరుగులతో విజయం సాధించింది. తాజా విజయంతో టెస్టు ర్యాంకింగ్‌లో భారత్ 125 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

రోజర్స్ కప్ విజేత అలెగ్జాండర్

వింబుల్డన్ గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న రోజర్ ఫెదరర్‌ను రోజర్స్ కప్ ఫైనల్లో జర్మనీ యువ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ ఓడించాడు. మాంట్రియాల్‌లో జరిగిన ఫైనల్లో జ్వెరెన్ 6-3, 6-4 తేడాతో ఫెదరర్‌ను ఓడించి కప్ గెలుచుకొన్నాడు. ఈ విజయంతో అలెగ్జాండర్ ప్రపంచ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానానికి చేరుకొన్నాడు.

స్వయం ఉపాధి



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

కారప్పూస, బూందీ, మురుకులు, మిక్చర్ వంటి సంప్రదాయ చిరు ఆహార పదార్థాలు; ఆలు చిప్స్, ఫ్రెంచి ఫ్రైస్, కుర్‌కురే, ఫ్రెయామ్స్ వంటి ఆధునిక టైంపాస్ స్నాక్స్ గురించి మనందరికీ తెలుసు. వీటిలో కొన్ని వంటనూనెలో ఫ్రై చేసినవి కాగా మరికొన్ని ఎక్స్‌ట్రూడెడ్ ఆహార పదార్థాలు. మధ్యాహ్న సమయంలో టీ తోపాటు స్నాక్స్‌గా/ టైంపాస్ స్నాక్స్‌గా వీటిని ఎక్కువగా తింటుంటారు. ఈ ఆహార పదార్థాలు రుచిగా ఉన్నప్పటికీ కొన్ని రకాల అనారోగ్యాలకు కారణమౌతున్నాయి. అందుకే వీటికి ప్రత్యామ్నాయంగా సహజమైన గింజలను లేదా నట్స్‌ను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. జీడిపప్పు, వేరుశనగ గింజలు, బఠాణీలు వంటివి మంచి బలవర్ధకమైన

మిక్స్‌డ్ నట్స్ స్నాక్స్



పోషకవిలువలు ఉన్న నట్స్/ గింజలుగా పరిగణించవచ్చు. వీటిలో తక్కువ కార్బొహైడ్రేట్స్, అధిక పీచు పదార్థం, అధిక కేలరీల శక్తితోపాటు అధికంగా అన్‌శాచురేటెడ్ కొవ్వు ఉంటాయి. అందుకే ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా పుష్టిగా ఉంచేందుకు తోడ్పడతాయి. వేరు శనగ గింజల్లో ఉండే మోనోశాచురేటెడ్ ఫాటీ యాసిడ్స్, రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి తోడ్పడుతున్నట్లు పరిశోధనల్లో వెల్లడయింది. అంతేకాకుండా వీటిలో పుష్కలంగా ఖనిజాలు, విటమిన్లు ఉండటం వల్ల ప్రతిరోజూ పిడికెడు వేరుశనగ గింజలను తినడం ఆరోగ్యానికి మంచిదని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. జీడిపప్పులో అధిక అన్‌శాచురేటెడ్ కొవ్వు, విటమిన్ ఇ, మెగ్నీషియం, జింక్ ఖనిజాలు అధికంగా ఉంటాయి. జీడిపప్పును తినడం వల్ల గుండె సంబంధ వ్యాధులు రాకుండా నివారించవచ్చని, మధుమేహాన్ని కూడా రానివ్వదని పరిశోధకులు తెలియజేస్తున్నారు. బఠానీల్లో ఎముకల వృద్ధికి తోడ్పడే విటమిన్ కె, మాంగనీస్ ఖనిజాలు అధికంగా ఉంటాయి.

రెడీ టు ఈట్ స్నాక్స్ మార్కెట్: ఇటీవల మనదేశంలో ప్యాక్‌డ్ ఫుడ్ వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రెడీ - టు - ఈట్ స్నాక్స్, నమ్‌కిన్స్ మార్కెట్ రూ.50,000 కోట్లకు పైగా ఉంది. 2014 - 19 కాలంలో సగటున ఏడాదికి 22 శాతం వృద్ధి ఉండవచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. పల్లెలు, పట్టణాలు, నగరాల్లో మారుతున్న జీవన సరళి; నూతన ఉత్పత్తుల ఆవిష్కరణపై పెరుగుతున్న ఆసక్తి; పెరుగుతున్న రిటైలింగ్ ; ప్రభుత్వ ప్రోత్సాహకాల కల్పన వంటి కారణాల వల్ల రెడీ టు ఈట్ స్నాక్స్ మార్కెట్ రోజురోజుకీ వృద్ధి చెందుతోంది.

మిక్స్‌డ్ నట్స్ స్నాక్స్: పలు ఆరోగ్య అనుకూల లక్షణాలు ఉన్న అన్ని రకాల గింజలను కలిపి తినడం ద్వారా శరీరానికి మెరుగైన పలు పోషకాలు లభించడానికి అవకాశం ఉంటుంది. బఠాణీలు, జీడిపప్పు, వేరుశనగ వంటివాటిని నేరుగా తినడానికి వీలుగా ఉండేలా తయారుజేసి నిర్ణీత నిష్పత్తిలో వాటిని కలిపి ప్రత్యేకమైన ఒక ప్యాకెట్ ద్వారా అందివ్వడమే మిక్స్‌డ్ నట్స్ స్నాక్స్ యూనిట్ పని.

అవసరమైన యంత్ర పరికరాలు: ● ట్రే డ్రయ్యర్ ● రోస్టర్ ● ఫ్రయ్యింగ్ పాన్ ● కోటింగ్ పాన్ ● ప్యాకింగ్ మిషన్ ● తూనిక యంత్రాలు తదితరాలు

ముడి పదార్థాలు: ● జీడిపప్పు ● వేరుశనగ గింజలు ● డ్రై బఠాణీలు ● వంట నూనె ● ఉప్పు ● మసాలా దినుసులు ● ప్లాస్టిక్ ప్యాకింగ్ ఫిల్మ్ ● అట్టపెట్టెలు

తయారీ విధానం: బఠాణీలను ముందుగా 8 గంటలపాటు నీటిలో నానబెట్టి తరవాత నీరు తీసివేసి రోస్టింగ్ చేయాలి. బఠాణీల పై పొర తీసివేయాలి. వేరు శనగ గింజలను కూడా రోస్టింగ్ చేసి పైపొట్టు తీసివేయాలి. నాణ్యమైన జీడిపప్పును కూడా రోస్టింగ్ చేయాలి. ఈ మూడింటిని నిర్ణీత నిష్పత్తిలో కలిపి ఉప్పు చేర్చి రెడీ టు ఈట్ స్నాక్స్‌గా ప్యాక్ చేయాలి. వీటికి కొంత పరిమాణంలో మసాలా దినుసుల పొడి కలిపి మసాలా నట్స్‌గా కూడా తయారుచేయవచ్చు. మార్కెటింగ్ అవసరాల మేరకు 35గ్రా, 100గ్రా, 250గ్రా, 500గ్రా, 1 కిలో పరిమాణాల్లో ప్యాకెట్లను రూపొందించుకోవచ్చు. ఎక్కువగా 35గ్రా, 50గ్రా ప్యాకెట్స్ వినియోగదారులకు అనుకూలంగా ఉంటాయి.

మార్కెటింగ్: వినియోగదారుల సౌలభ్యం మేరకు అన్ని రకాల రిటైల్ దుకాణాల్లో, సూపర్ మార్కెట్లలో రెడి టు ఈట్ స్నాక్ ప్యాకెట్స్ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలి. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో, బార్ & రెస్టారెంట్లలో వీటికి డిమాండ్ అధికంగా ఉంటుంది.

పరిశ్రమ వివరాలు:

ఉత్పత్తి సామర్థ్యం: 250 కేజీలు(ఒక రోజు - ఒక షిఫ్ట్‌కు)

పరిశ్రమ వ్యయం: రూ.25 లక్షలు

What are the total marks scored...

QUANTITATIVE APTITUDE

Direction (1-5) : What value should come in place of the question mark (?) in the following questions?

1. $\frac{\sqrt{4356}\times\sqrt{?}}{\sqrt{6084}}=11$
(1) 196 (2) 125 (3) 169 (4) 225 (5) 81

2. $4\frac{1}{2}+\left(1\div2\frac{8}{9}\right)-3\frac{1}{13}=?$
(1) $\frac{23}{13}$ (2) $\frac{13}{23}$ (3) $\frac{25}{13}$ (4) $\frac{25}{26}$
(5) None of these

3. $\left\{(441)^{\frac{1}{2}}\times207\times(343)^{\frac{1}{3}}\right\}\div\left\{(14)^2\times(529)^{\frac{1}{2}}\right\}=?$
(1) 5.75 (2) 6.75 (3) 7.75 (4) 6.25 (5) 6.50

4. $-676.76+1237+897.34-?=1294.25$
(1) 168.2 (2) 164.2 (3) 154.2 (4) 164.8
(5) None of these

5. $\frac{(22\times5+8^2+4^2)^2}{12\times25\times6\div36\times2}+\frac{85\times240\times750}{51\times8\times100}+\frac{800\times289}{17\times25}$
= ?
(1) 1360 (2) 1177 (3) 1470 (4) 1280 (5) 1170

Direction (6-10): Study the following table carefully and answer the given questions. Table shows the percentage of marks scored by five different students in six different subjects.

Student→ Marks ↓	Math (150)	English (120)	Reasoning (50)	Computer (50)	Marketing (100)	GS (200)
Lucky	64%	65%	52%	60%	77%	49.5%
Priti	70%	50%	56%	58%	57%	54.5%
Kumkum	65%	75%	70%	54%	63%	57%
Alka	48%	55%	64%	56%	71%	61%
Poonam	56%	40%	48%	46%	53%	52.5%

6. What are the total marks scored by Priti in all the six subjects together?
(1) 378 (2) 386 (3) 388 (4) 398 (5) None of these

7. What is the average marks scored in Reasoning by all the students?
(1) 26 (2) 27 (3) 28 (4) 29 (5) None of these

8. Marks scored by Kumkum in Computer is **approximately** what percentage of marks scored by Alka in English?
(1) 42% (2) 41% (3) 40% (4) 39%
(5) None of these

9. What is the difference between the total marks scored by Lucky in Reasoning and Kumkum in GS and total marks scored by Priti in Reasoning and Alka in Math?
(1) 80 (2) 100 (3) 90 (4) 120 (5) None of these

10. What is the aggregate **approx** percentage of Poonam considering all the six subjects?
(1) 47% (2) 54% (3) 57% (4) 50%
(5) None of these

Direction (11-15) : What will come in place of question mark (?) in the following number series.

11. 3 11 ? 115 567 3411
(1) 25 (2) 27 (3) 42 (4) 37 (5) 33

12. 326.34375 219.0625 90.125 29.25 11 ?
(1) 9 (2) 8 (3) 5.5 (4) 7.5 (5) 6.5

13. 5 4 23 7 3 24 9 2 ? 11 1 14
(1) 29 (2) 31 (3) 20 (4) 21 (5) 25

14. 19 35 89 217 ? 899
(1) 429 (2) 431 (3) 420 (4) 421 (5) 467

15. 19 29 47 77 125 ?
(1) 235 (2) 283 (3) 200 (4) 220 (5) 225

16. A tank is fitted with 8 pipes, some of them that fill the tank and other pipes are meant to empty the tank. Each pipe that fills the tank can fill it in 8 hours, while each of those that empty the tank can empty it in 6 hours. All the pipes are kept open. When the tank is full, it will take exactly 6 hours for the tank to empty. How many pipes are filling the tank?
(1) 4 (2) 3 (3) 6 (4) 2 (5) None of these

17. Wheels of diameters 7 cm and 14 cm start rolling simultaneously form X and Y, 1980 cm apart, towards each other in opposite directions. Both of them make same number of revolutions per second. If both of them meet after 10 second, then find the speed of the smaller wheel.
(1) 32 cm/s (2) 42 cm/s (3) 56 cm/s
(4) 66 cm/s (5) 44 cm/s

18. There is a ring road connecting points P, Q, R and S. The road is in a complete circular form but having several approach roads leading to the centre. Exactly in the centre of the ring road there is a tree which is 20 Km from Point P on the circular road. You have taken a round of circular road starting from point P and finish at the point after touching points Q, R and S. You then drive 20 km interior towards the tree from point P and from there, reach somewhere in between Q and R on the ring road. How much distance do you have to travel from the tree to reach the point between Q and R on the ring road?
(1) 35 km (2) 42 km (3) 20 km (4) 25 km
(5) None of these



B. Krishna Kishore
Senior Faculty
Dimensions Coaching
Centre, Guntur.

RRB, PO's & Clerks Special

Answers With Explanation

(1-5) :

1. (3) $\frac{\sqrt{4356}\times\sqrt{?}}{\sqrt{6084}}=11$
$\Rightarrow \frac{66\times\sqrt{?}}{78}=11$
$\Rightarrow \sqrt{?}=\frac{78\times11}{66}=13$
$\therefore ?=169$

2. (1) $4\frac{1}{2}+\left(1\div2\frac{8}{9}\right)-3\frac{1}{13}=?$
$=\frac{9}{2}+\left(1\times\frac{9}{26}\right)-\frac{40}{13}$
$=\frac{9}{2}+\frac{9}{26}-\frac{40}{13}$
$=\frac{117+9-80}{26}$
$=\frac{46}{26}=\frac{23}{13}$

3. (2) $\left[(441)^{\frac{1}{2}}\times207\times(343)^{\frac{1}{3}}\right]\div\left[(14)^2\times(529)^{\frac{1}{2}}\right]$
$=(21\times207\times7)\div(196\times23)$
$=\frac{21\times207\times7}{196\times23}=6.75$

4. (5) $-676.76+1237+897.34-?=1294.25$
$\Rightarrow 1457.58-?=1294.25$
$\Rightarrow ?=1457.58-1294.25$
$=163.33$

5. (4) $\frac{(22\times5+8^2+4^2)^2}{12\times25\times6\div36\times2}+\frac{85\times240\times750}{51\times8\times100}+\frac{800\times289}{17\times25}$
$=\frac{(110+64+16)^2}{100}+375+544$
$=\frac{36100}{100}+919$
$=919+361=1280$

(6-10) :

6. (3) Required total
$=150\times\frac{70}{100}+120\times\frac{50}{100}+50\times\frac{56}{100}+50\times\frac{58}{100}+100\times\frac{57}{100}+200\times\frac{54.5}{100}$
$=105+60+28+29+57+109$
$=388$

7. (4) Required average
$=\frac{50}{5\times100}\times(52+56+70+64+48)$
$=\frac{1}{10}\times290$
$=29$

8. (2) Required percentage (%)
$=\left[\frac{50\times\frac{54}{100}}{120\times\frac{55}{100}}\times100\right]\%$
$=\left(\frac{27}{66}\times100\right)\%$
$=40.90\%\approx41\%$

9. (5) Required difference
$=\left(50\times\frac{52}{100}+200\times\frac{57}{100}\right)-\left(50\times\frac{56}{100}+150\times\frac{48}{100}\right)$
$=(26+114)-(28+72)$
$=140-100=40$

10. (4) Total marks obtained by Poonam
$=150\times\frac{56}{100}+120\times\frac{40}{100}+50\times\frac{48}{100}+50\times\frac{46}{100}+100\times\frac{53}{100}+200\times\frac{52.5}{100}$
$=84+48+24+23+53+105$
$=337$
$\therefore$ Required % $=\left(\frac{337}{670}\times100\right)\%$
$=50.29\%$
$\approx50\%$

(11-15) :


11. (2) The number series is as follows:
$3\times2+5=11$
$11\times3-6=$ **27**
$27\times4+7=115$
$115\times5-8=567$
$567\times6+9=3411$

12. (4) The number series is as follows:
$326.34375\div1.5+1.5=219.0625$
$219.0625\div2.5+2.5=90.125$
$90.125\div3.5+3.5=29.25$
$29.25\div4.5+4.5=11$
$11\div5.5+5.5=$ **7.5**

13. (4) The number series is as follows:
$5\times4+3=23$
$7\times3+3=24$
$9\times2+3=$ **21**
$11\times1+3=14$

14. (5) The number series is as follows :
$19+2\times2^3=35$
$35+2\times3^3=89$
$89+2\times4^3=217$
$217+2\times5^3=$ **467**
$467+2\times6^3=899$


15. (3) The number series is as follows:



16. (1) Let the no. of filler pipe = x
$\therefore$ No. of empty pipe = $8-x$
ATQ, $\frac{8-x}{6}-\frac{x}{8}=\frac{1}{6}$
$\Rightarrow \frac{4(8-x)-3x}{24}=\frac{1}{6}$
$\Rightarrow 32-4x-3x=4$
$\Rightarrow 7x=28$
$\Rightarrow x=4$

17. (4) Let the speed of smaller wheel = x c.m/s
In 10 sec, it will cover $10x$ cm.
$\therefore$ Distance covered by the smaller wheel in one revolution
$=2\times\frac{22}{7}\times3.5=22$ cm
$\therefore$ No. of revolutions made by smaller wheel in 10 sec
$=\frac{10x}{22}=\frac{5x}{11}$ .... (i)
Distance covered by bigger wheel in 10 sec = $(1980-10x)$ cm
$\therefore$ No. of revolutions made by bigger wheel in 10 sec = $\frac{1980-10x}{44}$ ....(ii)
ATQ,
$\frac{5x}{11}=\frac{1980-10x}{44}$
$\Rightarrow 20x+10x=1980$
$\Rightarrow 30x=1980$
$\Rightarrow x=\frac{1980}{30}=66$ cm/sec.

18. (3)



Clearly, radius of the circle is 20 km.
Hence, One has to cover a distance of 20 km to reach a point between Q and R.

ఉద్యోగాలు

ఓఎన్‌జిసి

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జిసి) - నెట్ 2017 ద్వారా **ఇ 1 లెవెల్ ఎగ్జిక్యూటివ్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 27

హ్యూమన్ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్ **ఖాళీలు:** 20

అర్హత: 60 శాతం మార్కులతో ఎంబిఏ(పర్సనల్ మేనేజ్‌మెంట్/ హెచ్‌ఆర్‌డి/ హెచ్‌ఆర్‌ఎం)/ పీజీ (పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఐఆర్/ లేబర్ వెల్ఫేర్)/ రెండేళ్ల పీజీ డిప్లొమా(పిఎం/ ఐఆర్/ లేబర్ వెల్ఫేర్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించరాదు

యుజిసి నెట్ సబ్జెక్ట్: లేబర్ వెల్ఫేర్/ పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ లేబర్ అండ్ సోషల్ వెల్ఫేర్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (సబ్జెక్ట్ కోడ్ 55)/ మేనేజ్‌మెంట్(సబ్జెక్ట్ కోడ్ 17)

ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ **ఖాళీలు:** 5

అర్హత: 60 శాతం మార్కులతో ఎంబిఏ(ఫైనాన్స్) పూర్తిచేసి ఉండాలి

వయసు: జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించరాదు

యుజిసి నెట్ సబ్జెక్ట్: మేనేజ్‌మెంట్(సబ్జెక్ట్ కోడ్ 17)

అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్ **ఖాళీలు:** 2

అర్హత: 60 శాతం మార్కులతో పీజీ(హిందీ) పూర్తి చేసి ఉండాలి. డిగ్రీలో ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. ట్రాన్స్‌లేషన్ వర్క్‌లో అనుభవం ఉండాలి.

వయసు: జనవరి 1 నాటికి 40 ఏళ్లు మించరాదు

యుజిసి నెట్ సబ్జెక్ట్: హిందీ(సబ్జెక్ట్ కోడ్ 20)

ఎంపిక: యుజిసి నెట్(నవంబర్ 2017) స్కోరు, అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులు ముందుగా యుజిసి నెట్ 2017కు దరఖాస్తు చేసుకొని రిజిస్ట్రేషన్/ రోల్ నెం వచ్చిన తరవాతనే ఓఎన్‌జిసికి అప్లయ్ చేసుకోవాలి

యుజిసి నెట్ 2017 ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11

యుజిసి నెట్ 2017 : నవంబరు 5

యుజిసి నెట్ వెబ్‌సైట్ : http://cbsenet.nic.in

ఓఎన్‌జిసి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 21 నుంచి

ఓఎన్‌జిసి ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 19

ఓఎన్‌జిసి ఇంటర్వ్యూలు: 2018 జనవరిలో

వెబ్‌సైట్: www.ongcindia.com

ఎన్‌ఎఫ్‌ఎల్

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్‌ఎఫ్‌ఎల్)- **మేనేజ్‌మెంట్ ట్రైనీస్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 36**

విభాగాలవారీ ఖాళీలు: హెచ్‌ఆర్ 12, మార్కెటింగ్ 24

వయసు: ఆగస్టు 31 నాటికి 29 ఏళ్లు మించరాదు

అర్హత: 60 శాతం మార్కులతో (ఎంబిఏ/ పీజీ డిగ్రీ/ డిప్లొమా) (పర్సనల్ మేనేజ్‌మెంట్ & ఇండస్ట్రియల్ రిలేషన్స్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ హెచ్ ఆర్)/ ఎమ్మెస్సీ(అగ్రికల్చర్)/ (ఎంబిఏ/ పీజీడిబిఎం) (మార్కెటింగ్/ అగ్రి బిజినెస్ మార్కెటింగ్ / ఇంటర్నేషనల్ మార్కెటింగ్ / రూరల్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా

ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23న

పరీక్ష కేంద్రం: హైదరాబాద్ తదితర ప్రధాన నగరాలు

దరఖాస్తు ఫీజు: రూ.735(ఎస్సీ/ ఎస్టీ/ ఎక్స్ సర్వీస్‌మెన్/ దివ్యాంగులు/ డిపార్టుమెంటల్ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంది)

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 6

వెబ్‌సైట్: www.nationalfertilizers.com

అడ్మిషన్స్

ఎన్‌ఎల్‌ఎస్‌ఐయు

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్‌ఎల్‌ఎస్‌ఐయు)- కింది **డిస్టెన్స్ ఎడ్యుకేషన్** కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు: రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్ (ఎంబిఎల్) ప్రోగ్రామ్, ఏడాది పీజీ డిప్లొమా (హ్యూమన్ రైట్స్ లా/ మెడికల్ లా & ఎథిక్స్/ ఎన్విరాన్‌మెంటల్ లా/ ఇంట లెక్చ్యువల్ ప్రాపర్టీ రైట్స్ లా/ చైల్డ్ రైట్స్ లా/ కన్స్యూమర్ లా & ప్రాక్టీస్/ సైబర్ లా& సైబర్ ఫోరెన్సిక్) **అర్హత:** డిగ్రీ పూర్తిచేసి ఉండాలి

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31

వెబ్‌సైట్: http://ded.nls.ac.in

పుస్తక పఠనంతోనే పరిజ్ఞానం

- చదువు-ఎదుగుపై అలసత్వం వద్దు
- వచ్చే నెల నుంచి కళాశాలల్లోనూ అమలు
- కలెక్టర్ వీరపాండ్యన్




మాట్లాడుతున్న కలెక్టర్ వీరపాండ్యన్, హాజరైన ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అనంతపురం అర్బన్: తరగతి పుస్తకాలు చదవడం వల్ల ఫలితాల వరకే ప్రయోజనం ఉంటుందని, అదే ఇతర పుస్తకాలు పఠిస్తే సమాజ పరిజ్ఞానం పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్ పేర్కొన్నారు. విద్యార్థుల కోసం జిల్లాలో ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన చదువు-ఎదుగుపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక రాజేంద్ర మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ, ఎస్ఎస్ఏ అధికారులు, ఎంఈఓలు, హెచ్ఎంలు, ప్రతి మండలం నుంచి ఓ విద్యార్థితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారు చదువుకున్న పుస్తకంపై కలెక్టర్ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం కలెక్టర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ.. మంచి పుస్తకం చదువుకుంటే జీవితంలో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. చదువుకున్న విషయం ఇతరులతో పంచుకోవాలన్నారు. సినిమా చూస్తే అందులోని మంచి, చెడులపై ఎలా చర్చించుకుంటామో చదువులోనూ అదే విధంగా చర్చించుకోవాలన్నారు. పుస్తకాలు రాసిన కవులు, రచయితలకు సమాజంలో నేటికీ ఎంతో గౌరవం ఉందన్నారు. మంచి పుస్తకాలు చదివితే పరిజ్ఞానం పెంపొందడంతోపాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కేవలం పాఠశాల పుస్తకాలు చదివితే పెద్దగా పరిజ్ఞానం రాదన్నారు. అందుకే చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం అలవరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసమే చదువు-ఎదుగు కార్యక్రమాన్ని జిల్లాలో ప్రవేశపెట్టామన్నారు. ప్రతి పాఠశాలలోనూ జూలై నుంచి ఈ కార్యక్రమం అమలు చేయిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో వ్యవహరించి, చదువు-ఎదుగు కార్యక్రమాన్ని అమలు చే యాలని సూచించారు. ఎవరూ ఎక్కడా ఈ కార్యక్రమంపై అలసత్వం వహించరాదని, ఒకవేళ అలా చేస్తే...అందుకు తగిన బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తి పెంచితే, పై తరగతుల్లోనూ పిల్లలు అదే అలవాటుగా ముందుకు సాగుతారన్నారు. వచ్చేనెల నుంచి అన్ని కళాశాలల్లోనూ అమలు చేస్తామన్నారు. ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ, ఎస్ఎస్ఏ అధికారులు, ఉపాధ్యాయులు బాగా పనిచేసి విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ఇందుకు జిల్లా గ్రంథాలయశాఖ సైతం బాగా సహకరిస్తోందని కలెక్టర్ కితాబు ఇచ్చారు. జేసీ2 ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ...వివిధ రకాల పుస్తకాలను పిల్లలు చదివినప్పుడే ప్రపంచ పరిజ్ఞానం మెరుగుపడి అన్ని రంగాల్లోనూ రాణించగలగుతారన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ...చదువు ఎదుగు కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

తమ సిబ్బంది ఎక్కడైనా సహకరించకపోతే.. తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో కరువు, పేదరికం అధికంగా ఉన్నందున పిల్లలను అభివృద్ధి పరచాలని కలెక్టర్ ఆలోచించడం ఆనందదాయకమన్నారు. అనంతరం నలుగురు కవులను కలెక్టర్ ఇతర అధికారుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఈఓ లక్ష్మీనారాయణ, ఎస్ఎస్ఏ పీఓ సుబ్రహ్మణ్యంతోపాటు ఆయా శాఖల అధికారులు సిబ్బంది , ఎంఈఓలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పేరూరు డ్యాం పరిశీలించిన మంత్రి పరిటాల



పేరూరు డ్యాం వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పరిటాల సునీత

రామగిరి: మండలంలోని అప్పర్‌పెన్నార్(పేరూరు) డ్యాంను స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత శనివారం పరిశీలించారు. నీటిపారుదల శాఖ ఈఈ నారాయణనాయక్, డీఈ మహేశ్వరరెడ్డి, జేఈ రవికుమార్, స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఆమె డ్యాంను పరిశీలించారు. ఈ డ్యాంకు నీరు తీసుకురావడానికి సీఎం చంద్రబాబు రూ.851 కోట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పనులకు భూమిపూజ చేయనున్న నేపథ్యంలో శనివారం ఆమె డ్యాంను పరిశీలించడం విశేషం. గేట్లు, కట్టను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె ఏవైనా చిన్నచిన్న మరమ్మతులుంటే వెంటనే వాటిని చేయించడానికి చర్యలు చేపడతామన్నారు. జీడిపల్లి నుంచి పేరూరు డ్యాంకు నీరు తీసుకురావడానికి వీలుగా కాలువ తవ్వకం తదితర అంశాలపై అధికారులతో ఆమె చర్చించారు. ఇప్పటికే ప్రణాళికలు పూర్తి చేశారని, నీరు తీసుకురావడమే తన కల అన్నారు. నీరివ్వడానికి సీఎం చంద్రబాబు సుముఖంగా ఉన్నారని, త్వరలో పనులు కూడా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. నీరు వస్తే సమీప గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని స్థానికులు ఆశిస్తున్నారు. గేట్లు, కట్టపై చేపట్టాల్సిన పనుల గురించి అధికారులనడిగి మంత్రులు తెలుసుకున్నారు.

ఆమె వెంట టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, రంగయ్య, ఎంపీపీ బడగొర్ల ఆంజనేయులు, మండల కన్వీనర్ సుబ్బరాయుడు, ఆయకట్టు సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఎంసీ.పల్లి సర్పంచ్ ముత్యాలు, పేరూరు పెద్దచెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు నాగభూషణ, సుధాకర్‌రెడ్డి, మాదాపురం శంకర్, శివకుమార్, ఇనయతుల్లా, సిద్ధయ్య, రాజు, చెన్నయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, మాదన్న, ఎల్లప్ప, వెంకటేశు, జయచంద్ర, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

26న ఐఏబీ సమావేశం

- 22న తుంగభద్ర నుంచి 500 టీఎంసీల నీరు విడుదల
- అధికారులందరూ హాజరుకావాలి : కలెక్టర్ వీరపాండ్యన్

అనంతపురం వైద్యం: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 26వ తేదీ ఉదయం 11గంటలకు ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఏబీ)సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీరపాండ్యన్ పేర్కొన్నారు. తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఎస్ఈ శేషగిరిరావు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను శనివారం కలిసి జిల్లాలోని తాగునీరు తదితర విషయాలపై వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల ఎన్నికల కారణంగా ఈనెల 22న నిర్వహించాల్సిన ఐఏబీ సమావేశం వాయిదా పడిందని, జలవనరుల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అదేశాల మేరకు ఈనెల 26న నిర్వహించనున్నామన్నారు. అలాగే జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్య తాత్కాలిక పరిష్కారానికి గాను తుంగభద్ర జలాశయం నుంచి ఈనెల 22న 500 టీఎంసీలు విడుదల చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ నీరు జిల్లాలోకి ఈనెల 25వ తేదీలోపు వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి 26న జరిగే ఐఏబీ సమావేశానికి సంబంధిత అధికారులందరూ తప్పనిసరిగా తగిన నివేదికలు తీసుకుని హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీళ్లు లేని బోర్లను ఓపెన్‌గా ఉంచకండి

జాయింట్ కలెక్టర్ రమామణి

అనంతపురం కలెక్టరేట్: జిల్లాలో నిరుపయోగంగా ఉన్న బోరుబావులను ఓపెన్‌గా ఉంచకుండా మూసివేసేలా చర్యలు తీసుకోవాలని జేసీ రమామణి ఆదేశించారు. శనివారం సంబంధిత అధికారులతో ఆమె వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 2,15,441 బోరుబావులున్నాయని, ఇందులో 49,681 బోర్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఆయా బోర్లు ఎక్కడున్నా నాలుగు రోజుల్లో ఓపెన్‌గా ఉంచకుండా మూసివేయాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీ, వీఆర్ఓ, వీఆర్ఏలు గ్రామాల వారీగా సర్వే నిర్వహించి ఆ వివరాలను సంబంధిత అధికారులకు అందించాలన్నారు. ప్రతి రోజూ సాయంత్రం ఎన్ని బోర్లు మూసివేయించారో సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ-2 ఖాజామొహిద్దీన్, డ్వామా పీడీ నాగభూషణం, జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ సూర్యనారాయణ, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, అన్ని మండలాధికారులు పాల్గొన్నారు.






మాట్లాడుతున్న ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్, కళాతపస్విని సన్మానిస్తున్న సంగీతసభ సభ్యులు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రావీణ్యతకు మనోధైర్యం తోడైతే అన్నీ విజయాలే

కళాతపస్వి కే విశ్వనాథ్

అనంతపురం టౌన్: చిన్నారుల్లోని ప్రావీణ్యతకు మనోధైర్యం తోడైతే భవిష్యత్తు అంతా విజయాల పరంపర అవుతుందని కళాతపస్వి, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత కే విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక మొదటిరోడ్డులోని త్యాగరాజ సంగీతసభలో శనివారం సాయంత్రం సంగీత సరస్వతి సుపుత్ర సంధ్యావందనం శ్రీనివాసరావు శతజయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా కళాతపస్వి కే విశ్వనాథ్, ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ హాజరయ్యారు. తొలుత సంధ్యావందనం శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంగీతసభ, అమ్మానాన్న సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పాటల పోటీల విజేతలకు అమ్మానాన్న సొసైటీ ఆధ్వర్యంలో విశ్వనాథ్ చేతులమీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు చేశారు. రెండేళ్ల చిన్నారి చేసిన నృత్యం వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం కే విశ్వనాథ్ మాట్లాడుతూ..ఈ ఏడాదిలోనే తాను రెండోసారి జిల్లాకు వచ్చానని, అయితే తొలిసారికన్నా ఇపుడు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీతగా ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంత ప్రజలు, కళాభిమానులు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలు చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. ఇక్కడి చిన్నారుల్లో సంప్రదాయ విలువలు బాగా ఉన్నాయని, తల్లిదండ్రులు, గురువులు వారిని ప్రోత్సహించి కళలపరంగా మరింత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ... తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి కే విశ్వనాథ్ అని కొనియాడారు. ఆయన సినిమాలన్నీ రత్నాల్లాంటివన్నారు. కే విశ్వనాథ్ ఆధ్వర్యంలో మరిన్ని చిత్రాలు రావాలని, వీలైతే విశ్వనాథే నటిస్తే మరోసారి చూడాలనుందని ఆకాంక్షించారు. అనంతరం సంగీతసభ ఆధ్వర్యంలో కే విశ్వనాథ్‌ను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బుగ్గయ్య చౌదరి, ఆంధ్రాబ్యాంకు అకౌంటెంట్ ప్రభాకర్, చిన్మయా మిషన్ ప్రతినిధి ఆత్మవిదానందస్వామి, సంగీత సభ సభ్యులు జ్ఞానేశ్వర్, ప్రభావతి, ఆదరణ శైలజ, లక్ష్మీ సోమయాజులు, సరోజా జయరాం, పద్మజ, అరుంధతి, శ్రీదేవి, లతాశ్యాం, నాగేశ్వరి, మోహన్‌కుమార్, సాహితీవేత్తలు ఏలూరి ఎంగన్న, రియాజుద్దీన్, నాట్యాచార్యులు కృష్ణమూర్తిరాజు, మంజులవాణి, పట్నం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా తృణధాన్యాలు

కణేకల్లు : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకున్న రైతులకు ఉచితంగా జొన్నలు, సజ్జలు, ఉలవలు వంటి తృణధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి శ్రీనివాసులు తెలిపారు. వర్షాలు లేక రైతులు వేరుశనగ పంట సాగు చేసుకోకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం వీటిని అందిస్తోందన్నారు. ఇప్పటికే మండలానికి 30 క్వింటాళ్ల జొన్నలు, 15 క్వింటాళ్ల సజ్జలు, వంద క్వింటాళ్ల ఉలవలు సరఫరా అయినట్లు ఆయన తెలిపారు. సోమవారం నుంచి బయోమెట్రిక్ ద్వారా రైతులకు అందిస్తామన్నారు. కేవలం సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పొందని రైతులు మాత్రమే వీటిని తీసుకునేందుకు రావాలని ఆయన కోరారు.





బొమ్మనహాళ్‌లో కురుస్తున్న వర్షం, రాయంపల్లి వద్ద పొలాల్లో నిలిచిన వర్షపునీరు, రహదారిపై తెగిపడిన విద్యుత్ వైరు

బొమ్మనహాళ్‌లో భారీ వర్షం

బొమ్మనహాళ్ : మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం సాయంకాలం 4.45 గంటల నుంచి రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. నేమకల్లు, ఉంతకల్లు, కురువళ్లి, సిద్ధరాంపురం, ఉద్దేహాళ్, బండూరు గ్రామాలతో పాటు ఎగువ ప్రాంతాలలో భారీ వర్షం కురవడంతో బొమ్మనహాళ్ వంక, ఉద్దేహాళ్ హగరి వేదావతి నది ప్రవహించాయి. రెండు నెలలుగా అడపాదడపా వర్షాలు కురవగా శనివారం కుండపోత వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హెచ్చెల్సీ కాలువ ద్వారా నీటి సరఫరా ఆలస్యం కాగా ప్రస్తుతం బోరుబావుల కింద వేసుకున్న వరి, మిరప నారులు, పత్తి, మొక్కజొన్న పంటలు వర్షానికి ఏపుగా పెరుగుతాయని రైతులు అంటున్నారు.


రాయదుర్గంరూరల్‌లో : మండలంలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉడేగోళం, రాయంపల్లి, బీఎన్ హళ్లి, రేకులకుంట, జుంజురాంపల్లి తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి వర్షం అంతంతమాత్రంగానే కురిశాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంటకు తేమ అందడంతో పంట ఏపుగా పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

రోడ్డుపై తెగిపడ్డ విద్యుత్ వైరు : రాయంపల్లి గ్రామం వద్ద శనివారం సాయంత్రం ఈదురుగాలులతో పాటు వర్షం కురవడంతో రాయంపల్లి నుంచి బేలోడుకు వెళ్లే రహదారిపై విద్యుత్ వైరు తెగిపడింది. రోడ్డుపై నిత్యం వందలాది వాహనాల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్ వైరు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనదారులు అటువైపు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రస్తుతం ప్రమాదం లేదని, అయితే విద్యుత్ సరఫరా ప్రారంభమైతే ప్రమాదాలు జరిగే ఆస్కారముందని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై పడిన విద్యుత్ వైరును తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

లోకల్ గైడ్
localguide

ఎమ్మెల్యే డైరీ

రాయదుర్గం : శాసనసభ్యులు, గ్రామీణ గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆదివారం నంద్యాలలో ఉంటారు.



రాయదుర్గం : **మధు :** నేనే రాజు నేనే మంత్రి
కేబీ ప్యాలెస్ : జయ జానకి నాయక
ఎస్వీ సినిమాక్స్ : లై
కణేకల్లు – **శ్రీ చిక్కణ్ణేశ్వర :** జయ జానకి నాయక
ఉద్దేహాళ్ : **తాజ్ :** జయ జానకి నాయక

మాంసం ధరలు

మాంసం (కిలో) : రూ. 340, **చికెన్ (కిలో) :** రూ. 150, **చేపలు (కిలో):** రూ. 150, **కోడిగ్రుడ్లు(100) :** రూ. 370

ముగిసిన శ్రావణమాస పూజలు



స్వామివారి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాయదుర్గంరూరల్ : నెల రోజుల నుంచి భక్తిశ్రద్ధలతో శ్రావణమా స పూజలు భక్తులు నిర్వహించారు. శనివారం పూజలు ఘనంగా ముగిశాయి. మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, వడ్రవన్నూరు వద్ద వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రీతిపాత్రమైన ఆ కు పూజను నిర్వహించారు. చివరి శనివారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అపులాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులకు లడ్డు సత్యనారాయణ శెట్టి, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, సొండూరు వీరనారాయణప్ప అన్నదానం చేశారు.

సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి : చైర్‌పర్సన్

రాయదుర్గంటౌన్ : ప్రతి వ్యక్తి ఆర్థిక స్థోమతకు తగ్గట్టు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముదిగల్లు జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా తత్వాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎదుటి వ్యక్తికి సేవ చేసినప్పుడు కలిగే ఆనందం, అనుభూతి ఎనలేనిదన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు వారి తల్లి సరస్వతమ్మ జ్ఞాపకార్థం ఆర్థిక సహాయంతో విద్యార్థులకు అందించిన గ్లాసులు, ప్లేట్లను చైర్‌పర్సన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లావణ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోల్‌రెడ్డి, టీడీపీ నాయకులు లోకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

హ్యాపీ సండేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

రాయదుర్గంటౌన్ : మానసిక ఉల్లాసం, ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రతి వారం నిర్వహిస్తున్న హ్యాపీ సండే కార్యక్రమంలో పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని మున్సిపల్ కమిషనర్ మోతీకృష్ణ కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ నల్లపూల వెంకటేశులు ఆధ్వర్యంలో అభ్యుదయ ఉన్నత పాఠశాల ఆవరణంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఆట, పాటలు, క్రికెట్, లాగుడు పోటీ, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్‌లతోపాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, పెన్షనర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రతి పాఠశాల గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలి

రాయదుర్గంరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్ తప్పనిసరిగా తీసుకోవాలని ఎంఈవో నాగమణి తెలిపారు. శనివారం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు, గ్యాస్ ఏజెన్సీలతో సమావేశాన్ని నిర్వహించాలన్నారు. పట్టణం, మండలంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఒకొక్క కనెక్షన్‌కు రూ.2,237 చెల్లించాలన్నారు. డిపాజిట్ రూ.1600, గ్యాస్ సిలెండర్‌కు రూ.587, పాస్ పుస్తకం కోసం రూ.50 హెచ్‌ఎంలు ఖర్చుచేయాల్సి ఉందన్నారు. ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంల పేరుతో కనెక్షన్ తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గ్యాస్ స్టౌలపైన వంటలు చేసి విద్యార్థులకు వడ్డించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు, హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

ఏడాదిలోగా అన్ని యూనిట్లను ప్రారంభిస్తాం : ఏడీ

రాయదుర్గంరూరల్ : టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తుందని యూనిట్ నిర్వాహకులు ముందుకొస్తే అన్ని యూనిట్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చేనేత జౌళిశాఖ ఏడీ పవన్‌కుమార్ తెలిపారు. శనివారం టెక్స్‌టైల్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన సహస్ర అపేరల్స్ గార్మెంట్స్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్క్‌లో అవసరమైన తాగునీరు, విద్యుత్, రోడ్డు వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 55 యూనిట్లకు 53 యూనిట్లు రిజిస్ట్రేషన్ అయినట్లు తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు యూనిట్లు ప్రారంభించామన్నారు. త్వరలోనే మరొక యూనిట్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. యూనిట్‌దారులకు బ్యాంకర్లు రుణాలు అందించేందుకు ముందుకువచ్చారన్నారు. 40 అడుగుల రోడ్డు కోసం రూ.53 లక్షలు నిధులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. నిధులు విడుదల అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శివారెడ్డి, యూనిట్‌దారులు చమ్మా ఇబ్రహీమ్, ఖలీలుల్లా, ప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.



గార్మెంట్స్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న జౌళిశాఖ ఏడీ

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : ఎమ్మెల్సీ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి

డీ హీరేహాళ్ : ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి కోరారు. శనివారం డీ హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. ప్రజాసమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. ఆయన వెంటన మండల కోఆప్షన్ సభ్యులు మహాబలి, చంద్రశేఖర్‌రెడ్డి, మారెన్న గవిసిద్ధ పాల్గొన్నారు.

నేడు ఎన్‌ఐఓఎస్ పరీక్షలు

రాయదుర్గంరూరల్ : సాక్షరభారత్ కేంద్రాల్లో ఆదివారం ఎన్‌ఐఓఎస్ పరీక్షలు నిర్వహించాలని సూపర్‌వైజర్ పరమేశ్వరప్ప, వీసీవోలకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సూపర్‌వైజర్ పరమేశ్వరప్ప వీసీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 16 సాక్షరభారత్ కేంద్రాలకు గాను 677 మంది వయోజనులు పరీక్ష రాయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ తిమ్మరాజు, వీసీవోలు పాల్గొన్నారు.

ఏకాదశి ఉత్సవం ఆదాయం లెక్కింపు

బొమ్మనహాళ్ : ఉంతకల్లులోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో శుక్రవారం జరిగిన ఏకాదశి ఉత్సవంతో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. శనివారం స్థానిక పాండురంగస్వామి మండపంలో ఆర్ఐ ఎంఎం వీరేష్ ఆధ్వర్యంలో నిర్వాహకులు, భక్తులు ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం టెంకాయ రశీదులు, వసతి గృహాల ఆదాయం, మాలధారణల ద్వారా, ఇతర వనరుల ద్వారా రూ.1,94,624 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఇందులో అన్నసంతర్పణ, కూలీల వేతనాల కోసం రూ.66,603 వ్యయమైనట్లు తెలిపారు. ప్రస్తుతం రూ. 1,28,021 మిగులు ఉండగా కాంప్లెక్స్ నిర్మాణాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీరాములు, సూర్యనారాయణ, కార్యనిర్వాహకులు, ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





ఉత్తమ వైద్య సేవలందించిన డాక్టర్లకు మెమెంటోలు అందజేస్తున్న మంత్రులు, హాజరైన వైద్యులు

నిస్వార్థ సేవలకు ప్రతిరూపం సత్యసాయి

- వైద్యసేవలకు రిటైర్మెంట్ లేదు
- మంత్రి కామినేని
- సత్యసాయి సేవలు అందరికీ ఆదర్శం
- కర్ణాటక మంత్రి సురేశ్‌కుమార్
- ఘనంగా సత్యసాయి వైద్యుల జాతీయ సమ్మేళనం

పుట్టపర్తి: ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా నిస్వార్థసేవలకు సత్యసాయి సేవ లు ప్రతిరూపమని ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసులు కొనియాడారు. స్థానిక ప్రశాంతినిలయంలో శనివారం శ్రీసత్యసాయి జాతీయ వైద్య సమ్మేళనం ప్రారంభమైంది. ఆంధ్ర, కర్ణాటక వైద్యశాఖ మంత్రులు డాక్టర్ కామినేని శ్రీనివాసులు, సురేశ్‌కుమార్ పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఇందులో మంత్రి కామినేని శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో విద్య, వైద్యంతో పాటు సామాజిక సేవలందిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. మానవత్వానికి ప్రతిరూపంగా నిలుస్తూ సేవాదళ్ కార్యకర్తలు సేవలందిస్తున్నారన్నారు. అన్ని రకాల వృత్తులకు రిటైర్మెంట్ ఉంటుంది కానీ, వైద్యవృత్తిలో మాత్రం ఉండదన్నారు. వ్యక్తి జీవితాంతం వైద్యసేవ లందించవచ్చునన్నారు. సత్యసాయి ట్రస్టు అందిస్తున్న సేవలకు ప్రభుత్వ పరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కర్ణాటక వైద్య శాఖ మంత్రి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ..సత్యసాయి సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. బెంగళూరులో సైతం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించి అందరికీ అతి ఖరీదైన వైద్యమందిస్తున్నారని కొనియాడారు. సత్యసాయి సేవాసైన్యంలో తామూ సైనికులమేనన్నారు. సత్యసాయిబాబా లేకపోయినా ట్రస్టు ఆధ్వర్యంలో వేలాదిడాక్టర్లు, సేవాదళ్ బృందాలు సామాజిక సేవలందించడం సత్యసాయి సేవాసంస్థల సేవలకు నిదర్శనమన్నారు. మానవాళి కోసం సత్యసాయి చేపట్టిన సేవలు ఆయన మరణానంతరం కూడా కొనసాగడం ఆయన మహత్యానికి నిదర్శ నమన్నారు. అనంతరం సత్యసాయి ఆరోగ్య ప్రణాంజలి పేరిట వెలువడిన నూతన త్రైమాసిక పత్రికను మంత్రులు, ట్రస్టు సభ్యులు విడుదల చేశారు. అ నంతరం విశిష్ట వైద్యసేవలందించిన వైద్యులకు సత్యసాయి ధన్వంతరి సేవా అ వార్డు పేరిట మెమెంటోలు అందజేశారు. అనంతరం సత్యసాయి సంస్థల జా తీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా తమకు సేవామార్గం కలిగించారని, తమ వెన్నంటి ఉండి సేవవైపు తమను నడిపిస్తున్నారన్నారు. ఎందరో వైద్యనిపుణులు సత్యసాయి సేవాసంస్థల ద్వారా సేవలందిస్తుండడం సత్యసాయి స్ఫూర్తేనన్నారు. నిరంతరం సేవలందించడమే తమ జీవితాశయమన్నారు.

అనంతరం హైదరాబాద్ కేర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సో మయాజులు వైద్యసేవల గురించి వివరించారు. మొదటిరోజు సదస్సుకు దేశవ్యాప్తంగా 4 వేల మంది వైద్యనిపుణులతో పాటు పారామెడికల్ సిబ్బంది పా ల్గొన్నారు. అనంతరం మంత్రులతో పాటు డాక్టర్లు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- డీఈ నారాయణ నాయక్

అనంతపురం సప్తగిరిసర్కిల్: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని అనంతపురం డివిజనల్ ఇంజనీర్ నారాయణ నాయక్ హెచ్చరించారు. నగరంలోని తమ కార్యాలయంలో టౌన్-1, టౌన్-2 విద్యుత్ అధికారులు, సిబ్బందితో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్ పరిధిలో మొండిబకాయిల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయిస్తున్నామన్నారు. విద్యుత్ ప్రమాదాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే ఏదైనా ప్రాంతంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినట్లయితే తక్షణమే ఆయా ప్రాంతాల వినియోగదారులకు ఉజ్వామిత్ర యాప్ ద్వారా మొబైల్‌కు మెసేజ్ రూపంలో కరెంటు పోయే సమయం, వచ్చే సమయం తెలియజేయాలని సూచించారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వినియోగదారులు సకాలంలో బకాయిలు, నెలవారీ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు. బిల్లులు చెల్లించని పక్షంలో కరెంటు తొలగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్-1 ఏడీఈ శ్రీనివాసులు, టౌన్-2 ఏడీఈ అనంతయ్య, ఏఈలు, ఫోర్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో పలు నియామకాలు



వైస్ చాన్సలర్ రాజగోపాల్ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న నూతన డైరెక్టర్లు

- యూజీసీ డీన్‌గా ఆచార్య శుభ
- అడ్మిషన్స్ డైరెక్టర్‌గా ఆచార్య తిమ్మానాయక్
- ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్‌గా ఆచార్య క్రిష్ణకుమారి
- ప్రోగ్రాం ఆఫీసర్‌గా డాక్టర్ గంగాధరయ్య

ఎస్కేయూ: వర్సిటీలో పలు నూతన నియామకాలు చేపడుతూ వైస్ చాన్సలర్ ఆచార్య రాజగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) డీన్‌గా ఆచార్య శుభ, అడ్మిషన్స్ డైరెక్టర్‌గా ఆచార్య తిమ్మానాయక్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్‌గా ఆచార్య కృష్ణకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్‌గా డా. గంగాధరయ్యలను నియమించారు. ఆచార్య శుభ రసాయన శాస్త్ర సీనియర్ ఆచార్యులుగా కొనసాగుతున్నారు. విభాగాధిపతిగా, సీడీసీ డీన్‌గా, డిప్యూటీ వార్డెన్‌గా పలుకీలక పదవులు నిర్వహించారు. బోధనలో 35 సంవత్సరాల సుదీర్ఘ అనుభవముంది. అడ్మిషన్స్ డైరెక్టర్‌గా నియమితులయిన తిమ్మానాయక్ బాటనీ వి భాగంలో ఆచార్యుడిగా ఉన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య కృష్ణకుమారి జియాగ్రఫీ విభాగంలో సీనియర్ ఆచార్యులుగా కొనసాగుతున్నారు. ప్రోగ్రాం ఆఫీసర్‌గా నియమితులైన డాక్టర్ బాలకృష్ణ లైబ్రరీ విభాగంలో సీనియర్ సైంటిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు తమ నియామకం పట్ల వైస్ చాన్సలర్ రాజగోపాల్‌కు, రెక్టార్ లజపతిరాయ్‌కి, రిజిస్ట్రార్ సుధాకర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

అనంతపురం

గంగ	: లై
గౌరి	: ఫిదా
గాయత్రి	: జయదేవ్
గౌతమి	: గౌతమ్‌నంద
త్రివేణి	: ఆనందో బ్రహ్మ
తరంగిణి	: నక్షత్రం
తేజస్విణి	: ప్రతిక్షణం
శాంతి	: నేనే రాజు నేనే మంత్రి
సుధ	: జయ జానకి నాయక
స్వప్న	: గజ్జెల గుర్రం
శ్రీవెంకటేశ్వర	: జయ జానకి నాయక

నీలిమా: రారండోయ్.. వేడుకచూద్దాం...

క్రీడలతో మానసికోల్లాసం

- జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య
- బీజేవైఎం ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు ప్రారంభం

అనంతపురం కలెక్టరేట్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య పేర్కొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక అ శోక్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా క్రిష్ణయ్యతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి హాజరై కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడ కబడ్డీని ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. దేశానికి ఆరోగ్యవంతులైన యువకులు కావాలంటే క్రీడలు అవసరమన్నారు. దేశాన్ని అవినీతిరహిత దేశంగా మార్చడం యువత చేతుల్లోనే ఉందన్నారు. ఆ దిశగా యువత నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ పోటీల్లో 40 పురుష జట్లు, 20 మహిళా జట్లు పోటీ పడుతున్నాయన్నారు.

ఫైనల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందించనున్నామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఓబులేసు, సయ్యద్‌బాబా, రమేష్, వినోద్‌కుమార్, అశోక్‌రెడ్డి, వినోద్, వంశీ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 1, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. షాపింగ్‌కు అనుకూలం. వేడుకల్లో పాల్గొంటారు. ఖర్చులు అంచనాలు మించుతాయి. పొదుపు పథకాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. తల్లి, మాతృవర్గీయులకు సంబంధించిన వ్యవహారాలు ఆవేదన కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి.

మిథునరాశి: (మే21-జూన్21): చర్చలు, ప్రయాణాల్లో నిదానం అవసరం. సోదరీసోదరుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. సన్నిహితుల నుంచి ముఖ్యమైన మెయిల్స్ ఫోన్ సందేశాలు అందుకుంటారు. ఇంటర్వ్యూలలో నిరాశ తప్పకపోవచ్చు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. షాపింగ్‌లో ఖర్చులు అధికం. విలువైన వస్తువుల కొనుగోలు విషయంలో నాణ్యత గమనించాలి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కొత్త పనుల ప్రారంభానికి అనుకూల సమయం కాదు. వ్యక్తిగత వ్యవహారాలకు సంబంధించిన ఆలోచనలు కొలిక్కి వస్తాయి. సంకల్ప సాధనకు అధికంగా శ్రమించాల్సి ఉంటుంది.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వినోదం, ఫొటోగ్రఫీ, రచనా రంగాల వారికి అనుకూలం. సినీ, రాజకీయ, న్యాయ, బోధన రంగాల వారు లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సహకార సంఘాలు, యూనియన్ కార్యకలాపాలకు అనుకూలం. బృందకార్యక్రమాల్లో అసౌకర్యం కలిగే అవకాశం వుంది. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాల్లో లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. పెద్దలు, ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ, మన్ననలు అందుకుంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): న్యాయ, బోధన, రక్షణ, రవాణా రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి. భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుంటారు. డ్రైవింగ్, చర్చల్లో నిదానం పాటించండి. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

మకరరాశి:(డిసెంబర్22-జనవరి21): ఆర్థిక విషయాల్లో కొంత నిరుత్సాహకరంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. సంస్మరణల్లో పాల్గొంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. వాయిదా పద్ధతులపై వస్తువులు కొనుగోలు చేస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో నిదానం పాటించండి. శ్రీవారు, శ్రీమతి వ్యవహారాలు మనస్తాపం కలిగిస్తాయి. వేడుకల్లో పాల్గొంటారు. బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. జనసంబంధాలు విస్తరిస్తాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19-మార్చి20): ఆస్పత్రులు, హోటల్, క్యాటరింగ్ రంగాల వారికి కొంత నిరుత్సాహకరంగా వుంటుంది. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. సహోద్యోగుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సూక్తి

మనిషి
ఔన్నత్యానికి
కొలబద్ద మేధస్సు
కాదు హృదయం

- మదర్ థెరిసా

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. వియంన ▸ ....
2. రకొత ▸ ....
3. రంశిబి ▸ ....
4. కివాలి ▸ ....

టంగ్ ట్విస్టర్స్

1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Two tiny tigers take two taxis to town.

ఔనా!

ఆస్ట్రేలియాలో 10 వేల బీచ్‌లు ఉన్నాయి. రోజుకో బీచ్‌ను సందర్శించినా 27 ఏళ్లు పడుతుంది.





ఎవరైనా పిల్లలు బాగా హుషారుగా ఉంటే అబ్బో ఈ అబ్బాయికి తెలివి అంతా ఇంతా కాదు అని అంటుంటారు. మరి నిజంగా తెలివిని పరీక్షలించాలంటే? ఓ వ్యక్తిని మేధావిగా గుర్తించాలంటే? అవి తెలుసుకోవడానికే ఓ పరీక్ష ఉంది.. అదే - 'ఐక్యూ(Intelligence Quotient) టెస్ట్. మహామహులే ఆ పరీక్షలో నెగ్గాలంటే తలలు పట్టుకుంటారు. అలాంటిది తెలివితేటల్లో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు అల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌ల స్థాయిని దాటేశాడు ఓ తెలుగు కుర్రాడు. అతడే బండి యశ్వంత్.

ఐక్యూ 162..
భాషలు 5

బ్రిటన్‌లో ఉన్న 'మెన్సా' క్లబ్ ఐక్యూను పరీక్షించడంలో ఎంతో ప్రఖ్యాతి చెందింది. ప్రపంచం లోనే అతి పురాతనమైన ఐక్యూ క్లబ్ ఇదే కావడం విశేషం. 1964లో రోలాండ్ బెరిల్, డాక్టర్ లాన్స్ వేర్ కలిసి దీన్ని ప్రారంభించారు.

Mensa
The High IQ Society

తెలివితేటలకు తూకం వేయాలంటే.. 'ఐక్యూ'(ఇంటెలిజెన్స్ కోషంట్) పరీక్షలో సత్తా చాటాల్సిందే. అందులో నెగ్గితే.. ప్రపంచ మేధావుల జాబితాలో ఒకరిగా పేరు పొందొచ్చు. బ్రిటన్‌లో ఈమధ్యే జరిగిన ఐక్యూ టెస్ట్‌లో మన తెలుగు అబ్బాయి మెరిశాడు. పన్నెండేళ్ల 'బండి యశ్వంత్' 162 మార్కులు గానూ, 162 సాధించి(ఐక్యూ పరీక్షలో అత్యధిక మార్కులు) ఔరా అనిపించాడు. వృత్తిరీత్యా యశ్వంత్ కుటుంబం లండన్‌లోని 'రీడింగ్'లో నివాసముంటుంది. యశ్వంత్ తండ్రి కృష్ణమోహన్, తల్లి మాధవి లత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా చేస్తున్నారు. కృష్ణమోహన్ స్వస్థలం తెనాలి(గుంటూర్)లోని కొలకలూరు కావడం విశేషం.

'నేను ఈ విజయాన్ని నమ్మలేకపోతున్నాను. ఎంతో ఆనందంగా ఉంది. నాకు పజిళ్లు పూర్తి చేయడమంటే భలే సరదా. రూబిక్ క్యూబ్ సాల్వ్ చేసేదాకా పట్టు వదలను. త్వరలోనే ముంబైలో జరిగే 'ప్రపంచ రూబిక్ క్యూబ్ టోర్నమెంట్'లో పాల్గొనబోతున్నాను. నాకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులంటే చాలా ఇష్టం. భవిష్యత్తులో మంచి వ్యాపారవేత్తను కావాలని అనుకుంటున్నాను. కాల్పనిక కథలు చదువుతుంటాను. కొత్త టెక్నాలజీ గురించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంటాను. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాను. క్రికెట్ నా ఫేవరేట్ గేమ్. జర్మనీ, ఫ్రెంచి, స్పానిష్ భాషల్లో కూడా మాట్లాడగలను. ప్రస్తుతం లాటిన్, రష్యన్ భాషలను నేర్చుకుంటున్నాను. 'ఆస్ట్రానమీ క్లబ్'లో నేను ఓ మెంబర్‌ని కూడా. నాకు ఇష్టమైన పనిని, మనసు పెట్టి చేస్తాను'.

- యశ్వంత్



ఐక్యూ టెస్ట్ పరీక్ష ఎలా ఉంటుందంటే..

- ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. ఒకటి 'కెటెల్ 3బీ పేపర్'. రెండోది 'కల్చర్ ఫెయిర్ స్కేల్'. ఈ రెండూ కలిపి రెండున్నర గంటల పరీక్ష ఇది. మొదటి పేపర్లో 42 ప్రశ్నలుంటే, రెండో దాంట్లో 250 ప్రశ్నలు ఉంటాయి.
- ఇందులో కష్టమైన ఇంగ్లీష్ పదాలకు అర్థాలు, వ్యతిరేక పదాలతో పాటు, బంధుత్వ ప్రశ్నలు, చిక్కులెక్కలు, మెదడు స్థాయిని పరీక్షించే తార్కిక ప్రశ్నలుంటాయి.

నవ్వుల్ నవ్వుల్

ఇద్దరు మేధావుల మాటలు..

మిస్టర్ మేధావి లింగం : ఒరేయ్! నువ్వు గేదె మీద వెళ్తున్నావు కదా. నిన్ను పోలీసులు పట్టుకుంటారు.

మిస్టర్ మేధావి గంగ : ఎందుకురా?

మిస్టర్ మేధావి లింగం : నువ్వు హెల్మెట్ పెట్టుకోలేదు కదా!

మిస్టర్ మేధావి గంగ : ఒరేయ్ ఇది ఫోర్ వీలర్. అందుకే బెల్టు పెట్టుకున్నా చూడు.

మిస్టర్ మేధావి లింగం : !!!!!!!!

చెప్పగలరా?

ఉరిలో ఉన్నా
కానీ గురిలో లేను

మేడలో ఉన్నా
కానీ మేనులో లేను

రాతలో ఉన్నా
కానీ రాయిలో లేను

అయితే ఇంతకీ
నేనెవర్నో
చెప్పగలరా?

రంగులు వేయండి



జవాబులు


చెప్పగలరా? : ఉడత
జంతర్‌మంతర్ : 1. వినయం 2. కొరత 3. శిబిరం 4. వాకిలి
జంబ్లింగ్ వర్డ్స్ : 1.COLD 2.SOFT 3.RIDE 4.LIKE

జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. LCOD ▸ ....
2. STOF ▸ ....
3. DERI ▸ ....
4. KELI ▸ ....

దారి కనుక్కోండి



బొమ్మ గీయండి





నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డు, కొత్తూరు అమ్మవారిశాలలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, ఏడు శనివారాల వ్రతం ఆచరిస్తున్న మహిళలు

నేత్రపర్వంగా ఏడు శనివారాల వ్రతం

అనంతపురం టౌన్: శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, రామ్‌నగర్‌లోని వెంకటేశ్వరాలయం, హౌసింగ్‌బోర్డులోని వెంకటేశ్వర దేవాలయాల్లో ఏడు శనివారాల వ్రతాలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో వేకువజామునే వెంకటేశ్వరస్వామికి నిర్మాల్య విసర్జన గావించి, పంచామృతాభిషేకాలు, అర్చనలు, తోమాలసేవలు,విశేష పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామివారి ఉత్సవ మూర్తికి వివిధ పుష్పాలంకరణలు చేసి వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా వ్రతం నిర్వహించారు. మహిళాభక్తులు విశేషంగా హాజరై భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు నిర్వహించడంతోపాటు సామూహికంగా వ్రతం ఆచరించారు. మధ్యాహ్నం భక్తులకు పెద్దఎత్తున అన్నదాన వినియోగం చేశారు. అలాగే సాయంత్రం ఆయా ఆలయాల ఆవరణల్లో భక్తులు సామూహిక విష్ణుసహస్రనామ పారాయణాలు పఠించారు. కాగా, కొత్తూరు అమ్మవారిశాలలో ఈ శనివారం మాత్రమే పెద్దఎత్తున హాజరైన భక్తులతో ఏడు శనివారాల వ్రతాలు నిర్వహించారు.

పండితులు వేదాలు వల్లిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలు ఆచరించారు. ఈసందర్భంగా ఆలయంలో వాసవీకన్యకాపరమేశ్వరికి ప్రత్యేక అలంకరణలు గావించి పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా కుంకుమార్చనలతో అమ్మవారికి నివేదించారు.

భక్తులతో పోటెత్తిన కసాపురం

చివరి శనివారం నెట్టికంటి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుంతకల్లు రూరల్: శ్రావణమాసం నాలుగవ శనివారాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో కసాపురం శనివారం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామునే స్వామివారి మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వజ్ర కిరీటాన్ని ధరింపచేసి బంగారు కవచాలు, బంగారు కన్ను, మీసాలను అలంకరించారు. విశేష పుష్పాలతో, తులసీ మాలలతో, వడమాలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కర్ణాటకలోని బళ్లారి ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, విజయమ్మ దంపతుల సహకారంతో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అయితే 3-30 గంటలకే అన్నదాన సత్రంలో అన్నదానం ఆపివేయడంతో భక్తులు నిరాశకు గురయ్యారు. సాయంత్రం యథాప్రకారం స్వామివారికి పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ఒంటె వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ముత్యాలరావు, ఏఈఓ మధు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ వేమన్న, ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు, వేదపండితులు అనంతపద్మనాభ శర్మ, రామకృష్ణ అవధాని, అర్చకులు చక్రవర్తి, అనంతాచార్యులు, రాఘవాచార్యులు, ప్రశాంతకుమార్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సుగుణమ్మ, సభ్యులు మహేశ్వర్, విజయలక్ష్మి, తలారి రామలింగ, గుడిపాటి ఆంజనేయులు, కందుల ప్రసాద్‌రెడ్డి, నారాయణస్వామి, చెల్లూరి నరసింహులు, జగదీష్ ప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఒంటె వాహనంపై స్వామివారి విహారం, ఆలయం వెలుపల కిక్కిరిసిన భక్తులు

కిటకిటలాడిన మురడీ ఆలయం

డీ హీరేహాళ్: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా మురడీ ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా వేలాది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామివారికి పన్నీరాభిషేకంతో పాటు వివిధ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పుష్పాలంకరణ చేసి.. ఆకుపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.



ప్రత్యేకాలంకరణలో మురడీ ఆంజనేయస్వామి



నల్లచెరువు మండలం పాలపాటిదెన్నెలో దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు, అలంకరణలో ఆంజనేయస్వామి

ఖాద్రీశుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. నాలుగవ శ్రావణ శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. జిల్లానుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు చిత్తూరు జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పుష్పాలతో అలంకరణచేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి శ్రీవారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాదాల కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పచ్చిపులుసు నరేంద్రబాబు, ఆలయ ఈఓ వెంకటేశ్వరెడ్డి, పాలకవర్గ సభ్యులు మోపూరిశెట్టి చంద్రశేఖర్, కరె నాగరాజు, నాగరాజు, రఘునాథరెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



గోపురం ఎదుట భక్తుల సందడి



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

నేమకల్లులో భక్తజన సందోహం

బొమ్మనహాళ్: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా నేమకల్లులో భక్తులు కిటకిటలాడారు. స్వామివారి ఆలయంలో ఉదయం నుంచి ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి, సంతోష్‌కుమార్ స్వామి, మురళి ఆధ్వర్యంలో స్వామివారికి పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేకాలంకరణ, ఆకుపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి వివిధ రకాల పుష్పమాలలతో పాటు తులసీదళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, ప్రసాదవినియోగం నిర్వహించారు. అనంతపురం, ధర్మవరం, గుంతకల్లు, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం డిపోల నుంచి ప్రత్యేక హనుమాన్ దర్శన్ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో భక్తులు అనేక మంది తరలివచ్చారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐ శ్రీరామ్ శ్రీనివాస్, ఎస్‌హెచ్‌వో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసులు, ధర్మకర్త కాశీనాథ్, మండలి సభ్యులు, కార్యనిర్వాహక సిబ్బంది భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి

నేమకల్లు ఆంజనేయస్వామిని ఎమ్మెల్సీ గుణపాటి దీపక్‌రెడ్డి సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యూ ఇండియా క్రషర్స్ తరపున ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో పాటు టీవీఎస్ కాంతారావు, అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు జగన్నాథరెడ్డి, మల్లికార్జున, కన్వీనర్ బలరామ్, నాగరాజు, అప్పారావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా అంజన్న ముత్యాల రథోత్సవం

శ్రావణ మాసం ఆఖరి శనివారం సందర్భంగా స్వామివారి ముత్యాల రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం వర్షం అవరోధం కలిగించడంతో కొంత ఆలస్యమయింది. ప్రత్యేకంగా అలంకరించిన ముత్యాల రథోత్సవంలో బాలాంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన అనేక మంది భక్తులు, మహిళలు స్వామివారికి టెంకాయలు సమర్పించి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో శ్రీనివాసులు, కార్యనిర్వాహకులు ఓబన్న, ధరకర్త కాశీనాథ్, బసప్ప ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి

తుంగభద్ర జలాశయ సమాచారం

19-8-17	ప్రస్తుతం	గత ఏడాది
నీటిమట్టం (అడుగులు)	1617.87	1617.80
సామర్థ్యం (టీఎంసీలు)	52.65	52.48
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4,394	9,942
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	700	8,078

జిల్లాలో విస్తారంగా వర్షాలు

అనంతపురం కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా శనివారం విస్తారంగా వర్షాలు పడ్డాయి. పామిడి, తాడిపత్రిలో భారీ వర్షం కురిసింది. అనంతపురం, గుంతకల్లు, కదిరి, గాండ్లపెంట, ఎన్‌పీకుంట తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. రాయదుర్గం, హిందూపురం తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. శుక్రవారం జిల్లావ్యాప్తంగా 11 మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఈనెల సాధారణ వర్షపాతం 88.7 మిమీలుకాగా ఇప్పటి వరకు 55.8 మిమీ వర్షపాతం నమోదైంది.

వీరాంజనేయస్వామికి 4 కిలోల వెండి వితరణ

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని మేళాపురంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయానికి ముద్దిరెడ్డిపల్లికి చెందిన డీసీ ఆంజనేయులు, కుటుంబ సభ్యులు శనివారం రూ.2 లక్షల విలువైన 4 కిలోల వెండిని వితరణగా అందజేశారు. శ్రావణమాసం ఆఖరి శనివారాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు చేసి వెండి ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. వెండి ఆభరణాలు అందించిన వారిలో డీసీ ఆనంద్, కుటుంబ సభ్యులు ఉన్నారు.



వెండి ఆభరణాల అలంకరణలో మూలవిరాట్



వెండిని వితరణ చేస్తున్న దాత డీసీ ఆంజనేయులు, కుటుంబ సభ్యులు

పేద జంటకు బీరువా వితరణ

అనంతపురం టౌన్ : అమ్మ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద జంటకు బీరువా వితరణ చేశారు. అనంతపురం నగరంలో తాజాగా ఓ ఫకీరు కూతురికి వివాహమైంది. ఈ నేపథ్యంలో ఆ పేద కుటుంబానికి శనివారం పాతూరులో ఆ పేద కుటుంబానికి అమ్మ అసోసియేషన్ సలహాదారుడు ముస్తాక్‌అలీఖాన్ బీరువాను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ముక్తియార్, సహాయ కార్యదర్శి బాషా, దస్తగిరి, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రోకర్లను పెట్టుకున్నారా..?

- ఒక్కొక్కరికి ఒక్కో అసిస్టెంట్ కావాలా..
- అవుట్ సోర్సింగ్ చేతిలో రెవెన్యూ సెక్షన్
- అధికారులపై కమిషనర్ మూర్తి ఫైర్

అనంతపురం కార్పొరేషన్: మీకు ప్రభుత్వం జీతమిస్తోంది.... మీరు కాలమీద కాలేసుకుని కూర్చుంటే...మీ కింది అవుట్ సోర్సింగ్ సిబ్బంది మీ పనులన్నీ చక్కబెట్టాలా..? అంతా వారిని అడ్డం పెట్టుకుని అక్రమాలకు తెరతీస్తున్నారన్న విమర్శలు భారీగా వినిపిస్తున్నాయ్ అంటూ కమిషనర్ మూర్తి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఒక సెక్షన్‌కు ఒక అవుట్ సోర్సింగ్ కార్మికుడిని మాత్రమే వినియోగించుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో శనివారం ఈ ఆఫీస్, ఈఆర్పీపై ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఈ ఆఫీస్, ఈఆర్పీ విధానంతో ఎన్నో ఉపయోగాలున్నాయన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అయితే గతంలో మాన్యువల్‌గా ఫైల్స్, బిల్లులు చేసేటప్పుడు పేపర్లు దాచేయడం, చించేయడానికి గతంలో ఆస్కారం ఉండేదన్నారు. అయితే ఇకపై వాటికి అవకాశం ఉండదన్నారు. ఈ విధానంతో అందరిలో బాధ్యత పెరుగుతుందన్నారు. అయితే చాలా మంది ఉద్యోగులు ఐడీ లాగిన్స్‌ను ఇతరులు ఆపరేట్ చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సెక్షన్‌లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని అడ్డంపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారన్న



రెవెన్యూ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ మూర్తి

విమర్శలు భారీగా వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. మీరు అక్రమాలు చేయడానికి వాళ్లను బ్రోకర్లుగా వాడుతున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా....ఒక్కో సెక్షన్‌లో భారీ స్థాయిలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఎందుకని ప్రశ్నించారు. ఉద్యోగులతో సమానంగా సిబ్బంది ఉన్నారని, ఇలాంటి సంప్రదాయం ఎక్కడా లేదన్నారు. ఇకపై ఒక్కో సెక్షన్‌కు ఒక సిబ్బందిని మాత్రమే వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా ఉద్యోగుల ఐడీ లాగిన్స్ ఇతరులకు ఇచ్చినట్లు తెలిస్తే క్రిమినల్ కేసులు ఫైల్ చేయిస్తానని ఆయన హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్, కార్యదర్శి నిత్యం తనిఖీ చేయాలన్నారు. ఎవరెవరు సక్రమంగా ఐడీలను వినియోగిస్తున్నారో పరిశీలించాలన్నారు. తాను కూడా ఆకస్మికంగా తనిఖీ చేస్తానన్నారు. అదేవిధంగా వర్క్ ఇన్‌స్పెక్టర్ల కూడా డ్రెస్ కోడ్ ధరించేలా చూడాలని డీఈ లక్ష్మీకాంతరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సన్యాసిరావు, కార్యదర్శి జ్యోతిలక్ష్మి, ఆర్వోలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబర్ 12న ఎన్ఎంయూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

అనంతపురం సప్తగిరిసర్కిల్: నేషనల్ మజ్దూర్ యూనియన్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు సెప్టెంబర్ 12న నిర్వహిస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం విజయవాడలో మంత్రులను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఆర్టీసీలో 1967 ఆగస్టులో పి. రామమోహన్‌రావు స్థాపించారన్నారు. ఈ నెల ఆఖరుకు యూనియన్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 12న విజయవాడలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రవాణాశాఖామాత్యులు అచ్చెన్నాయుడుతో పాటు ఇతర మంత్రులు హాజరవుతారన్నారు. ఇదే సందర్భంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా సావనీర్ విడుదల చేయడం జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

అనంతపురం సెంట్రల్: తపాలా ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారానికై చేపట్టిన సమ్మె శనివారం నాల్గవ రోజు కొనసాగింది. ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి చంద్రమోహన్, నాయకులు వెంకటస్వామి, రామాంజనేయులు, సూర్యనారాయణరెడ్డి, చితంబరి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఐజీడీఎస్‌యూ సూచించిన సవరణలతో సహా జీడీఎస్ కమిటీ రిపోర్టును త్వరగా అమలు చేయాలన్నారు. జీడీఎస్‌లకు 8 గంటలు పనికల్పించి రెగ్యులర్ చేయాలన్నారు. టార్గెట్ పేరుతో జీడీఎస్‌లను బలవంతం చేయడం తగదన్నారు. తమ డిమాండ్లకు పరిష్కారం చూపే వరకూ సమ్మె కొనసాగుతుందన్నారు.

'ఆదినారాయణరెడ్డిని మంత్రి పదవి నుంచి తొలగించాలి'

అనంతపురం ప్రెస్‌క్లబ్: స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర మార్కెటింగ్ శాఖామంత్రి ఆదినారాయణరెడ్డి ఎస్సీలనుద్దేశించి అవమానకరంగా మాట్లాడటం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు నగర అధ్యక్షుడు బండి రవికుమార్ అన్నారు. శనివారం నగరంలోని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం పక్కనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘం నాయకులు మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఓబిలేసు, నాయకులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ గీతం ఆలపించేలా చర్యలు తీసుకోండి'

అనంతపురం సప్తగిరిసర్కిల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులతో జాతీయ గీతం, జాతీయ గేయం తప్పనిసరిగా ఆలపించేలా చర్యలు తీసుకోవాలని నవయువభారత్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు చంద్రమోహన్ జిల్లా కలెక్టర్ వీరపాండియన్‌ను కోరారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకుడు చంద్రమోహన్ మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌లో డిగ్రీ, జూనియర్ కళాశాల పక్కనే మద్యం షాపు ఉందని తొలగించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

'చలో విజయవాడకు కార్మికులకు అనుమతి ఇవ్వండి'

అనంతపురం కార్పొరేషన్: చలో విజయవాడకు వెళ్లేందుకు కార్మికులకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం జేఏసీ నాయకులు గోపాల్, నరసింహులు, నల్లప్ప, మరికొందరు కార్యాలయ కార్యదర్శి జ్యోతిలక్ష్మిని ఆమె చాంబర్‌లో కలిశారు. ఈ నెల 22న కార్మికులకు విజయవాడకు వెళ్లనున్నారన్నారు. అందుకు కార్మికులకు అనుమతి ఇవ్వాలని ఈ మేరకు కార్యదర్శి జ్యోతిలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

నేడు పెన్షనర్లకు ఉచిత వైద్యశిబిరం

అనంతపురం ప్రెస్‌క్లబ్: స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జిల్లాలోని పెన్షనర్లకు కీలు మార్పిడి చికిత్సలకు ఆదివారం ఉచిత వైద్యం శిబిరం నిర్వహిస్తున్నట్లు పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు బీ పెద్దన్నగౌడ్, కార్యదర్శి బసవరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నగరంలో గల ఎస్వీ మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి ఆధ్వ ర్యంలో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల ప్రముఖ డాక్టర్ వై రత్నాకర్‌రావ్ బృందంచే చికిత్సలు ఉంటాయన్నారు. జిల్లాలోని పెన్షనర్లందరూ ఈహెచ్ఎస్ కార్డుతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు

అనంతపురం టౌన్: శనిత్రయోదశిని పురస్కరించుకుని శనివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని చాముండేశ్వరి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో శనీశ్వర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషంగా హాజరైన భక్తుల చేతులమీదుగా శనేశ్వరుడి ప్రతిమకు తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధరకాల పుష్పాల తో స్వామివారిని అలంకరించి పూజలు నిర్వహించారు.

తదనంతరం ఆలయ ఆవరణలో గణపతి హోమాలు, శనినివారణ హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

సారొచ్చారు...మొదలెట్టండి..

- ఎస్ఈ వచ్చారని మూడోసారి పరీక్షలు.. స్వీపింగ్ మిషన్‌కు గండాలు..
- ఏడాదిన్నరగా ఇదే తంతు.. పాలకులు, అధికారుల వింత వైఖరి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థకు చెందిన స్వీపింగ్ మిషన్ పరిస్థితి రెడ్డి గారొచ్చారు.... మళ్లీ మొదలెట్టండి అన్న చందంగా తయారైంది. ఒక్కో అధికారి వచ్చినప్పుడల్లా ఒక్కోసారి పరీక్ష కోసం రోడ్డెకాల్సిన దుస్థితికి ఏర్పడింది. ఇప్పటికే రెండుసార్లు పరీక్షించారు. ఇప్పుడు మళ్లీ మూడోసారి తన సామర్థ్యాన్ని పరీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మిషన్ విషయంలో అటు అధికారులు, ఇటు పాలకుల వింత వైఖరి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తాజాగా శనివారం కూడా మరోసారి దీని సామర్థ్యాన్ని అధికారులు పరీక్షించడం విమర్శలు తావిస్తోంది.

పనిచేయించున్నా...కలగని నమ్మకం...

స్వీపింగ్ మిషన్‌తో సుమారు నాలుగు నెలల పాటు నగరంలోని రోడ్లను కూడా దీనితో ఊడ్పించారు. ప్రధాన రహదారులతోపాటు పలుప్రాంతాల్లో ఈ యంత్రంతో పనులు చేయించారు. అయితే ఇక్కడి వ ర కూ బాగానే ఉంది. అయితే అప్పటి నుంచి స్వీపింగ్ మిషన్ సామర్థ్యంపై అందరికీ సందేహాలు వచ్చాయి. దీనిని ఉపయోగించుకోనూ లేదు. మూలన పెట్టేశారు. బిల్లు చెల్లింపుపై కూడా సందేహాలు నెలకొన్నాయి. కొత్త అధికారులు వచ్చినప్పుడల్లా ఆ మిషన్ రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో ఎస్ఈగా సత్యనారాయణ ఉన్నప్పుడు మూడు రోజులు పరీక్షించారు. అంతలోనే సదరు ఎస్ఈ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి మరో చోటకు బదిలీ అయ్యారు. ఆయన వెళ్లగానే ఎస్ఈగా మరో అధికారి వచ్చారు. కొత్త ఎస్ఈగా నాగమోహన్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం తాజాగా మరోసారి నగరంలో దీనిని పరీక్షించారు.

రూసా నిధులతో వర్శిటీ అభివృద్ధికి కృషి: వీసీ

ఎస్కేయూ: రూసా నిధులతో వర్శిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎస్కేయూ వీసీ ఆచార్య రాజగోపాల్ పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ చాంబర్‌లో శనివారం రూసా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య రాజగోపాల్ మాట్లాడుతూ.... మొదటి విడత మంజూరయ్యే నిధులను కేవలం మౌలిక సదుపాయాలకే ఖర్చు చేయాలన్నారు. రూసా నిధులలో మొదటి విడతగా రూ. 4 కోట్లు మంజూరు కానున్నాయని మిగతా నిధులు విడతల వారీగా మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, రెక్టార్ ఆచార్య లజపతిరాయ్, పాలకమండలి సభ్యుడు ఆచార్య మల్లికార్జునరెడ్డి, ఆచార్య నాగభూషణం రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

'గ్రామీణ తపాలా ఉద్యోగుల ర్యాలీని జయప్రదం చేయండి'

అనంతపురం సెంట్రల్: గ్రామీణతపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె ప్రభుత్వం దిగి వచ్చే వరకూ కొనసాగిస్తామని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణయ్య యాదవ్ పేర్కొన్నారు. అందులో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో అనంతపురం, హిందూపురం, రెండు డివిజన్ల తపాలా ఉద్యోగులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు ప్రధాన తపా లా కా ర్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. క్లాక్ టవర్, సప్తగిరి సర్కిల్, పాతవూరు మీదుగా కలెక్టరేట్‌కు చేరుకోవడం జరుగుతుందన్నారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ర్యాలీని గ్రామీణ తపాలా ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ బెస్ట్ అవెలబుల్ స్కూల్ వెయిటింగ్ లిస్ట్ అభ్యర్థులు హాజరుకండి

అనంతపురం సెంట్రల్: బెస్ట్ అవెలబుల్ స్కూల్ పథకం కింద వెయిటింగ్ లిస్టు జాబితాలో ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించగలరని డీడీ రోశన్న తెలిపారు. 1,5 తరగతుల్లో ప్రవేశాల కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఉండాలన్నారు. సెల్ ఫోన్స్‌కు సమాచారం వచ్చిన అభ్యర్థులు అయి ఉండాలన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీలోపు ధ్రువీకరణ పత్రాలు పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. 23 వరకూ హాజరు కాని అభ్యర్థులను జాబితా నుంచి తొలగించబడుతాయన్నారు. 24న ఎంపిక ధ్రువీకరణ పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరన్నారు.

జూదరుల అరెస్ట్

ఆంధ్రజ్యోతి అనంతపురం: నగరంలోని కమలానగర్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ సాయిప్రసాద్, నాగమధు సిబ్బందితో కలిసి శనివారం దాడి చేసి వారి రూ.6,100లు స్వాధీనం చేసుకున్నారు.

మట్కా రాయుళ్ల అరెస్ట్: నగర శివారులోని శారదానగర్‌లో ఇద్దరు మట్కారాయుళ్లను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం సీఐ సాయిప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్ఐ నాగమధు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. శారదానగర్‌లో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1260లు స్వాధీనం చేసుకున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

అనంతపురం సెంట్రల్: అగ్రిప్రమాదాలు సంభవించినప్పుడు మం టలుఅదుపు చేయడం ఎలా అన్న దానిపై స్టేషన్ ఫైర్ అధికారి లింగమయ్య ఎస్ఎన్ డెంటల్ క్లినిక్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన చర్యల్లో భాగంగా శనివారం సాయినగర్‌లోని ఎస్ఎన్ దంత వైద్యశాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలు రకాల విన్యాసాలు చేసి అగ్నిప్రమాదాల నివారణపై చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

ఇంజనీరింగ్ రంగంలో ఉద్యోగావకాశాలు అపారం

-ఎస్కేయూ రెక్టార్ ఆచార్య లజపతిరాయ్



ప్రసంగిస్తున్న ఎస్కేయూ రెక్టార్ ఆచార్య లజపతిరాయ్

ఎస్కేయూ: ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు అపారంగా ఉన్నాయని, అయితే దేశంలోని వివిధ సంస్థలు నైపుణ్యవంతమైన స్కిల్స్ కలిగిన అభ్యర్థులకు అవకాశాలు ఇస్తున్నాయని ఎస్కేయూ రెక్టార్ ఆచార్య లజపతిరాయ్ పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ పూలే భవనంలో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు కెరీర్ ప్లానింగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వర్శిటీ రెక్టార్ ఆచార్య లజపతి రాయ్ మాట్లాడుతూ.... దేశంలో 10 నుంచి 15 శాతం మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు మాత్రమే నైపుణ్యాలు కలిగిన యువత ఉన్నారని, స్కిల్స్ లేకపోవడం వలన మిగతా వారికి అవకాశాలు లభించడం లేదన్నారు. ఇందుకోసం ఇంజనీరింగ్ కళాశాలలు తమ విద్యార్థులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఇందుకోసం అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్టా నేషనల్ డైరెక్టర్ రమేష్, ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాఘువేంద్రరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రఘు, ఇంజనీరింగ్ ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

విచారణ పేరుతో వేధింపులు

ఏడీసీసీ బ్యాంకు ఎదుట నిరసన



నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు

అనంతపురం సెంట్రల్: ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగులను విచారణ పేరుతో విచారణాధికారి నారాయణస్వామి వేధింపులకు గురి చేయడం తగదని ఏపీ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు, ఉద్యోగుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం విచారణ అధికారి తీరుకు నిరసనగా బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం అధ్యక్షుడు ఋషేంద్రబాబు మాట్లాడుతూ..... బ్యాంకుపై దురుద్దేశ్యంతోనే కుంటిసాకులు చెబుతూ పరిధిని మించి విచారణ అధికారి నారాయణస్వామి వేధింపులకు పాల్పడటం సరికాదన్నారు. విచారణ అధికారికి ఉత్తర్వులు ఇచ్చే అధికారం డీపీఓకు లేదన్నారు. అందుకు నిరసనగా ఈ నెల 24న డీపీఓ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మున్వర్‌బాషా, మురళీకృష్ణ, చంద్రశేఖర్, ఈఓ సుఖదేవ్‌బాబు, అనిల్‌కుమార్‌రెడ్డి, జానకీ రామిరెడ్డి, బ్యాంకు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రమ్మ

అనంతపురం టౌన్ : పాఠశాలస్థాయినుంచే విద్యార్థుల్లో క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రమ్మ పేర్కొన్నారు. పెయింటింగ్, టేబుల్ టెన్నిస్‌క్రీడలో జాతీయ, అంతర్జాతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు శనివారం నలంద కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో అభినందనసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో విద్యార్థులు నిత్యం చదువుతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనిని అధిగమించాలంటే విద్యార్థుల్లో క్రీడలపట్ల ఆసక్తిని పెంచాలన్నారు. అనంతరం జాతీయస్థాయిలో బంగారుపతకాలు సాధించిన టేబుల్‌టెన్నిస్ క్రీడాకారులు ధార్మిక్, హాసిని, శ్రేష్ఠ, హిమప్రియ, నాగశ్రావణితోపాటు అంతర్జాతీయస్థాయిలో పెయింటింగ్‌లో బహుమతి పొందిన నేహను అభినందిస్తూ మొమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు యమున, చంద్రిక, రామాంజినమ్మ, ఉమ, నలంద కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, ఏఓ బాలక్రిష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రమేష్, సూర్యచంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి

ముగిసిన విద్యార్థుల ఎంపిక ప్రక్రియ

అనంతపురం సెంట్రల్: గిరిజన విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్‌లలో ప్రభుత్వం ద్వారా విద్యను అభ్యసించడానికి చేపట్టిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం ద్వారా శనివారం విద్యార్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని స్థానిక డిఆర్‌డిఏ సమీపంలోని ఎస్సీ వసతి గృహంలో చేపట్టారు. గిరిజన సంక్షేమ శాఖాధికారి కొండలరామ అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమశాఖ డీడీ రోశన్న హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంపిక ప్రక్రియలో 481 మంది విద్యార్థులను 3,5,8 తరగతుల్లో విద్యను అభ్యసించేలా దరఖాస్తులు స్వీకరించడం జరిగింది.

అందరూ అనుగుణంగా ఎంపిక ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. 481 మంది వి ద్యార్థులకు అవకాశం ఉండగా 1335 దరఖాస్తులు స్వీకరించి అందుకు అనుగుణంగా లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియకు విద్యార్థులు హాజరయ్యారు. అయితే ఎంపిక ప్రక్రియ రాత్రి 9 గంటల వరకూ నిర్వహించి షెడ్యూలుకు అనుగుణంగా పూర్తీచేశారు. ప్రవేశాలుకు సంబంధించి తదుపరి ఉత్తర్వులు శాఖ కార్యాలయంలో అందించనున్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

అనంతపురం ప్రెస్‌క్లబ్: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పత్రికా ఫోటోగ్రాఫర్‌ల ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, సమాచారశాఖ ఏడీ జయమ్మ ముఖ్య అతిథులుగా హాజరై ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన పలు ఫొటోలను తిలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ..... ఫొటోగ్రఫీ వృత్తినే దైవంగా భావించి ఫొటోగ్రాఫర్లు ఎన్నో ఒడిదుడుకులు, సమస్యలను ఎదుర్కొంటూ సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను తమ ఫొటోల ద్వారా సమాజానికి చూపగలుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు, పాత్రికేయులు పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకూ ఉద్యమిస్తాం..

-రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు లింగమయ్య

అనంతపురం సెంట్రల్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకూ పోరాడుతామని రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు లింగమయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజక జిల్లా మహాసభల్లో చర్చించిన అంశాలను వివరించారు. అనంతరం జిల్లా నూతన కమిటీ వివరాలను ప్రకటించారు. దేశంలోని 16 రాష్ట్రాలలో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారన్నారు. ఏపీలో మాత్రం బీసీ జాబితాలో ఉండటంతో ప్రభుత్వ పథకాలు అందక ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. ఎస్సీ జాబితాలో చేర్చడం ద్వారానే తగిన న్యా యం జరుగుతుందన్నారు. ప్రభుత్వమే దోబీఘాట్‌ల నిర్మాణం చేపట్టి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఆదినారాయణ, అధ్యక్షుడిగా లింగమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మ ల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా సత్యమయ్య, సుంకన్న, రంగయ్య, తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లింగమయ్య

నేడు హ్యాపీ సండే

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రెండో రోడ్డులో ఉన్న శారదా పాఠశాలలో ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యాలయ వర్గాలు శనివారం తెలిపాయి. ఇక నుంచి డివిజన్ స్థాయిల్లో హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు, పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

అక్రమ బదిలీలను తక్షణం రద్దు చేయండి

-ఎన్ఎంయూ రీజినల్ కార్యదర్శి

అనంతపురం సప్తగిరిసర్కిల్: జిల్లాలో జరుగుతున్న అక్రమ బదిలీలను తక్షణమే రద్దు చేయాలని ఎన్ఎంయూ రీజినల్ కార్యదర్శి భాస్కర్‌నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఎం చిట్టిబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ.... రీజియన్‌లో అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో సర్వీసును కుదిస్తున్నారన్నారు. నష్టాలకు కారణాలు తెలుసుకోకుండా బస్సుసర్వీసులను తగ్గించడం దారుణమన్నారు. 15 నుంచి 20 సంవత్సరాల సర్వీసు ఉన్న కార్మికులను జూనియర్‌లుగా బదిలీ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారన్నారు. ఇతర డిపోల్లో డ్రైవర్లు, కండెక్టర్లు ఎక్సెస్ ఉన్నా.... వా రిని బదిలీ చేయకుండా సర్వీసులు రద్దు చేసి ఎక్సెస్ పేరుతో బ దిలీ చేయడం అన్యాయమన్నారు. జూనియర్‌లుగా బదిలీ చేసిన కార్మికులను తిరిగి మాతృడిపో నందే విధులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాచేయని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ నాయకులు పుల్లయ్య, నాగరాజు, చలపతి, పరమేష్, ఆచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- ఏపీ వ్యవసాయ కార్మికసంఘం

అనంతపురం టౌన్: జిల్లాలో ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కూలీలు కష్టపడి చేసిన పనికి 3 నెలలైనా బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. కూలీల బిల్లులు, మెటీరియల్ బిల్లులు, ఇతర బకాయిలన్నీ కలిపి రూ. 82,32,82,141లు బకాయి వుందని, కేంద్రప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, ఉపాధ్యక్షుడు బాలరంగయ్య, సహాయ కార్యదర్శు లు సాంబ, ఆంజనేయులు, నిర్మల, జిల్లా కమిటీ సభ్యులు భాస్క ర్, ఎర్రిస్వామి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం కార్పొరేషన్: మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు కమిషనర్ మూర్తిని కోరారు. ఆ సంఘం జిల్లా కో-కన్వీనర్ వీరాంజనేయులు, మరికొందరు శనివారం కమిషనర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ఏడాది యూనిఫామ్స్‌నే పంపిణీ చేస్తున్నారని, ఒక్కరికి కూడా కొత్త యూనిఫామ్స్ పంపిణీ చేయలేదన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదన్నారు. మరుగుదొడ్లు ఉన్నా... నిరుపయోగంగా ఉన్నాయని అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వారు కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రం అందించారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయిరామ్, శరత్‌కుమార్, కులశేఖర్, ఖుదుఫ్, బాషా, సంతోష్ రెడ్డి, కిరణ్, అజయ్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి: డీసీటీఓ

అనంతపురం సెంట్రల్: రైల్వే స్టేషన్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని డీసీటీఓ (సికింద్రాబాద్) నాగరాజు అధికారులను ఆదేశించారు. శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శుభ్రత చర్యలు చేపట్టారు. డిప్యూటీ సీటీఓ నాగరాజు, డీపీఓ (డివిజనల్ పబ్లిక్ అధికారి) లక్ష్మినారాయణ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛభారత్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ తిప్పానాయక్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ధర్మవరం
4
ఆదివారం 20 , ఆగస్టు 2017
• ధర్మవరం • బత్తలపల్లి • ముదిగుబ్బ • తాడిమర్రి

23న ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

ధర్మవరంఅర్బన్: వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఆటోలను స్థానిక ప్రొహిబిషన్అండ్ ఎక్సైజ్ స్టేషన్లో ఆవరణంలో శనివారం పెనుకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ ఆధ్వర్యంలో ఈనెల 23న వేలం పాట నిర్వహించబోతున్నట్లు సీఐ నరసానాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈవేలం పాటలో పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ రుసుం రూ.1000 చెల్లించి టోకన్ తీసుకోవాలన్నారు. వేలం మొత్తంతో పాటు పాట దక్కించుకున్న వారు జీఎస్టీని చెల్లించి వాహనాన్ని తీసుకుపోవాలని సీఐ తెలిపారు.

మలకవేమలలో మంచినీరు కరువు

నిరుపయోగంగా ఓవర్హెడ్ ట్యాంకులు - నిర్లక్ష్య వైఖరిలో అధికారులు


మరమ్మతుకు నోచుకోని ట్యాంకు


పంచాయతీ వారు వేసిన బోరు

ముదిగుబ్బ: గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వర్షాభావ పరిస్థితులతో తాగునీటి ఎద్దడి తీవ్రమై వేసవిని తలపిస్తోంది. కొళాయిల ద్వారా నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు, ఓవర్హెడ్ ట్యాంకులున్నా నిరుపయోగంగా మారాయి. మండలంలోని మలకవేమలలో తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ఓవర్హెడ్ ట్యాంకు మరమ్మతుకు గురి కావడంతో ఆ ట్యాంకులోకి నీరు సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ సమీపంలోనే పంచాయతీ ఆధ్వర్యంలో బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడ్డాయి. అక్కడి నుంచి పైప్లైన్ ఏర్పాటు చేసి ట్యాంకుకు మరమ్మతులు చేయించి నీటిని విడుదల చేస్తే గ్రామానికి నీటి సమస్య తీరుతుంది. అధికారులు దీనిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, పెట్రోల్బంకు వద్ద ఉన్న ఓవర్హెడ్ ట్యాంకులు నిరుపయోగంగా మారి గ్రామంలో దిష్టిబొమ్మల్లా మారాయి. వీటికి త్వరలోనే నీటిని సరఫరా చేస్తామని చెబుతున్నారే కానీ ఇంత వరకు ఆ ఊసే లేదు. పెట్రోల్ బంకు ప్రాంతంలో సమస్య తీవ్రంగా ఉంది. ఈ ట్యాంకర్లను వినియోగంలోకి తెచ్చి నీటిని సరఫరా చేస్తే ప్రజల కష్టాలు తీరుతాయి.


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

ట్యాంకుకు మరమ్మతులు చేయించాలి : పతిరెడ్డి



గ్రామం నడిబొడ్డున ఉన్న పాత ఓవర్హెడ్ట్యాంకు శిథిలావస్థకు చేరుతోంది. మరమ్మతులు చేయించి కొత్తగా వేసిన బోరు వద్ద నుంచి పైప్లైన్ సౌకర్యం కల్పించి నీటిని సరఫరా చేస్తే గ్రామంలో నీటి ఎద్దడి ఉండదు.

ట్యాంకులకు నీటిని సరఫరా చేయాలి : బాదల్వలి



పెట్రోల్బంకు సమీపంలో ఉన్న ఓవర్హెడ్ ట్యాంకుకు నీటిని సరఫరా చేస్తే పెట్రోల్బంకు ఏరియా, సామిల్ వెనుకవైపు వీధుల్లో తాగునీటి సమస్య తీరుతుంది. దిష్టిబొమ్మల్లా ఉన్న వీటిని వినియోగంలోకి తెచ్చి దాహం తీర్చాలి.

లోకల్ గైడ్

localguide

ఎమ్మెల్యే డైరీ

ధర్మవరం: ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఈనెల 21 వరకు నియోజకవర్గంలో అందుబాటులో ఉండటం లేదు. నంద్యాల ఉపఎన్నికలో భాగంగా టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం కోసం ప్రచారంలో పాల్గొంటున్నారు.

ధర్మవరం మార్కెట్లో కూరగాయల ధరలు



పచ్చిమిర్చి 30, వంకాయలు 30, కాకర 50 టమోట 30, క్యారెట్ 60, బీన్స్ 50, ఎర్రగడ్డలు 20, బంగాళాదుంప 20, ముల్లంగి 20, క్యాబేజి 40, చౌడేకాయలు 30, బీరకాయలు 40, బీట్రూట్ 30, బెండ 40.

ధర్మవరం సినిమాలు

సిద్దార్థ: ఫిదా, **లక్ష్మీనారాయణ:** శమంతకమణి, **లక్ష్మీచక్రవర్తి:** నక్షత్రం, **వరలక్ష్మి:** లై, **విజయలక్ష్మి:** డీజే,
రంగా సెంట్రల్: నిన్నుకోరి, గౌతమ్నంద, జయజానకీనాయక, ఆనందోబ్రహ్మ

ధర్మవరం డిపో నుంచి ఆర్టీసీ బస్ సర్వీస్లు

ధర్మవరం-హైదరాబాద్ : ఉదయం 11.30 గంటలకు, మధ్యాహ్నం 1.30, 3.30, రాత్రి 8.30, 9.30,
ధర్మవరం-చెన్నై: రాత్రి 8 గంటలకు,
ధర్మవరం-విజయవాడ: సాయంత్రం 4.30, 6.30 గంటలకు, ధర్మవరం-నెల్లూరు: సాయంత్రం 6.15కు,
ధర్మవరం-ఒంగోలు : మధ్యాహ్నం 3.30గంటలకు,
ధర్మవరం-తిరుపతి : సాయంత్రం 4.30గంటలకు

ఉపాధ్యాయులకు సన్మానం

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన 8 మంది ఉపాధ్యాయులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు జయరామిరెడ్డి ఎనిమిదేళ్లపాటు ఇక్కడ పనిచేసి, బదిలీపై రాప్తాడు మండలంగాండ్లపర్తికి వెళ్లారు. మిగిలిన ఏడు మంది ఉపాధ్యాయులు పలు మండలాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వారిని ఆ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు.

మిలియన్ మార్చ్కు తరలిరండి

ముదిగుమ్మ: విజయవాడలో సెప్టెంబర్ ఒకటో తేదీన జరిగే మిలియన్ మార్చ్కు భారీగా తరలిరావాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం ముదిగుబ్బలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు జాక్టో పోతలయ్య, అధ్యక్షుడు మహ్మద్రఫి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచౌదరి, కోశాధికారి నాగేంద్రగౌడ్లు మాట్లాడుతూ సీపీఎస్ విధాన రద్దుకై జరుగుతున్న మిలియన్ మార్చ్కు తరివచ్చి జయప్రదం చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో నారాయణ, మిమిక్రీ ఆది, ఫకృద్దిన్, ఆదనారాయణ, షబ్బీర్, షాకీర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలి

ముదిగుబ్బ: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగించే గ్యాస్ స్టౌకు ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయుడు జాక్టో పోతలయ్య, ఈశ్వరయ్య, సురేశ్కుమార్ పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ఎంఈఓ సుధాకర్ నాయక్తో శనివారం చర్చించారు. దీనిని హెచ్ఎంలతో ముడిపెట్టకుండా ప్రభుత్వమే ఏజెన్సీలకు కానీ, కాంట్రాక్టర్లకు కానీ నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం పాఠశాలల ఖాతాల్లో ఎలాంటి నిధులు లేనందున ప్రధానోపాధ్యాయులు వీటికి నగదును మంజూరు చేసే పరిస్థితుల్లో లేరన్నారు.

ప్రభుత్వ హామీలన్నీ నెరవేర్చాలి : సీఐటీయూ

ధర్మవరంఅర్బన్: ప్రభుత్వం ప్రకటించిన హామీలన్నీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఈటెల నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం అసంఘటిత కార్మికుల సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడితోపాటు కార్మిక శాఖ అధికారి కృష్ణారెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై అవగాహన కల్పించారు. ఈటెల నాగరాజు మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి వారికి గుర్తింపు కార్డులను మంజూరుచేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అర్హులైన వారికి ఇళ్లస్థలాలు,50 ఏళ్లు దాటిన వారికి పింఛన్సౌకర్యంకల్పించాలని, కార్మికులందరికి రుణాలు మంజూరూ చేయాలన్నారు. అసంఘటిత కార్మికులందరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వర్తింపచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ ఆదినారాయణ, జేవీరమణ, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు హైదర్వలీ, నాయకులు అయూబ్, ఇర్ఫాన్, నారాయణ, దస్తగిరి, గురుప్రసాద్, రవూఫ్, ఉస్సేన్, షాకీరా, లక్ష్మీదేవి, రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించండి

శ్రీనివాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ధర్మవరంఅర్బన్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే లక్ష్యాలను చేరుకోగలమని శ్రీనివాసడిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాశీంపీరా, వైస్ప్రిన్సిపాల్ ముసల్ రెడ్డిలు పేర్కొన్నారు. శ్రీనివాస డిగ్రీ కళాశాలకు చెందిన బీఏ, బీకాం సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శ్రద్ధ వహించి ఇష్టపడి చదవాలన్నారు. ప్రధానంగా తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం మన సాంప్రదాయమన్నారు. ఈ ఏడాదిలాగే కళాశాలకు మంచి ఉత్తీర్ణత శాతాన్ని తీసుకురావాలని ఆయన ఆకాక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు, గ్రూప్ డ్యాన్స్లు, మ్యూజికల్స్ డ్యాన్స్లు, నృత్యాలను పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ కాశీంపీరా

నేడు లయన్స్క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరంఅర్బన్: లయన్స్క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ గౌరవాధ్యక్షుడు పిట్టా వెంకటస్వామి, అధ్యక్షుడు లక్ష్మినారాయణలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరం ఉదయం9గంటలకు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కంటిచూపు మందగించిన రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాతావరణ బీమాలో కోత విధించకండి : బీజేపీ

ముదిగుబ్బ: వాతావరణబీమా రైతుల ఖాతాల్లోకి సక్రమంగా జమ కావడం లేదని, అందులో కోత విధించకుండా పూర్తిగా వారి ఖాతాల్లోకి జమ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకుమార్, సిండికేట్, ఏపీజీబీ, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్లు రవికుమార్, రమాదేవి, సోమశేఖర్లకు బీజేపీ నాయకులు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ముదిగుబ్బ మండలానికి రూ.18 కోట్ల బీమా విడుదలైందని, ఈ లెక్కన ప్రతి రైతుకు హెక్టారుకు రూ.9 వేలు ప్రకారం జమ కావాల్సి ఉందని నాయకులు పేర్కొన్నారు. కానీ అలా కాకుండా రైతుల ఖాతాల్లోకి రూ.2,900 మాత్రమే జమ కావడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమల ప్రకాశ్నాయుడు, మోపూరి బాలాజి నాయుడు, సంజీవరెడ్డి, పుల్లప్ప, అశోక్ పాల్గొన్నారు.

రేపు గ్రీవెన్స్ ముట్టడి : ఐక్యవిద్యార్థి సంఘం


విలేఖరులతో మాట్లాడుతున్న ఐక్యవిద్యార్థి సంఘం నాయకులు

ధర్మవరంఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రవేటు, కార్పొరేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నందుకు 21న సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ను ముట్టడిస్తామని ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో అధిక ఫీజులు అరికట్టాలని, మధ్యాహ్నభోజనంలో అవకతవకలపై విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు వినయ్తేజ, ప్రవీణ్కుమార్, నరసింహమూర్తి, దుర్గ, శంకర్, అనిల్, చంద్రబోస్, చిరంజీవి, సుబహాన్ పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

ధర్మవరంఅర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశానికి ఫీజు చెల్లింపు గడువు తేదీ ఈనెల 24వరకు పెంచడం జరిగిందని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ ప్రిన్సిపల్ సురేశ్, కో ఆర్డినేటర్ కృష్ణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్, తత్సమాన అర్హత కలిగినవారు లేదా ఓపెన్ స్కూల్‌లో ఇంటర్‌పాస్ అయినవారు 2013నుండి 2017 సంవత్సరం కాలంలో అర్హత పరీక్ష పాసై ఎవరైన ఈ డిగ్రీ ప్రవేశానికి అర్హులన్నారు. ఓపెన్ డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరములకు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఈ నెల 24వరకు గడువు ఉందన్నారు. వివరాలకు కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్టడీసెంటర్‌లో సంప్రదించాలన్నారు. 94412 62045, 99663 58447లకు ఫోన్ చేయాలన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

ధర్మవరంఅర్బన్: పట్టణంలోని కొత్తపేట శ్రీవెంకటేశ్వరస్వామికి శనివారం శ్రావణమాసం సందర్భంగా అర్చకులు గోపాల కృష్ణమాచార్యులు, రవిశాస్త్రిలు శ్రావణ మాస పూజలు నిర్వహించారు. స్వామివారికి జలపంచామృతాభిషేకం అనంతరం వివిధ పూలతోఅలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. లింగిశెట్టిపాళ్యం వీధిలో ఉన్న అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో వెన్నఅలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నమయ్యసేవా మండలి ఆధ్వర్యంలో పొరాళ్ల పుల్లయ్య బృందం అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు.



ముదిగుబ్బలో వెంగమునిస్వామి

ధర్మవరంరూరల్: మండల పరిధిలోని వసంతపురం గ్రామంలోని శ్రీ తిక్కయ్య స్వామి దగ్గర వెలసిన నాగుల ప్రతిమకు పూజలు చేసి పుట్టలో పాలు పోసి భక్తులు నాగ పంచమి వేడుకలు కన్నుల జరుపుకున్నారు.

తాడిమర్రి: మండలంలోని పత్రపల్లి ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ఆకుపూజలు చేసి భజనలు చేశారు. ఆలయకమిటీ వారు అన్నదానం చేపట్టారు.

ముదిగుబ్బ: మండలంలోని మల్లేపల్లి పంచాయతీ తిమ్మానాయునిపాలెంలో వెలసిన అవధూత వెంగమునిస్వామి (వెంగగురుడు)కి శనివారం విశేషపూజలు చేశారు. స్వామివారి సమాధిని ప్రత్యేకంగా అలంకరించి, ఉత్సవ విగ్రహాన్ని సైతం పూలతో అందంగా అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మాంసాహారాన్ని నైవేద్యంగా ఉంచారు.

పొడరాళ్లపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శ్రావణశనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పూజలు, అర్చనలు చేశారు. సహజంగా ఆంజనేయ స్వామిని ఆలయంలో ప్రతిష్ఠిస్తారు. కానీ పొడరాళ్లపల్లిలో స్వామి విగ్రహాన్ని మంటపంలో ఉంచి పూజలు చేస్తుండటం ఇక్కడి విశేషం.



వెన్న అలంకరణలో ఆంజనేయస్వామి

నాటిన మొక్కలకు నీరివ్వండి

తాడిమర్రి: రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మండలంలో నాటిన మొక్కలు వారానికి తడిని తప్పకుండా ఇవ్వాలని వెలుగు ఏపీఎం ఓబులేశు అన్నారు. 95 శాతానికి పైగా మొక్కలు బతికితేనే ఉపాధికూలీలకు బిల్లులు వస్తాయని లేదంటే రావని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ధర్మవరంరూరల్: మండల పరిధిలోని కుణుతురు గ్రామానికి చెందిన మాధవరెడ్డి(40)అనే వ్యక్తి శుక్రవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు. మాధవరెడ్డి కొన్నేళ్లుగా ధర్మవరం రైల్వే స్టేషన్ క్యాంటీన్‌లో వడలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంటిలోనే ఆయన మృతి చెందాడు. అయితే అనారోగ్యంతో మృతి చెందాడా? లేక ఆత్మహత్యా? అనే అనుమానాలు పలువురి నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై రూరల్ పోలీసులను వివరణ కోరగా, విచారిస్తున్నామని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఆయనకు భార్య లత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి

ధర్మవరంఅర్బన్: పేదలకు సహాయం చేయడంలోనే సంతృప్తిని ఇస్తుందని కృష్ణ మహేశ్ ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు మేడాపురం వెంకటేశ్ తెలిపారు. స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో అంజనేయస్వామి గుడి వద్ద ఉన్న ఓ వృద్ధురాలు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు ఆయనకు తెలియజేయగా వెంటనే స్పందించి వృద్ధురాలి శస్త్రచికిత్సల ఖర్చుల కోసం రూ.5వేలు సాయం చేశారు.

ముదిగుబ్బలో దోమలపై దండయాత్ర

ముదిగుబ్బ: దోమలపై దండయాత్ర కార్యక్రమంలో భాగంగా ముదిగుబ్బ పెట్రోల్‌బంకు, సామిల్ వెనుక కాలనీలో శనివారం వైద్యసిబ్బంది పర్యటించింది. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించారు. డాక్టర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ వేణుగోపాల్, సూపర్‌వైజర్లు జగదీశ్, చిన్నబాల, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా : ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన లారీ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని కదిరి వైపు జాతీయ రహదారిపై నాలుగు మోరీల వద్ద శనివారం ఓ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. చెన్నై- హాస్పేట్‌కు టెంకాయలతో వెళ్తున్న లారీ, ముదిగుబ్బ సమీపంలోని నాలుగుమోరీల వద్దకు రాగానే బ్రిడ్జికి ఉన్న రక్షణ గోడను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ అబ్దుల్లా తీవ్రంగా గాయపడగా, క్లీనర్ వినోద్ స్వల్పంగా గాయపడ్డాడు. బ్రిడ్జి రక్షణ గోడ దృఢంగా ఉండటంతో ప్రమాదస్థాయి తగ్గింది. గాయపడ్డ వారిని 108 అంబులెన్స్‌లో బత్తలపల్లి ఆర్డీటీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రావులచెరువులో అదనపు కలెక్టర్ పర్యటన

ధర్మవరంరూరల్: మండల పరిధిలోని రావులచెరువు, ఏలుకుంట్ల,నేలకోట, దర్శినమల గ్రామాలలో రెండవరోజు శనివారం కూడా అదనపు కలెక్టర్‌వెంకటేశ్వర్లు ఈ క్రాప్ బుకింగ్ పనివిధానంపై తనిఖీచేపట్టారు.ఈ సందర్భంగా ఈ క్రాప్ బుకింగ్ బుకింగ్ నమోదుపై అవకతవకలకు తావు ఇవ్వకుండా పారదర్శకతతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరంతహసీల్దార్, వీఆర్వో, ఆర్ఐలకు సమీక్షా సమావేశం నిర్వహించారు.రైతులకు న్యాయం చేసే విధంగా అధికారులు పనిచేయాలని, ఈ క్రాప్‌బుకింగ్ నమోదు ప్రగతి వివరాలను డివిజన్‌లోని మండలాల వారిగా అడిగితెలుసుకున్నారు. ఎటువంటి ఫిర్యాదులందినా కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఏఓశ్రావణ్‌కుమార్, ఏడీఏ విశ్వనాథ్, సర్వేయర్ కోటేశ్వరరావు, ఆర్ఐ, వీఆర్వోలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

జిల్లాకు రూ.100 కోట్ల ప్యాకేజీ కేటాయించాలి : సీపీఎం

ధర్మవరంఅర్బన్: కరువు జిల్లా అయిన అనంతకు రూ.100కోట్లు నిధులు కేటాయించాలనిసీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు పోలా రామాంజినేయులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం పార్టీకార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయనతోపాటు సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, పట్టణ కార్యదర్శి పోలా లక్ష్మీనారాయణ, రైతుసంఘండివిజన్ ప్రధానకార్యదర్శి జంగాలపల్లి పెద్దన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలా రామాంజినేయులు మాట్లాడుతూ జిల్లాలో కరువు సహాయకచర్యలు చేపట్టాలని, కరువు పించన్‌ను ఇవ్వాలని, చేనేతను జీఎస్టీనుండి తొలగించాలని, చేనేతకు ప్రత్యేకపాలసీ ప్రకటించాలని తదితర సమస్యలపై ఆదివారం నుంచి సీపీఎం సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ హాజరవుతారన్నారు. మూడేళ్ల బీజేపీ పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, హంద్రీనీవా 2వ దశ పూర్తికి అవసరమైన నిధులు ఇవ్వాలని,తుంగభద్ర ఆధునీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. రైతులరుణాలన్నీ మాఫీచేయాలని, ఇన్‌పుట్ సబ్సిడీ అమలులోని అక్రమాలను అరికట్టాలని, బీమా డబ్బులను రైతుల ఖాతాల్లోకి జమచేయాలని తదితర సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు.

జీడీఎస్‌లంటే అంత నిర్లక్ష్యమా



సమ్మె చేస్తున్న గ్రామీణతపాల ఉద్యోగులు

ధర్మవరంఅర్బన్: గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ ఆధ్వర్యంలో తపాల ఉద్యోగులు గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏఐజీడీఎస్‌యూ సూచించిన సవరణలతో సహా జీడీఎస్ కమిటి రిపోర్టును త్వరగా అమలుచేయాలని, జీడీఎస్‌లకు 8గంటల పనికల్పించి రెగ్యులరైజ్ చేయాలని,ఢిల్లీ క్యాట్ ప్రిన్సిపల్ బెంచ్, మద్రాస్‌క్యాట్‌బెంచి తీర్పుల ప్రకారం జీడీఎస్‌లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. టార్గెట్ల పేరుతో జీడీఎస్‌లను బలవంతం చేయడం,వేధించడం ఆపివేయాలని తదితరసమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు.7వ వేతన సవరణ చట్టం ప్రకారం వేతనాలు అందిస్తూ 2004కు ముందు విధుల్లోకి చేరిన పోస్టల్‌ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పించన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షుడు బాల ఓబుళపతి, కార్యదర్శి శ్రీరామనాయక్ ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, ఫయాజ్‌బాషా, అమర్‌నాథ్‌రెడ్డి, పరందామరెడ్డి, మణికంఠ, సుబ్బాచారీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని వినతి

ధర్మవరంఅర్బన్: పట్టణసమీపంలోని ఎల్పీలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆ కాలనీ వాసులు మున్సిపల్ చైర్మన్ బీరేగోపాల్‌కృష్ణకు విన్నవించారు. ఆ కాలనీకి చెందిన టీడీపీనాయకులు వీరన్న, చాకలి నరసింహులతో పాటు పలువురు స్థానికులు శనివారం చైర్మన్‌ను కలిశారు. పాఠశాలలో బోరు ఉన్న మోటారు మరమత్తుకు గురికావడంతో తాగునీటి సమస్య నెలకొందని, అదే విధంగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. పుస్తకాలు ఇంతవరకు విద్యార్థులకు ఇవ్వలేదని తదితరసమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చారు. స్పందించిన చైర్మన్ సిబ్బందిని పిలిపించి పుస్తకాలను పాఠశాలకు సరఫరా చేయించారు. అదే విధంగా తాగునీటి సమస్యకోసం ఏఈ వాణిని పిలిపించి రెండు రోజుల్లో విద్యార్థులకు తాగునీటి సమస్యలేకుండా చూడాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుకు డీఈఓ, ఎంఈఓలకు లేటర్‌పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

బత్తలపల్లిలో 90 శాతం ఎంఆర్ వ్యాక్సినేషన్ పూర్తి

ధర్మవరం: బత్తలపల్లి మండలంలో 90 శాతం మందికి మీజుల్స్, రుబెల్లా నివారణ ఎంఆర్ టీకాను వేయడం జరిగిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ యుగంధర్ పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లి పీహెచ్‌సీ, అంగన్‌వాడి సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ బత్తలపల్లి మండలంలో ఎంఆర్ వ్యాక్సిన్ కోసం 7,170 మంది పిల్లల్ని గుర్తించామని, ఇందులో 6,444 మందికి ఎంఆర్ టీకాలు వేయడం జరిగిందన్నారు. మిగిలిన పదిశాతం మంది పిల్లలకు టీకాలు వేయాలని ప్రయత్నించినా వారు ఇతర ప్రాంతాలకు వెళ్లినందున సాధ్యం కాలేదన్నారు. అటువంటి వారి కోసం సెప్టెంబర్ 1 నుంచి 2వ తేదీ వరకు ప్రత్యేక సెంటర్ల ద్వారా టీకాలు వేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

9నెలల్లోపు ఉన్న చిన్నారులకు ప్రతి బుధవారం ఆరోగ్య ఉపకేంద్రాల్లో, అదేవిధంగా ప్రతి శనివారం గ్రామాల్లో వేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

స్వచ్ఛ ధర్మవరంగా తీర్చిదిద్దుదాం

ధర్మవరంఅర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛధర్మవరంగా తీర్చుదిద్దాలని గుంతకల్లు రైల్వేడివిజన్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎల్లీఫా,మున్సిపల్ కమీషనర్ గుర్రంరవిలు పేర్కొన్నారు. ఈసందర్భంగా శనివారం గుంతకల్లు డివిజన్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎల్లీఫా ఆధ్వర్యంలో స్వచ్ఛరైలు-స్వచ్ఛభారత్, ప్రతిరోజు పరిశుభ్రతకు భరోసా అనే కార్యక్రమాన్ని చేపట్టారు.అనంతరం వారితోపాటు స్టేషన్ మేనేజర్ అంజనేయులు, హెల్త్‌ఇన్‌స్పెక్టర్, ప్రాజెక్టు ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌విజయకుమార్, రైల్వే హెల్త్‌ఇన్‌స్పెక్టర్ మోహన్‌కుమార్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మధుసూదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణశర్మ, బాబ్జాన్ తదితర అధికారులు రైల్వేస్టేషన్‌లో చీపుర్లు పట్టి చెత్తాచెదారాన్ని ఊడ్చారు.

బొలికొండ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు

గుత్తిరూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన తొండపాడు రంగనాథ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం నాల్గవ శనివారం సందర్భంగా స్వామివారికి వేకువజామున పంచామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్రరావు, ఆలయ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, ఆలయ అర్చకులు రామాంజినేయులు పాల్గొన్నారు.



23, 24 తేదీల్లో రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

గుంతకల్లు: వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 23, 24 తేదీల్లో బ్యాంకర్లు ఇంటర్వ్యూ నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనరు సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగానూ మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలియజేశారు. 23వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర వరకూ బీసీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు, 24న మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుచేసుకున్న ముస్లిం, క్రిస్టియన్, తదితర మైనార్టీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు తాము ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటి రసీదు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు రావాలని సూచించారు.

సెలవు దినాల్లో తరగతులు వద్దు

డీఎస్పీకి ఎస్ఎఫ్ఐ వినతి

గుంతకల్లురూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తరగతులు నిర్వహించడంపై డీఎస్పీ శ్రీధర్‌రావుకు ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రమేశ్, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ గుంతకల్లులో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ఇష్టానుసారంగా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. వీటికి క్రీడా మైదానాలు కూడా లేవన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాబా ఫకృద్దీన్, మహేశ్‌బాబు పాల్గొన్నారు.

నేడు హ్యాపీ సండే

గుంతకల్లురూరల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం హ్యాపీసండే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఈశ్వరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పాత గుత్తి రోడ్డులోని సరోజినీ నాయుడు బాలికల ఉన్నత పాఠశాల వద్ద నుంచి చైతన్య థియేటర్ వరకు వాహనాల రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. పాదచారులు, సైకిళ్లకు అనుమతి ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

జింక్ సల్ఫేట్ పంపిణీ

కూడేరు: జింక్‌లోపంతో పైరు తెల్లబడి దెబ్బతింటుందని జింక్ సల్ఫేట్ భూమిలో వేయడం వల్ల పైరు కళకళలాడుతుందని ఏఓ నాగేంద్ర తెలిపారు. ఇందుకు ప్రభుత్వం రైతులకు జింక్ సల్ఫేట్ ఉచితంగా పంపిణీ చేస్తోందని మండలానికి 11 టన్నులు వచ్చిందన్నారు. ఒక్కొక్క రైతుకు 20 కేజీలు అందిస్తామని చెప్పారు. శనివారం నుండి పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు.

అర్హులందరికీ రుణాలు ఇస్తాం

- ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీనివాసరావు

గుత్తి: ప్రభుత్వపరంగా మంజూరైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో అర్హులైన వారందరికీ రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత, సొసైటీ గౌరవ అధ్యక్షుడు వీకే సుధీర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తులశమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసిన లబ్ధిదారులకు బ్యాంకు నిబంధనల మేరకు రుణాలను అందజేస్తామన్నారు. అనంతరం చైర్‌పర్సన్ తులశమ్మ మాట్లాడుతూ ప్రజా సేవ కోసం సొసైటీ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. వీకే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృత



మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీనివాసరావు

పరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ రాయలసీమ అధ్యక్షుడు చిన్న వెంకటేశ్, సొసైటీ అధ్యక్షుడు హెచ్ ఎస్ బాషా, కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి ఇషాక్, ఉపాధ్యక్షుడు సుధాకర్, ఫిరోజ్ నాయక్, నిజాముద్దీన్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్రార్ అలీ, మహబుబ్ బాషా పాల్గొన్నారు.

తపాల ఉద్యోగుల సమ్మెకు సీపీఐ మద్దతు



జీడీఎస్‌లకు మద్దతు తెలుపుతున్న సీపీఐ నాయకులు

గుత్తి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామీణ తపాల ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు సీపీఐ నాయకులు శనివారం మద్దతు పలికారు. ఆల్‌ఇండియా డాక్ సేవక్ యూనియన్ సమ్మెలో భాగంగా స్థానిక ప్రధాన తపాల కార్యాలయం ఎదుట జీడీఎస్‌లు సమ్మె చేపట్టారు. ఏఐజీడీఎస్ సూచించిన సవరణలతో సహా జీడీఎస్ కమిటీ రిపోర్టును త్వరగా అమలు పరచాలని, జీడీఎస్‌లకు 8 గంటలు పని కల్పించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ క్యాట్ ప్రిన్సిపల్ బెంచీ, మద్రాస్ క్యాట్ బెంచీ ఉత్తర్వులను ప్రకారం జీడీఎస్‌లకు పెన్షన్ మంజూరు చేయాలన్న డిమాండ్లతో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు రాము, మాబు,షేకు, తదితరులు మద్దతు పలికారు. కార్యక్రమంలో జీడీఎస్ బ్రాంచీ కార్యదర్శి అన్వర్, నాయకులు బాలయ్య, వీరన్న, అబ్దుల్ కలాం, ఆంజనేయులు, జయరామి రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూడ్చని బోరు బావులుంటే ఫోన్ చేయండి

మున్సిపల్ ఇంజనీరు ఈశ్వరయ్య

గుంతకల్లు: నీరు పడకపోవడంతో వదిలేసిన బోరు బావులు ఉంటే వెంటనే తనకు సమాచారమివ్వాలని మున్సిపల్ ఇంజనీరు ఎన్ ఈశ్వరయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో బోరు రంధ్రాలను నిర్లక్ష్యం గా ఎవరైనా వదిలేసి ఉంటే వెంటనే తన సెల్ నెంబరు 989907415కు సమాచారమివ్వాలని ఆయన తెలియజేశారు.

కొళాయి నీరు తాగడానికి మాత్రమే వాడండి

మున్సిపాలిటీ కొళాయిల ద్వారా విడుదల చేస్తున్న నీటిని తాగడానికి మాత్రమే వాడాలని మున్సిపల్ ఇంజనీరు ఎన్ ఈశ్వరయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్చెల్సీ నీరు విడుదల కాకపోవడంతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులలోకి నీటి పంపింగ్ చేయడానికి మరిన్ని రోజుల సమయం పట్టనుందని తెలియజేశారు. కనుక ఐదురోజులకోసారి నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులలో నీటి నిల్వలు తగ్గిపోయినందున కొళాయి నీటిని వేడి చేసుకుని తాగాలని సూచించారు. కొళాయి నీటిని తాగడానికి వినియోగించుకుని, ఇతర అవసరాలకు స్పాట్ డెలివరీ ట్యాంకుల నీటిని వాడుకోవాలని తెలిపారు. నీటి ఎద్దడి నివారణకు ట్యాంకుల ద్వారా కూడా సరఫరా చేస్తామన్నారు. ఇందుకుగానూ సొంత బోర్లు ఉన్నవారు, 20 వేల లీటర్లు, 12 వేల లీటర్ల లోడింగ్ సామర్థ్యమున్న ఆయిల్ ట్రక్కులు, ఐదువేల లీటర్ల వాటర్ ట్యాంకులు ఉన్నవారు తన సెల్ నెం. 989907415కు సంప్రదించాలని మున్సిపల్ ఇంజనీరు ఈశ్వరయ్య తెలిపారు.

అనవసర ఘర్షణలతో కేసుల్లో ఇరుక్కోవద్దు

- న్యాయమూర్తి హరినారాయణ

గుత్తిరూరల్: గ్రామాల్లో చిన్నపాటి విషయాలకు ఘర్షణపడి అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవద్దని సీనియర్ సివిల్ జడ్జి హరినారాయణ సూచించారు. శనివారం మండలంలోని తొండపాడు గ్రామంలో న్యాయ విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో మండల న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయమూర్తులు హరినారాయణ, మంజులత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న, చిన్న విషయాలకు పట్టింపులకు పోవడంతో కక్షలకు దారితీస్తున్నాయన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి


మునివేలు, ఆర్ఐ రాము, న్యాయవాదులు మహమ్మద్ రసూల్, గంగాధర్ కుమార్, షఫీవుల్లా పాల్గొన్నారు.

లోకల్ గైడ్

ఎమ్మెల్యే డైరీ

గుంతకల్లు: స్థానిక ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ ఎన్నికల ప్రచారం కోసం నంద్యాలకు వెళ్లారు. ఆదివారం ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండరు.

కూరగాయల ధరలు



కిలో.. టమోట రూ. 40, మిరప రూ. 40, బీరకాయ రూ. 30, ఉర్లగడ్డ రూ. 20, వంకాయ రూ. 30, బెండకాయ రూ. 20, క్యారెట్ రూ. 60, ఉల్లిగడ్డ రూ. 40

సినిమా గైడ్

గుంతకల్లు

వాసవి : జయ జానకి నాయిక
చైతన్య : లై
కేపీఎస్: నేనే రాజు నేనే మంత్రి

గుత్తి

అమృత్: నేనే రాజు నేనే మంత్రి
కేపీఎస్ : జయ జానకి నాయిక

పామిడి

మంజు: నేనే రాజు నేనే మంత్రి
హనుమాన్ : జయ జానకి నాయిక

దోమలపై దండయాత్ర ర్యాలీ



ఊటకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుత్తిరూరల్: మండలంలోని ఊటకల్లు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం దోమలపై దండయాత్ర ర్యాలీని నిర్వహించారు. దోమ తెరలు వాడండి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సాయంత్రం వేప పొగను వేసుకోవాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కుళ్లాయిబాబు, సంతోష్‌కుమార్, నాగరాజు, దేవి, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

గుంతకల్లురూరల్: మండలంలోని నెలగొండ గ్రామానికి చెందిన సత్యప్రసాద్ అనే విద్యార్థికి శ్రీహనుమాన్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు శనివారం ఆర్థికసాయాన్ని చేశారు. గ్రామానికి చెందిన సుంకన్న, సంగీత దంపతుల కుమారుడు సత్యప్రసాద్ ఐదవ తరగతి చదువుతుండగా గుండెజబ్బుకు గురయ్యాడన్నారు. శస్త్ర చికిత్స నిమిత్తం సేవా సంస్థ ఆధ్వర్యం లో సేకరించిన రూ. 8 వేలను బాధిత విద్యార్థి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆ సేవా సంస్థ అధ్యక్షుడు పీ నా గరాజు, కోశాధికారి రమేష్, పూలనాగరాజు, రాజు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న కళాశాల, హాస్టల్ భవనాల పరిశీలన



తహసీల్దారుతో చర్చిస్తున్న వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ డీఎంకే బాషా

గుంతకల్లురూరల్: పట్టణంలో నిర్మాణంలో ఉన్న మైనార్టీ జూనియర్ కళాశాల, హాస్టళ్లను వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ డీఎంకే బాషా పరిశీలన చేశారు. అనంతరం ఆయన తహసీల్దారు హరిప్రసాద్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల కోసం తహసీల్దారు స్థలాన్ని కేటాయిస్తే కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో నిర్మాణాలు చేపడతాయన్నారు. దీంతో మైనార్టీల అభివృద్ధి వేగవంతం చేస్తామన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని కూల్చినవారిని అరెస్టు చేయాలి

- ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గోపా జగదీశ్

గుంతకల్లు: హిందూపురంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయాన్ని కూల్చినవారిని అరెస్టు చేయాలని ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గోపా జగదీశ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలకు భవిష్యత్తులో ఎవ్వరూ పాల్పడకుండా పోలీసులు కఠినంగా శిక్షించాలన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ముఖ్యమంత్రికి జిల్లా కమిటీ తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు జగదీశ్ తెలియజేశారు. హిందూపురంలోని ఆర్యవైశ్య మహాసభ నాయకులకు పోలీసులు తోడ్పాటునందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా శ్రావణమాస శనివార పూజలు

బెళుగుప్ప: మండలంలో శ్రావణమాస శనివార పూజలను ఘనంగా జరుపుకున్నారు. చివరి శనివారం కావడంతో భక్తులతో ఆంజనేయస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు నాగుల ప్రతిమలకు, పాముల పుట్టకు పాలు పోసి నాగుల పండుగను జరుపుకున్నారు. మండలంలోని బూదిగుమ్మ సంజీవరాయస్వామి, రమణేపల్లి ఆంజనేయస్వామి, బెళుగుప్ప తాండా వద్ద ఉన్న చిన్న కొండపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామిలకు శనివారం ప్ర త్యేక పూజలు చేశారు. బూదిగుమ్మ సంజీవరాయస్వామికి ఉదయం పంచామృతాభిషేకాలు, సాయంత్రం పల్లకిసేవ, రాత్రి భ జన కార్యక్రమాలతో శనివారపు పూజలు ముగిసాయి.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గుంతకల్లురూరల్: దోమలపై దండయాత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కదిరిపల్లిలో సీజనల్‌వ్యాధులపై గ్రామస్థులకు మండల ఆరోగ్య సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆరోగ్య సిబ్బంది పర్యటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం దోమల నివారణకు అబైటు అనే ద్రావణాన్ని మురుగుకాలువల్లో పిచికారి చేశారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మిదేవి, ఈఓఆర్డీ శ్రీకాంత్ చౌదరి, సూపర్‌వైజర్లు నాగమ్మ, సూర్యనారాయణ, వైద్య సిబ్బంది ఆంజనేయులు, జానకి, సూర్యనారాయణ, జాకీర్, రాజ్యలక్ష్మి, ప్రభావతి, అరుణ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

పామిడి: నిరుపేద విద్యార్థిని ఉన్నత చదువులకు వైసీపీ గుంతకల్లు నియోజకవర్గం సమన్వయకర్త వై వెంకట్రామిరెడ్డి శనివారం ఆర్థికసాయం అందజేశారు. పట్టణవాసి సూర్యనారాయణ కుమార్తె రాజేశ్వరి గుత్తి గేట్స్ కాలేజ్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోందన్నారు. పేద విద్యార్థిని విద్యాభివృద్ధికి తోడ్పాటునందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, హనిమిరెడ్డి, అన్వర్‌ఖాన్, నూర్, పాపులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు గ్రామ సమీపంలోని కొండ మీద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పురోహితులు ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుల మంత్రోచ్ఛారణల మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మదమంచి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు నాగభూషణం, రాగులపాడు గ్రామస్థులు ధనుంజయ, రాంభూపాల్ రెడ్డి, రమేశ్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

వడి వడిగా



హంద్రీనీవాలో 180 కి.మీ.ల వద్ద మట్టి పనులు జరుగుతున్న దృశ్యం

వేగంగా హంద్రీనీవా పనులు
నీళ్లు రాకపోవడంతో ఏకధాటిగా సాగుతున్న వైనం
కాంక్రీటు వర్కులకు ఏర్పాట్లు ముమ్మరం

గుంతకల్లు: హంద్రీనీవాలో నీటి సడి లేకపోవడంతో వైడెనింగ్ పనులు వడివడిగా సాగుతున్నాయి. జూన్ 5వ తేదీన అగ్రిమెంటు పూర్తయి కాలువను వెడల్పు చేసే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకూ నీరు విడుదల కాకపోవడంతో పనులు వేగం గా నిర్వహిస్తున్నారు. ఇప్పటిదాకా కేవలం మట్టి పనులకే పరిమితం కాగా త్వరలో సి మెంటు లైనింగ్ పనులను కూడా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెలాఖ రుకల్లా 75 శాతం మట్టి పనులు పూర్తి చేయడానికి పనులను వేగం చేయాలని కాం ట్రాక్టర్లకు ఆదేశాలిస్తున్నారు. యాభైరోజులు నిరాటంకంగా పనులను చేస్తే మట్టి పనులు, లైనింగ్ పనులు సంపూర్ణంగా పూర్తవుతాయని, ఇక కేవలం మట్టి కట్టల పని మాత్రమే మిగిలుతుందని హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు.

సిమెంటు లైనింగ్ పనులకు రంగం సిద్ధం

హంద్రీనీవాను వెడల్పు చేసే పనుల్లో భాగంగా జిల్లా పరిధిలోని మూడవ ప్యాకేజీలో మట్టి-రాయి తొలగింపుతోపాటు మట్టి కట్ట పనికిగానూ 1.62 కోట్ల ఘనపు మీటర్ల అర్త్ వర్కు, పర్మినెంటు స్ట్రక్చర్ల వద్ద 82 వేల ఘనపు మీటర్ల పరిమాణంలో సిమెంటు లైనింగ్ పనులు చేయాల్సి ఉంది. కాలువలో 82 కి.మీ.ల మేర వైడెనింగ్ పనులు జరగాల్సి ఉండగా, దాదాపు 62 కి.మీ.ల మేర మట్టిని తొలగించాల్సి ఉంది. ఈ పనుల్లో పాతిక కి.మీ.లలో పనులు వందశాతం పూర్తయ్యాయి. మరో 37 కి.మీ.ల మేర పనులు 60 శాతం జరిగాయి. సిమెంటు స్ట్రక్చర్ల వద్ద లైనింగ్ కార్యక్రమం 5 కి.మీల మేర జరగాల్సి ఉండగా, మరో 15 కి.మీ.ల మట్టికట్టలను నిర్మించాల్సి ఉంది. వర్షాభావం వెంటాడుతున్నా, అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా హంద్రీనీవాలో ఇన్‌లెట్ల ద్వారా కాల్వలోకి వచ్చిపడుతున్న నీటి కారణంగా పనులకు కాస్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డీవాటరింగ్ పనులు చేస్తూనే సమస్య లేని చోట్ల పనులను కొనసాగిస్తున్నారు. వీలైనంత త్వరగా సిమెంటు పనులు కూడా ప్రారంభించడానికి కాంట్రాక్టర్లు చర్యలు చేపట్టారు.

బ్యాచింగ్ ప్లాంట్ల వ్యవస్థాపన

హంద్రీనీవాలో సిమెంటు పనులను ఆరంభించడానికి అవసరమైన సిమెంటు కాంక్రీటును తయారుచేసే బ్యాచింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి కాంట్రాక్టు పొం దిన ఎంఈఐఎల్ కంపెనీ ఏర్పాట్లను చేప ట్టింది. ప్రధాన రహదారులకు దగ్గరగా హంద్రీనీవా కాలువ వద్ద కాంక్రీటును కలిపే యంత్రాలను బిగించడానికి చర్యలు తీసుకున్నారు. కాలువలో 158 కి.మీ.ల వద్ద గుంత కల్లు శివారులోని బళ్లారి రోడ్డుకు ఆనుకుని ఒకటి, 176 కి.మీల వద్ద రాగులపాడు పంప్ హౌస్‌కు సమీపంలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని మరొకటి, కెనాల్‌లో 200 కి.మీ.ల వద్ద ఉరవకొండకు దగ్గరలో హైవేకు ఆనుకుని కాలువకు సమీపంలో మూడవ ప్లాంటును వ్యవస్థాపించనున్నారు. హంద్రీనీవా ఇంజనీరింగ్ శాఖ గుంతకల్లు సర్కిల్ పరిధిలో వంతెనలు, వంక నీటిని దాటించే సూపర్ ప్యాసేజీలు కలుపుకుని 83 పర్మి నెంటు స్ట్రక్చర్స్ ఉన్నాయి. వీటి వద్ద కుడి ఎడమ వైపుల్లో వంద మీటర్ల చొప్పున రెండు వందల మీటర్ల మేర లైనింగ్ చేయాల్సి ఉంది. వీలయినంత త్వరలో బ్యాచింగ్ ప్లాంట్లను ఏర్పాటుచేసి కాంక్రీటు పనులను చేపట్టను న్నారు.

వారంలోపు కాంక్రీట్ పనులు ప్రారంభిస్తాం



మా పరిధిలో మూడు కాంక్రీట్ మిక్సింగ్‌కు అవసరమయ్యే బ్యాచింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడానికి లోకేషన్లను గుర్తించాం. అక్కడి నుంచి లైనింగ్ పనుల వద్దకు కాంక్రీ టును చేర్చి పనులను నిర్వహిస్తారు. కాంట్రాక్టర్లకు ఇచ్చిన సమయంలో ఆటంకాలు ఏర్పడకుంటే పనులు సకాలంలో తప్పక పూర్తిచేయిస్తాం. ఏకబిగిన చేస్తే 60 రోజుల్లో పనులన్నీ పూర్తవుతాయి.

- రాజశేఖర్‌బాబు, ఈఈ, హంద్రీనీవా ఇంజనీరింగ్ గుంతకల్లు సర్కిల్.

అదృశ్యమైన వృద్ధురాలి ఆచూకీ లభ్యం

బెళుగుప్ప : అదృశ్యమైన వృద్ధురాలి ఆచూకీ శనివారం దొరికింది. ముదిగుబ్బకు చెందిన 75ఏళ్ల అక్క మ్మ 15 రోజుల క్రితం అదృ శ్యమైంది. ఈమె బెళుగుప్ప గ్రామ శివార్లలోని వసతి గృ హం వద్ద ఒంటరిగా తిరుగుతుండగా, విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు.

బెళుగుప్ప పోలీసులు ముదిగుబ్బ పోలీసులకు ఈ విషయాన్ని తెలిపారు. ముదిగుబ్బ పోలీసులు అక్కమ్మ బంధువులను బెళుగుప్ప పోలీస్ స్టేషన్‌కు పంపారు. భర్త తులసినాయుడు, కుమారుడు రంగయ్య శనివారం బెళుగుప్పకు రాగా, అక్కమ్మను వారికి అప్పగించారు.



వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసు

ప్రజా సమస్యలపై సీపీఎం సదస్సు

వజ్రకరూరు: స్థానిక ఏటీఎం సర్కిల్ వద్ద ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం మండల కన్వీనర్ వీరుపాక్షి మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29వ తేదీన తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా మండలానికి సాగు, తాగునీరు ఇవ్వాలన్నారు. నిరుపేదలకు ఇంటిపట్టాలను మంజూరుచేసి ఉచితంగా గృహనిర్మా ణాలు చేపట్టాలన్నారు. నిరుద్యోగ భృతి కింద రూ. 3 వేలు ఇవ్వాలన్నారు. ప్రతి రైతుకు రూ. 5 వేలు ప్రతి నెలా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బెంజిమెన్, సురేష్, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలరామాంజినేయులు, రైతు సంఘం జిల్లా నాయకుడు డీ శ్రీనివాసులు, సీపీఎం నాయకులు నాగభూషణం పాల్గొన్నారు.

వైసీపీ సభలో కనిపించని జగన్ ఫొటో !

పామిడి: పట్టణంలోని ఓ ఫ్యాక్టరీలో వైసీపీ ఏర్పాటు చేసిన నవరత్నాలు సభలో ఫ్లెక్సీలో జగన్, వైఎస్ఆర్ ఫొటోలు కనిపించకుండా కింద పెట్టడంపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. గుంతకల్లు నియోజకవర్గం సమన్వయకర్త వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నవరత్నాలు సభ నిర్వహించారు. వక్తల ప్రసంగాలతో కార్యకర్తలు అసంతృప్తి చెందారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు, జిల్లా నాయకులు దిలీప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ నా రాయణరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యల్లయ్యయాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి, కౌన్సిలర్లు కృష్ణవేణి, రజిత, శ్యామలా పాల్గొన్నారు.

'మంత్రిని బర్తరఫ్ చేయాలి'

కూడేరు: మంత్రి ఆదినారాయణరెడ్డి దళితుల పట్ల అనుచిత వాఖ్యలు చేశాడని తక్షణం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కూడేరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, రమణ, ఎంఆర్‌పీఎస్ నాయకులు లక్ష్మన్న, శ్రీరాములు, పెన్నోబులం, జగన్నాథ్ తదితరులు ఈ మేరకు డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న గ్రామీణ తపాల ఉద్యోగుల సమ్మె

పామిడి : గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్)ల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. పట్టణంలోని తపాలా కార్యాలయం వద్ద చేపట్టిన ఈ సమ్మె శనివారం నాల్గవ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ ప్రెసిడెంట్ రాజ్ కుళ్లాయప్ప, ఆదినారాయణ, ఫకృద్దీన్, కరీంసాబ్, లక్ష్మినారాయణ, ఆనంద్, గంగన్న, సురేంద్ర, హనుమంతరెడ్డి, వెంకట్రామిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మౌనిక పాల్గొన్నారు.

ఉరవకొండ: సమస్యలు పరిష్కరించాల ని జీడీఎస్‌లు చేపట్టిన సమ్మె శనివారం నా ల్గవ రోజుకు చేరుకుంది. గ్రామ పంచాయతీలోని గాంధీ విగ్రహం వద్ద జీడీఎస్‌లు ని రసన తెలిపారు. గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నాయకుడు రవీంద్ర పాల్గొన్నారు.



ఉరవకొండలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జీడీఎస్‌లు

రోడ్డు ప్రమాదం - ముగ్గురికి గాయాలు

లేపాక్షి : మండల పరిధిలోని కంచిసముద్రం, లేపాక్షి మార్గమధ్యంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వీరు శనివారం మానెంపల్లిలో పని ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చిలమత్తూరు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు తలకు బలమైన గాయంకాగా ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆలయాలకు శ్రావణ మాస శోభ





హిందూపురం మున్సిపల్ కార్యాలయంలోని శ్రీనివాసుడు, లేపాక్షిలో ఆంజనేయస్వామి,చిలమత్తూరులో శ్రీలక్ష్మీనర్సింహస్వామి

పరిగి : శ్రావణమాసం ఆఖరి శనివారం పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ మాసమంటే మహిళలకు అత్యంత ఇష్టమైనమాసము. ఈ మాసంలో మహిళలు ప్రతిరోజూ దేవాలయాలకు వెళ్లి పూజలు, వ్రతాలు చేస్తారు. శ్రావణ మాసంలో సోమ, శుక్ర, శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. శ్రావణమాసం మొదటి, చివరి సోమ, శుక్ర, శనివారాల్లో దేవాలయాలు భక్తులతో కిటకి టలాడతాయి. ఈ చివరి శనివారం కావడంతో మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

హిందూపురం రూరల్ : శ్రావణమాసం ఆఖరి శనివారం కావడంతో వెంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో శనివారం ఉద యం నుంచే దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

లేపాక్షి : శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు హనుమంతుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదే తరుణంలో లేపాక్షి పాతూరు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమంతుని విగ్రహాలకు ఆకుపూజతో అలంకరించి పూజలు నిర్వహించారు. సర్పంచ్ జయప్ప, భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ చివరన ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు జ్యోతులు ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజ లు నిర్వహించి భక్తాదులకు అన్నదానం ఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : శ్రావణ మాసం చివరి శనివారం పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం దేమకేతేపల్లి అభయాంజనేయస్వామి ఆలయం, చిలమత్తూరు ఊరివాకిలి ఆంజనేయస్వామి ఆలయం, కొడికొండ చెక్‌పోస్టు మధురేపల్లి బైలాంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం అభిషేకార్చనలు, ఆకుపూజ, విశేషాలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అన్నదానం చేశారు.

హిందూపురం అర్బన్: శ్రావణమాసం పుస్కరించుకుని ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం ఆఖరి శనివారం కావడంతో వేంకటేశ్వర, శనీశ్వర, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. మూలవిరాట్‌లకు వివిధ అభిషేకాలు, అర్చనలు. ప్రత్యేక పూజలు చేశారు. దేవతా మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. లక్ష్మీపురం బాలాజీ ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించ భక్తులకు లడ్డూ ప్రసాదం పంచారు. బాలాజీ నగర్‌లోని శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌లను నగలు, పూలతో చూడముచ్చటగా అలంకరించారు. అదే విధంగా పేట వేంకటేశ్వర ఆలయం, సూగూరు ఆంజనేయస్వామి ఆలయం, శ్రీకంఠపురం ఆంజనేయస్వామి ఆలయం, టీచర్ కాలనీ శనీశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

హిందూపురం టౌన్ : తక్కువ ఖర్చుతో సామాన్యులకు సైతం క్షేమయోగ సమాచారం అందించే తపాలా సేవలు గ్రామీణ ప్రాంతాల్లో నాలుగు రోజులుగా ఆగిపోయాయి. గ్రామీణ డాక్‌సేవక్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిరవదిక సమ్మెబాట పట్టారు. ఈ కారణంగా జిల్లాలో 80 శాతం తపాలా సేవలు నిలిచిపోయాయి.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

హిందూపురం రూరల్: మండలంలోని కిరికెర పంచాయతీలో కె.బసవనపల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లుగా తమ సేవలందించి సాధారణ బదిలీలో భాగంగా ఇతర పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులను హెచ్ఎం నాగమణి ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ హెచ్ఎన్ రాము విచ్చేశారు. కార్యక్రమంలో బదిలీ ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, శ్రీనాథ్, అనురాధ, శ్రీలక్ష్మీ, మాధవరెడ్డి, నర్సింహమూర్తి, లక్ష్మీనర్సప్ప, రమేష్, రమణ, సురేష్, మోహన్‌రెడ్డి, రాఘవాచారి, హెచ్ఎంగా పదోన్నతిపై వెళ్లిన రవీంద్రారెడ్డి, లక్ష్మణ్‌మూర్తి, ప్రసాద్, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

తెల్ల కార్డున్నవారికే ఎన్టీఆర్ వైద్యం

చిలమత్తూరు : తెల్లరేషన్ కార్డున్నవారికి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని టీమ్ లీడర్ శివకుమార్ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్టీర్ వైద్యసేవ పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. గులాబిరంగు రేషన్‌కార్డు కలిగిన సంపన్న వర్గాలవారు మీ సేవాకేంద్రాల్లో 1200 చెల్లించి ఆరోగ్యరక్ష కార్డు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య మిత్ర చంద్రశేఖర్, హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు శ్రీరాములు, చంద్రశేఖర్, రమణ, శ్రీలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. పరిరక్షించండి

హిందూపురం అర్బన్: మొక్కలు నాటి వాటిని మనం పరిరక్షిస్తే అవి మనలను కాపాడుతాయని ముద్దిరెడ్డిపల్లికి చెందిన స్వామిజీ అశ్వర్థనారాయణ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛపఖ్వార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా కళాశాలలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో మొక్కలు నాటించి వారు చదువు పూర్తి అయ్యే వరకు వాటిని రక్షించేలా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు, విద్యార్థులకు సూచించారు. 150 మంది విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అనీల్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎన్‌సీసీ అధికారి హేమంత్‌కుమార్, చరణ్, శ్రీనివాస నాయక్, ఎన్ఎస్ఎస్ అధికారి అమరేష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న స్వామీజీ తదితరులు

లోకల్ గైడ్

హిందూపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట రూ.40, ఉల్లి 40, మిరప 60, బీరకాయ 40, ఉర్లగడ్డ 20, వంకాయ 30, బెండకాయ 40, క్యారెట్ 60, బీన్స్ 60, కోసు 30, మునగ 60, ముల్లంగి 40, బటాణి 120, సీమవంకాయ 60, నెమలికోసు 60, దొండకాయ 40, బీట్‌రూట్ 40, క్యాబేజీ 20, తెల్లగడ్డలు 100, కాకరకాయ 60, సొరకాయ 30, గోరు చిక్కుడు 40, చిక్కుడు 40, క్యాప్సికమ్ 80, అల్లం : 80

పట్టుగూళ్ల ధరలు



కనిష్ఠం (సీబీ) రూ.286.00, (బైవోల్టీన్) 273.00, గరిష్ఠం(సీబీ)360.00, (బైవోల్టీన్) 451.00, సగటు (సీబీ) 349.00, (బైవోల్టీన్) 378.00.

చింతపండు ధరలు

కర్పూలి 10 కిలోలు రూ.600-1575, ఫ్లవర్ రకం రూ.350-850, బోటురకం రూ.200-250

హిందూపురంలో సినిమాలు

శ్రీనివాస - నక్షత్రం -2, **విష్ణు -** ఫిదా,
గురునాథ్- జయ జానకి నాయక, **అమృత్** - దండుపాళ్యం,
లక్ష్మి - లై, **బాలాజీ** - గౌతమ్ నంద

తూతూ మంత్రంగా శాంతి సమావేశం

హిందూపురం టౌన్ : వినాయకచవితిని పురస్కరించుకుని పట్టణంలో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం 31న నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ విశ్వనాథ్ తెలిపారు. శనివారం త హసిల్దార్ కార్యాలయం ఆవరణంలో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మునిసిపల్ వైస్‌ఛైర్మన్ జేపీకే రాము, మైనా ర్టీ నాయకులు ఆర్ఎంఎస్ షఫీ, డీటీ మైనుద్దీన్, బీజేపీ నాయకులు శివకుమార్, వరప్రసాద్, ఆదర్ష్‌కుమార్, ఫైర్ ఆఫీసర్ అశ్వర్థలు హాజరైనారు.

తూతూ మంత్రంగా: ప్రతి ఏడాది వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసే విగ్రహాల కమిటీ నిర్వాహకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మతపెద్దలు, అన్ని శాఖల అధికారులు హాజరై సమావేశం నిర్వహిస్తారు. కానీ శనివారం జరిగిన శాంతి సంఘం సమావేశానికి ముఖ్యమైన రాజకీయపార్టీల నాయకులతో పాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకాలేదు.

దహన సంస్కారాలకు సర్పంచ్ సాయం

హిందూపురం రూరల్ : కిరికెర పంచాయతీలో కె.బసవనపల్లి, ఇందిరమ్మకాలనీకి చెందిన నిరుపేద వినయ్‌కుమార్(28)అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. గ్రామ సర్పంచ్ హెచ్ఎన్ రాము తన సొంత ఖర్చులతో దహనసంస్కారాలను జరిపించారు. మృతుడికి తండ్రి, భార్య, కుమార్తె ఉన్నారు. గ్రామస్థులు వైసీపీ రాజశేఖర్ తదితరులు ఇందులో పాల్గొన్నారు.

దోమలపై దండయాత్ర

లేపాక్షి : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా నాలుగో శనివారం దోమలపై దండయాత్ర ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. మండల పరిధిలోని పీ.కొత్తపల్లి గ్రామంలో శనివారం హెల్త్ సిబ్బంది మల్లప్ప ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగనవాడీ సిబ్బంది, ఆశవర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిగి : సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం దోమలపై దండయాత్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ఆదిశేషు, సూపర్‌వైజర్లు వాసుదేవ మధ్యస్థ, కిష్టప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి

హిందూపురం అర్బన్ : ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థానం చేరుకుంటారని బిట్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమోహన్ అన్నారు. శనివారం బిట్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణా, నైతిక విలువలతో కూడిని విద్యనభ్యసించి జీవితంలో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో జెనెటిక్ యూ ఇంజనీరింగ్ కళాశాల ప్రహల్లాదరావు, ప్రిన్సిపల్ రమేష్, ప్రొఫెసర్ ముకుందరావు, డిప్లొమో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

22న పారిశుధ్య కార్మికుల చలో విజయవాడ

హిందూపురం అర్బన్ : మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికులు ఈ నెల 22న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆ సంఘ నాయకులు ఓ ప్రకటణలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 279 జీఓను తీసుకొచ్చి మున్సిపల్ కార్మికులను వీధిపాలు చేశారని ఆవేదన చెందారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు ఏకతాటిపైకి వచ్చి సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల పొట్టకొట్టే జీఓ నెంబర్ 279ను వెంటనే రద్దు చేయాలని, మున్సిపల్ సేవలు ప్రైవేటీకరణ ఆపాలని, కార్పొరేషన్ మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ప్రభుత్వ నిధులు ఇవ్వాలని, కార్మికుల సంఖ్య పెంచాలని, కాంట్రాక్ట ఔట్ సోర్సింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పురంపై కొరవడిన పోలీస్ నిఘా

హిందూపురం: తెలుగు రాష్ట్రాల్లో అత్యంత సమస్యాత్మక ప్రాంతం హిందూపురం. ఆపై రాష్ట్రంలోనే సెలబ్రెటీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం. ప్రతి చిన్న విషయానికి ఉద్రిక్తతగా మారి నాలుగో సింహాన్ని పరుగులు పెడుతుండగా, పట్టణ ప్రజలకు కంటిమీద నిద్రలేకుండా చేస్తోంది. హిందూపురంపై పోలీసులు నిఘా కొరవడం ఫలితంగానే అసాంఘిక శక్తుల ప్రేరేపణతో ఉద్రిక్తత పాటు పేకాట, మట్కా, చోరీలు, నకిలీనోట్లు చెలామణి, పరస్పర దాడులు పెరిగిపోతున్నాయనే వాదన వినిపిస్తోంది. ఇందుకు ఇటీవల పట్టణంలో చోటుచేసుకున్న సంఘటనలతోపాటు నెల కిందట ఓ ప్రార్థన మందిరంపై దాడి... మొన్న నకిలీ నోట్ల చెలామణి ముఠా ను పట్టుకుని రూ. 27.34 లక్షలు పట్టివేత... తాగా వాసవీ భజనమందిరం అర్ధరాత్రి కూల్చివేత... ఇందుకు నిదర్శనంగా చెప్పవ చ్చు. ఏటా వేలాది మంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వేలాది మంది హిందూపురంలో స్థిరపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అసాంఘిక కార్యక్రమాలు పెరుగుతున్నాయి. కొన్నేళ్లుగా ప్రశాంతంగా ఉన్న పురంలో ఏడాది కిందట నుంచి ప్రతి చిన్న విషయానికి ఉద్రిక్తలకు దారితీస్తుంది. ఇందులో భాగంగానే యేడాది కిందట రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సందర్భంలో కొందరు మందలింపును అసాంఘిక శక్తులు ప్రేరపణతో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. జూలైలో రెండు వారాల కిందట ఓ ప్రార్థన మందిరంపై మద్యం సీసాలతో దాడులు చేశారనే విషయంపై ఉద్రిక్తతకు దారితీసి కొన్నాళ్ల పాటు పోలీసులు పహారా



కాయాల్సి వచ్చింది. అదేవిధంగా త్యాగరాజనగర్‌లో గత సంవత్సరం విగ్రహం ధ్వంసం విషయంలో ఉద్రిక్తత చెలరేగింది. వీటి వెనుకాల కొందరు అసాంఘిక శక్తులు నడిపిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి అయినా ఏమి చేయలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఏదైనా సంఘటన జరిందంటే జిల్లా పోలీసు యంత్రాంగం హిందూపురంలో వాలిపోతున్నారు. ఉద్రిక్తతలకు ప్రోత్సాహిస్తున్న వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించలేదన్న ఆరోపణలున్నాయి. ఇటీవల క్రికెట్ బెటింగ్, మట్కా, పేకాట, జూదం అద్దూ అదుపు లేకుండా పోతోంది. ఇందులో కొందరు పోలీసు సిబ్బంది వెనుక ఉండి నడిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పురంలో చాలా చోట్లు భూమి వివాదాలు నడుస్తుండంగా కొందరు పోలీసులు వీటిలో తలదూర్చి పంచాయితీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల నకిలీ కరెన్సీ పెద్ద ఎత్తు పోలీసులకు పట్టుబడడంతోపాటు దొంగల సైర్వవిహారం చేస్తు ప్రజలను హడలెత్తించింది. ఇటీవల హిందూపురంలో జరుగుతున్న ఉద్రిక్తలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే రాత్రి పది గంటలు దాటిన తరువాత అత్యవసరమైతే తప్ప రోడ్డుపై తిరగరాదని పోలీసులు ఆక్షాలు పెట్టారు. ఇందులో భాగంగా ఇరువై రోజుల కిందట రాయలసీమ ఐజీ మహ్మద్ ఇక్బాల్, ఎస్పీ అశోక్‌కుమార్‌లు రోజంతా పర్యటించి విద్యార్థుల, శాంతి కమిటీతోపలు సమావేశాలు నిర్వహించి వెళ్లారు. అయినా పరిస్థితి మాత్రం పోలీసుల చేతుల్లో రాలేదు. తాజాగా భజన మందిరం కూల్చివేయడంతో కొన్ని వర్గాల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇటీవల జరుగుతున్న సంఘటనలు రానున్న రోజుల్లో జరిగే ప్రధాన పండుగలపై తీవ్ర ప్రభావం పడ్డే అవకాశం ఉంది. ప్రశాంతగా ఉన్న హిందూపురంలో వరుస సంఘటనలతో భవిష్యత్తులో ఏస్థాయికి చెరుతుందో అన్న భయందోళన వ్యక్తం అవుతోంది. గతంలో ఓ సినిమా విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగి రాష్ట్రంలో సంచలం రేగింది. ఇలాంటి పరిస్థితులు మళ్లీ వస్తాయన్న ఆందోళన స్థానికుల్లో వ్యక్తం అవుతోంది. ఇలా ఉంటే ఓ పోలీసు అధికారి కొద్ది రోజుల క్రితం మాట్లాడుతూ.. ‘ కొన్ని రోజుల పాటు మాపై రాజకీయ ఒత్తిడి లేకుండా చేస్తే హిందూపురాన్ని శుభ్రం చేసి అసాంఘిక శక్తులను అణిచి వేస్తాం’ అని చెప్పడాన్ని బట్టి చూస్తే పోలీసుల పరిస్థితి అర్థం అవుతుంది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖలో ఏ మేరకు ఒత్తిళ్లు ఆందోళన ఉందో చెప్పవచ్చు. ఇప్పటికైనా అన్నత స్థాయి అధికారులు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి ఉద్రిక్తతలకు ప్రేరేపిస్తున్న అసాంఘిక శక్తులను అణిచి వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విధులకు పంచాయతీ అధికారుల గైర్హాజర్

హిందూపురం రూరల్: మండల పరిధిలోని మణేసముద్రం గ్రామ పంచాయతీ వైపు అధికారులు రావడం లేదని గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. పంచాయతీ కార్యాలయం చాలా వరకు తాళం వేసే ఉంటుందని, ఏవైనా కార్యక్రమాలు ఉంటే తప్పా అధికారులు ఇటు వైపు రావడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తాళం వేసిఉన్న కార్యాలయం

నోటు పుస్తకాల వితరణ

హిందూపురం రూరల్: మండలంలోని మణేసముద్రం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన విశ్వరూపాచారి రూ.2వేలు విలువచేసే 150 నోటు పుస్తకాలను శనివారం వితరణ చేశారు. ఆయన పట్టణంలోనే ఆధ్యాత్మిక బుక్‌స్టాల్ నిర్వహిస్తున్నాడు. తన గురువు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌ను ఆదర్శంగా తీసుకుని పేద విద్యార్థులకు ఎంతో కొంత సాయమందించాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయమ్మ, ఉపాధ్యాయులు రాంప్రసాద్, రామాంజినేయులు, శ్రీనివాసులు, రాజేశ్వరీ, సాయి లీలా, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూరీబా పాఠశాలకు రూ.2 లక్షల విరాళం



నగదును అందజేస్తున్న ఎన్‌ఆర్ఐ మోహన్‌క్రిష్ణ

లేపాక్షి : హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు కస్తూరీబా పాఠశాల మేరకు ఎన్‌ఏపీఎస్ ఉత్తమ అమెరికా తెలుగు సంఘం అధ్యక్షులు మోహన్ క్రిష్ణ రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యే బాలకృష్ణకు వీరాభిమానినని, ఆయన ఆదేశాల మేరకే ఇక్కడకు రావడం జరిగిందని, నిరుపేద విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలకు తాను విరాళం అందజేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని, తాను అందజేసిన రూ.2లక్షలు విద్యార్థుల తాగునీటి కోసం, మౌళిక వసతులు, లైబ్రరీలో పుస్తకాల కోసం వినియోగించుకోవాలని ఎస్ఓకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీహనోక్, జెడ్పీటీసీ ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ జయప్ప, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీడే

హిందూపురంఅర్బన్: ప్రపంచ ఫొటో గ్రాఫీడేని పురస్కరించుకుని శనివారం హిందూపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి దుర్గానాని, గోపికృష్ణతోపాటు ఫొటోగ్రాఫర్స్ పాల్గొన్నారు.

ఆర్డీఓకు సన్మానం

చిలమత్తూరు : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డు పొందిన ఆర్డీఓ రామ్మూర్తిని స్థానిక మండల రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పెనుకొండ రెవెన్యూడివిజన్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ ఇబ్రహీంసాబ్ ఆర్డీకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రంగనాయకులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రామదండు పాదయాత్ర



హిందూపురం రూరల్: శ్రీక్షేత్రం కైవారం తాత రామదండు పాదయాత్ర శనివారం కొట్నూరు ఆంజనేయస్వామి దేవాలయం నుంచి బయలుదేరి కగ్గల్లు, కొండూరు మీదుగా కొనసాగి చలివెందుల ఆంజనేయ స్వామి దేవస్థానం నందు ముగించడం జరిగింది. ఉదయం వీరికి కగ్గల్లు గ్రామంలో సర్పంచ్ హనుమంతరాయుడు ఫలహారాలు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య ఆసుపత్రి ఛైర్మన్ ఎంఎస్ జయరాం పాల్గొని తన విలువైన సూచనలను భక్తులకు తెలియజేశారు. పాదయాత్రలో భగవతార్ బలకృష్ణ, జగదీశ్, రవిశంకర్, రామచంద్రప్ప, వివిధ ప్రాంతాల భజన బృందాలు పాల్గొన్నాయి.

ఎండిన బోర్లను పూడ్చివేయండి

చిలమత్తూరు : నీరు లేక ఎండిపోయి నిరుపయోగంగా ఉన్న బోరుబావులున్నట్లయితే సంబంధిత రైతులు వెంటనే వాటిని పూడ్చివేయాలని తహసీల్దార్ ఇబ్రహీంసాబ్, ఎంపీడీఓ శివానందనాయక్ తెలిపారు. చిలమత్తూరు చెరువులో నిరుపయోగంగా ఉన్న బోరు బావిని అధికారులు పూడ్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడైనా సరే బోరుబావులు తెరిచి ఉన్నట్లయితే ప్రజలు వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. వాటిని మూసివేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.




బోరును మూయిస్తున్న అధికారులు

నీరు పడని బోరు బావులు పూడ్చండి

తలుపుల : వివిధ గ్రామాల్లో నిరుపయోగంగా, ప్రమాదకరంగా ఉన్న బోరు బావులను వెంటనే పూడ్చాలని ఇన్‌చార్జ్ ఏపీఓ పీవీ మోహన్ తెలిపారు. బోరుబావుల పూడ్చివేతలో రైతులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు బోరుబావులు అవసరం అనుకుంటే బోరు బావి చుట్టూ రక్షణగోడ నిర్మించుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు నిరుపయోగంగా ఉన్న బోర్లను గుర్తించి, ఎంపీడీఓ, తహసీల్దార్, ఏపీఓలకు తెలియజేయాలన్నారు.

జనసంద్రమైన పాలపాటిదిన్నె





పాలపాటిదిన్నెలో భక్తుల రద్దీ, చెక్కభజన కార్యక్రమాలు తిలకిస్తున్న భక్తులు, తవళం ఆంజనేయస్వామి మూలవిరాట్టు విగ్రహం

నల్లచెరువు :కదిరి ప్రాంతంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం శ్రావణ మాసం చివరి శనివారం భక్త సంద్రమైంది. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామున ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్టుకు పుష్పాలతో, తులసి మాలలతో ప్రత్యేక అలంకరణ చేసి అర్చకులు ఆంజనేయదాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్తూరు, కడప, కర్ణాటకలోని బాగేపల్లి, చేళూరు, చిక్‌బళ్ళాపూర్, బెంగుళూరు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చిత్తూరు జిల్లా మొలకలచెరువుకు చెందిన జనార్ధన్‌రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ వారు జనార్ధన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం భజన బృందాలు ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పడుచూరి నాగేష్, రామనాథ్, నాసునరసింహులు, బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, వనంగంగిరెడ్డి, రామచంద్ర, రామాంజినేయులు, ఆది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చెక్కభజన పోటీలు

మండలంలో ప్రసిద్ధి గాంచిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం వద్ద నాల్గవ శ్రావణ శనివారం సందర్భంగా భజన బృందాలు చెక్కభజనలు నిర్వహించారు. ఈ భజన పోటీలలో ఎనుములవారిపల్లికి చెందిన రామక్రిష్ణ భజన బృందానికి మొదటి బహుమతిగా రూ. 7 వేలు పాలెం సుధాకర్ అందజేశారు. మొటుకుపల్లికి చెందిన చంద్రానాయక్ భజనబృందా నికి రెండవ బహుమతి రూ. 5 వేలు ఆలయ కమిటీ అధ్యక్షుడు పడుచూరి నాగేష్ అందజేశారు. సోమయాజులపల్లికి చెందిన మనోహర్ భజనబృందానికి మూడవ బహుమతి రూ. 3 వేలు బీసీ నాయకులు సంపంగి గోవర్ధన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కోణేరు గంగులప్ప, జేవీ రమణ, కుళ్ళాయప్ప, రమణ, సుశీలమ్మ, నరసింహులు, గంగాద్రి పాల్గొన్నారు.

తనకల్లులో.. మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని తవళం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తనకల్లు, పెద్దపల్లి, కొక్కంటి క్రాస్, టీ.సదుం, బిళ్ళూరువాండ్లపల్లి, కోటపల్లి, చీకటిమానిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పారేసు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో కూడా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తవళం ఆంజనేయస్వామి ఆలయంలో భజన బృందాలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో తవళం ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ రమణయ్య, దళిత నాయకులు శంకర్, గ్రామానికి చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

జాఫర్‌హుస్సేన్ అన్నదానం : తవళం ఆంజనేయస్వామి ఆలయంలో ఉస్తినిపల్లికి చెందిన జాఫర్ హుస్సేన్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మతసామరస్యానికి నిదర్శనంగా తవళం ఆంజనేయస్వామి ఆలయంలో జాఫర్‌హుస్సేన్ అన్నదానం నిర్వహించడంపై పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

కదిరిటౌన్‌లో.. కదిరి పట్టణంలోని శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయం, సైదాపురం ఆంజనేయస్వామి ఆలయం, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, గండిమడుగు ఆంజనేయస్వామి ఆలయాల్లో శావణమాసం నాల్గవ శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. మొదటగా శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో శ్రీదేవీ, భూదేవీ సమేతుడైన శ్రీవారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఆకు పూజలు ఘనంగా నిర్వహించారు. మారుతీనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, నాగలకట్ట వద్ద మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గండిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నంబులపూలకుంటలో..: స్థానిక శివాలయం, కొత్తరోడ్డు, ధనియానిచెరువు, పెడబల్లి , మేకలచెరువు, గౌకనపల్లి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ఘనంగా నాల్గవ శనివారం పూజలు నిర్వహించారు. ఆలయాలకు వచ్చిన భక్తులు అర్చకులు పూజలు, అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రావణ శనివారం పూజల విశిష్టతను భక్తులకు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాల్లో భజన బృందాలు రామభజన కార్యక్రమం నిర్వహించారు. క్రిష్ణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీరెడ్డినాయన ఆశ్రమంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గాండ్లపెంటలో.. మండలంలోని మునగలవారిపల్లి , రెక్కమాను, వేపరాల, కురుమావిడి, బొలిగుట్లపల్లి గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు నాల్గవ శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆంజనేయస్వామికి ఆకుపూజలు చేసి, కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయాల్లో ఆంజనేయస్వామి భజనలు చేశారు.

తలుపులలో.. మండలంలోని పులిగుండ్లపల్లిలో పురాతన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజారీ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం మహాగణపతి హోమం, ఋత్వీకరణ, కలశస్థాపన, నవగ్రహ పూజ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, పుష్పాలంకరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి, మహామంగళి హారతితో శ్రావణ శనివారం పూజలు నిర్వహించారు. అలాగే తలుపులలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తలుపుల పురవీధుల్లో ఆంజనేయస్వామి చిత్ర పటాన్ని భజన బృందాలు ఊరేగింపు నిర్వహించారు. అలాగే మండలంలోని బత్రేపల్లి, బండమీద కొత్తపల్లి, ఉబ్బరవాండ్లపల్లి, గరికపల్లె, ఓబుళరెడ్డి పల్లిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.





సైదాపురం ఆంజనేయస్వామి, ప్రత్యేక అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామి, తలుపుల మండలం పులిగుండ్లపల్లిలో ఆంజనేయస్వామి

జిప్సం ఇవ్వాలని రైతుల వినతి

నంబులపూలకుంట : వానలు కురుస్తున్నాయి.. త్వరితగతిన జిప్సం అందిస్తే వ్యవసాయ పంటలకు ఉపయోగపడతాయని మండల అధికారులకు రైతులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం అధికారులను రైతులు మధుసూదన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగరాజు, వెంకటేష్, రమణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని 13 పంచాయతీ పరిధిలోని మూడు పంచాయతీలు మరికొమ్మదిన్నె, పీకొత్తపల్లి, పెడబల్లి గ్రామాల రైతులకు ఇంకా జిప్సం కార్యాలయానికి రాలేదని, రెండు, మూడు రోజుల్లో ఆ గ్రామాలకు కూడా రానున్నట్లు అధికారులు తెలిపారు.

లోకల్ గైడ్
localguide

కదిరి మార్కెట్‌లో కూరగాయల ధరలు



వంకాయ కిలో రూ.20, టమోటా 40, బెండ 30, బీరకాయ 22, కాకరకాయ 45, క్యారెట్ 60, బీట్‌రూట్ 60, బీన్స్ 80, ముల్లంగి 40, పచ్చిమిర్చి 30, ఉర్లగడ్డ 22, కోసుగడ్డ 30, మునగ 50, కాప్సికమ్ 60, ఉల్లిపాయలు 30

కదిరి సినిమాలు

సంగం - లై, **రాధిక** - నేనే రాజు నేనే మంత్రి
,**వేమల** - ఆనందో బ్రహ్మ , **మౌనిక** - జయ జానకి నాయక

ఎమ్మెల్యే డైరీ

కదిరి : ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా ఆదివారం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండరు.

జీడీఎస్ ఉద్యోగుల అర్ధనగ్న ర్యాలీ



అర్ధనగ్నంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు : తమ సమస్యలను పరిష్కరించాలంటూ జీడీఎస్ ఉద్యోగులు తనకల్లులో అర్ధనగ్నంగా ర్యాలీ నిర్వహించారు. మొదట సబ్ పోస్టాఫీసు ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీడీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు బావన్న, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీరాములు, వీరాంజినేయులు, బయ్యారెడ్డి తదితరులు మాట్లాడారు. 8 గంటలు పని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, తపాలాశాఖలో జీడీఎస్‌లపై వివక్షను తొలగించాలని, జీడీఎస్ ఉగ్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీ పోస్టాఫీసు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. తహసీల్దార్ లక్ష్మీనాయక్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో చాంద్‌బాష, శంకర, గంగాద్రి, లక్ష్మీనారాయణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పోస్టల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

తనకల్లు : మండలంలోని వివిధ ప్రాంతాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే భక్తులు , కమిటీలు తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రిపూట వినాయక విగ్రహాల వద్ద కమిటీ సభ్యులే కాపలా ఉండాలన్నారు. మైక్‌సెట్ ఉపయోగించాలంటే తప్పని సరిగా డీఎస్‌పీ అనుమతి తీసుకోవాలని తెలిపారు. తప్పకుండా ఈ నెల 27 వ తేదీన విగ్రహాలను తరలించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి నిధులు

కదిరిటౌన్ : పట్టణంలో నూతన తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి రూ. 90 లక్షలు నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు అయినట్లు కదిరి తహసీల్దార్ పీవీ రమణ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో తొమ్మిది సెంట్లు స్థలాన్ని శనివారం అధికారులు పరిశీలించి, కొలతలు వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కాటం శంకర, పంచాయతీ రాజ్ జేఈ వెంకటరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బాబూరావు, సర్వేయర్ జీజేష్ ,వీఆర్‌ఓలు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, కౌన్సిలర్ మైనుద్దీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లపై సమీక్ష

తలుపుల : మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ భారత్ క్రింద మంజూరు అయిన 3,382 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు తదితర విషయాలపై శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కే పోలప్ప సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీటీ అధికారులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కే పోలప్ప మాట్లాడుతూ.. ఆర్డీటీ సంస్థ ఈదులకుంట్లపల్లి, పులిగుండ్లపల్లి, పొలతలవాండ్లపల్లి గ్రామ పంచాయతీల్లో ఆర్డీటీ సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరుగుదొడ్లు త్వరగా నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రమణప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ చందన, సర్పంచు పుష్పావతి, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ మానవహక్కుల సమాఖ్య రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా విజయభాస్కర్

కదిరి అర్బన్ : జాతీయ మానవ హక్కుల సమాఖ్య రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లు కదిరి పురపాలక సంఘంలో మెప్మా ప్రాజెక్టు అధికారి పెనుబోను విజయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆ సమాఖ్య జాతీయ అధ్యక్షులు డీజీఎం రెడ్డి నుంచి ఉత్తర్వులు అందుకున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ప్రధాన కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షుడికి, ఎంపికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

టెన్నీకాయిట్ పోటీలను ప్రారంభించిన కందికుంట

కదిరి అర్బన్ : 32వ అంతర్ జిల్లా టెన్నికాయిట్ పోటీలు శనివారం కదిరి పట్టణ సమీపంలోని కుటాగుళ్ల వద్ద ఉన్న బ్లూమూన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు ఆయన క్రీడాకారులను, నిర్వాహకులను పరిచయం చేసుకున్నారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 జిల్లాల క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ.. కదిరి ప్రాంతంలో ఇలాంటి పోటీలు నిర్వహించడానికి ప్రభుత్వం, అధికారులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. బ్లూమూన్ స్కూల్ చైర్‌పర్సన్ శివశంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలను తమ పాఠశాలలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ బాషా మొహిదీన్, ఏపీ టెన్నికాయిట్ సెక్రెటరీ పీ. ముస్తఫా అలీఖాన్, స్కూల్ హెడ్మాస్టర్ సురేంద్రరెడ్డి, పీఈటీలు చిన్నప్ప, రవూఫ్‌లతో పాటు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, నిర్వాహకులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కందికుంట, తదితరులు

రామాలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ రూ. లక్ష విరాళం

కదిరిరూరల్ : కదిరి రూరల్ మండలం కే.కుంట్లపల్లిలో రామాలయ నిర్మాణానికి కదిరి మాజీ ఎంపీపీ చక్రవర్ధన్‌రెడ్డి రూ. 1, 00, 116లను విరాళంగా శనివారం అందజేశారు. తన తండ్రి నాగిరెడ్డి జ్ఞాపకార్థం ఈ విరాళం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదే మొత్తాన్ని చక్రవర్ధన్‌రెడ్డి కుమారుడు నైతిక్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, గంగిరెడ్డి, కేశవరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, గంగులప్ప, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

పేద విద్యార్థులకు చేయూత

నల్లచెరువు : మండలంలోని దేవరెడ్డిపల్లిలో ఆదర్శ ఉన్నత పాఠశాల విద్యార్థుల క్రీడల పరికరాల కోసం శనివారం టీడీపీ నాయకులు పాలెం సుధాకర్ రూ. 25 వేలు ప్రిన్సిపాల్ శ్రీనివాసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని పేద విద్యార్థులకు భరోసా ఇచ్చారు. మండలంలోని విద్యార్థులు విద్యా, క్రీడలలో రాణించేందుకు అవసరమైన క్రీడా సామగ్రిని సమకూర్చుకునేందుకు ఈ నగదు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడా పరికరాల కోసం రూ. 25 వేలు అందించిన సుధాకర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రోగులకు బ్రెడ్లు, పండ్ల పంపిణీ

కదిరిఅర్బన్ : వరల్డ్ ఫోటో గ్రఫీ డే సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కదిరి ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఏటా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని, అందులో భాగంగానే రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశామని అసోషియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో స్టైల్ కింగ్ బాష, రాము, సోము, రాజు, పవన్, ప్రసాద్, రఫీక్, శంకర్, రమేష్, అలీబాష, అనీల్, మున్నా, నాగా, ఇర్ఫాన్, బాబ్‌జాన్, శీను పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానోత్సవం వాయిదా

కదిరిటౌన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంబేద్కర్ ప్రతిభా పురస్కార అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనాయక్ పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించాల్సి ఉందని, అయితే కొన్ని కారణాల వల్ల వాయిదా వేస్తున్నామని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థుల యొక్క అభిప్రాయం మేరకు ఈ అవార్డుల ప్రదానోత్సవం వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అందరితో చర్చించి పత్రికల ద్వారా తేదీని ప్రకటిస్తామన్నారు. విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

కదిరిలో ఓ మోస్తరు వర్షం



కదిరి వేమారెడ్డి సర్కిల్‌లో వర్షం

కదిరి : శనివారం కదిరి పట్టణంతో పాటు పరిసర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. కదిరితో పాటు నల్లచెరువు, గాండ్లపెంట, ఎన్‌పీకుంట, తనకల్లు, నల్లమాడ మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రానికి జల్లులు కురవడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. భారీ వర్షం కాకపోయినప్పటికీ ప్రస్తుతం సాగైన వేరుశనగ, కందితో పాటు రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలిస్తుందని రైతులు తెలిపారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి : సీపీఎం

కదిరిటౌన్ : జిల్లా కరువుతో అల్లాడుతుంటే ప్రభుత్వం మాత్రం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదని, వెంటనే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులు మంజూరు చేయాలని సీపీఎం రాయలసీమ కమిటీ కన్వీనర్ ఓబులు పేర్కొన్నారు. శనివారం కే ఆర్ రెసిడెన్సియల్ హాలులో కరువు పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఓబులు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనంతపురం జిల్లాలో ఉన్న అన్ని చెరువులకు, కుంటలకు నీరు నింపాలన్నారు. ఉపాధి కల్పించే పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. హంద్రీనీవా గాలేరు ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. రైతులకు ఇన్సూరెన్స్ వెంటనే ఖాతాల్లో జమ చేయాలన్నారు. రైతులకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుకుని పంట పెట్టలేదని రైతులకు ఇన్సూరెన్స్ ఇవ్వక పోవడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో రెండు లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారని, అవి కూడా ఎండిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వం కారణంగా రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. వలసలు కూడా పెరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాయలసీమ మీద కపట ప్రేమ చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి సుబ్బిరెడ్డి, పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు, సీఐటీయూ కార్యదర్శి రామక్రిష్ణ, విద్యార్థి సంఘం నాయకులు కుమార్‌నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సాంబశివ, సీపీఎం నాయకులు జగన్‌మోహన్, హరినాథ్‌రెడ్డి, రవి, రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

ఎస్‌జీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలలో 'వనం-మనం'

తనకల్లు : స్థానిక శ్రీ గోవింద నరసింహరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో శనివారం వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అటవీశాఖ అధికారి బీవీ సుబ్బారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచి మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. చెట్ల వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కదిరి ఫారెస్ట్ రేంజ్ అధికారి బీవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సాంబశివాచారీ, ప్రిన్సిపాల్ ప్రశాంత్, తనకల్లు బీట్ ఆఫీసర్ హరిప్రసాద్, రామాంజులరెడ్డి, రాజశేఖర్, రాహుల్, తేజ, రమణ, రేణుక, లలితాబాయి, వెంకటేష్, కదిరి ప్రాంతంలోని వివిధ అటవీప్రాంతాలకు చెందిన బీట్ ఆఫీసర్లు , సహాయ బీట్ ఆఫీసర్లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పండగను ప్రశాంతంగా జరుపుకుందాం

కదిరిటౌన్ : ఏటా జరుపుకునే వినాయక చవితి పండుగను ఈ సారి కూడా అన్ని రాజకీయ పార్టీలు, అన్ని శాఖల అధికారులు అందరం కలసి ప్రశాంతంగా జరుపుకుందామని టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పోలీసులు అధికారులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఆర్డీఓ వెంకటేశు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, ఏఎస్పీ మా ల్యాదిలు హాజరై మాట్లాడారు. ఆగస్టు 29న నిమజ్జన కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు తెలిపారు. గతంలో ఏ విధంగా జరిగిందో అదే విధంగా శాంతియుతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, రెవె న్యూ, పోలీసు, ట్రాన్స్‌కో, ఫైర్ శాఖల అధికారులు కలసి శాంతియుతంగా వినాయక చవితి పండుగను, నిమజ్జన కార్యక్రమాన్ని జరుపుకుందామని పిలుపు నిచ్చారు. కార్యక్ర మంలో తహసీల్దార్ పీవీ రమణ, డీఏఓ శంకర్, ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, పార్థసారధి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ బాను, డీఎస్పీ వెంకటరమణ, సీఐలు శ్రీనివాసులు, శ్రీధర్, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, గోపాలుడు, ముస్లిం మత పెద్దలు, సీపీఎం డివిజన్ కార్యదర్శి వేమయ్య యాదవ్, టీడీపీ నాయకులు సీఎండీ ఇస్మాయిల్, వైసీపీ నాయకులు బాహద్దీన్, లోకేశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు నాగేంద్ర, తలుపుల గంగాధర్, డీఎల్ అంజనేయులు, సీపీఎం నాయకులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

ఆంధ్రజ్యోతి మడకశిర
ఆదివారం, 20, ఆగస్టు 2017
13
మడకశిర | అమరాపురం | రొళ్ల | గుడిబండ | అగళి

నేడు కృష్ణాష్టమి వేడుకలు

అగళి: మండల కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలను ఆర్కే కళ్యాణమండలంలో ఆదివారం నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ శైల జారామకృష్ణయాదవ్ పేర్కొన్నారు. పార్టీలక తీతంగా అందరూ హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

గ్రామస్థుల శ్రమదానం

అమరాపురం: మండలంలోని గౌడనకుంట గ్రామప్రజలు శనివారం శ్రమ దాన కార్యక్రమం ద్వారా రోడ్లకు మట్టిని వేశారు. గౌడనకుంట నుంచి అమరాపురం వెళ్లే రహదారి గుంతల మ యం కావడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడేవా రు. గ్రామ స్థులు ఐక్యంగా రహదారికి మట్టిని తోలి గుంతలను పూడ్చారు.

ముగిసిన శ్రావణమాస పూజలు





రొళ్లలో శనీశ్వరాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

అగళి: మండలంలో గత నెల రోజులుగా జరిగిన శ్రా వణ మాస పూజలు శనివారం ముగిశాయి. నాలుగైదు వారాలు ఆలయాల్లో భక్తులుప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి శనివారం పలు ఆలయాల్లో భక్తులు జ్యోతుల ఉత్సవాలను నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కోడిపల్లి ఆం జనేయస్వామి, రావిడి, అగళి, హెచ్‌డీహళ్లి ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మం డల వ్యాప్తంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించి మొక్కుబడి తీర్చుకున్నారు.

రొళ్ల: మండలంలో చివరి రోజు శ్రావణశనివారం సంద ర్భంగా ఘనంగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రం లోని శనిమహాత్ముని ఆలయం, లక్ష్మీన రసింహస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. శనీశ్వరస్వామికి మహిళలు భక్తిశ్రద్దలతో హారతుల ఉత్సవం నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని కాలువేపల్లి రంగనాథస్వామి, జీరిగేపల్లి అమ్మాజీదేవాలయం, ఎం.రాయాపురం లోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయం, ఆవినకుంట, కాకి, కే.బ్యా డిగెర, గొట్టుగురికి తదితర గ్రామాలలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్ర సాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మడకశిర అర్బన్: శ్రావణమాస చివరి శనివారం సందర్భంగా పట్టణంలోని అన్ని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని కోట వెం కటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అలం కరణలు, అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజాకార్యక్ర మాలు నిర్వహించారు. మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలోనూ, మారుతీకాలనీలో వెలసిన అభయాంజనేయస్వామి ఆల యా ల్లో ఆకుపూజ అలంకరణలు, కుంకుమార్చన వంటి పూజా కా ర్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుం చి సాయంత్రం వరకు ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. పలు దేవాల యాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేపటి నుంచి బోధన విధానంపై శిక్షణ

మడకశిర టౌన్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నేషనల్ అచ్యువ్‌మెంట్ సర్వేలో వెనుకబ డిన విద్యార్థుల విద్యను మెరుగుపరి చేం దుకు 21,22 తేదీలలో శిక్షణ నిర్వహించను న్నట్లు ఎంఈఓ నరసింహరాజు శనివారం తెలి పారు. 21న తెలుగు, గణితంపై పలు విషయాలను విద్యార్థులకు ఎలా బోధిస్తే వారు గ్రహించగలరనే దానిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 22వతేది ప లు పాఠశాలలకు శిక్షణనిస్తా మన్నారు స్కూల్ కాంప్లెక్స్‌ల పరి ధిలో శిక్షణ నిర్వహిస్తామని ఉపాధ్యాయులం ద రూ తప్పక హాజరు కావాలన్నారు. కల్లు మర్రి, బుళ్లసముద్రం, గౌడనహళ్లి, ఆమిదా లగొంది, జడ్పీహెచ్‌ఎస్ మడకశిరలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అదేవిధంగా టెలికాన్ఫరెన్స్‌లో కూడా ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు.

ఘనంగా శనీశ్వరస్వామికి హారతుల ఉత్సవం



జ్యోతులతో ఊరేగింపుగా వెలుతున్న మహిళలు

అమరాపురం: మండలంలో ఆలద పల్లి, అమరాపురం, బసవనపల్లి, దేవగా న పల్లి గ్రామాలలో వెలసినశనీశ్వర ఆల యా ల్లో స్వామికి శ్రావణమాస చివరి శనివారం పురస్క రించుకుని మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం నిర్వహిం చారు. జ్యో తులను మోసుకుని గ్రామ పురవీధుల గుం డా మేళతాళలతో వెళ్లి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

అమరాపురం: వీరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు, కిశోరాబాలికలకు శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ మాట్లాడు తూ గర్భవతులు ప్రతి బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు చేయించు కోవాలన్నారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవి, మహిళలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

అమరాపురం: వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలుపాటించాలని ఎస్‌ఐ వెంకటస్వామి సూచించారు. శనివా రం మండల కేంద్రంలోని వైఎస్‌ఆర్ సర్కి ల్‌లో వాహన దారులకు ట్రాఫిక్ నిబం ధనలపై తెలియజేశారు. కర్ణాటక నుంచి ఆంధ్రాకు వచ్చే వాహనదారులు సీటుబెల్టు వేసుకుంటారాలేదా పరిశీలిం చారు. అధిక లోడుతో వస్తున్న వాహ నాలను ఆపి డ్రైవ ర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబం ధనలు పాటిచాలని సూచిం చారు.లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

తైవాన్ స్ప్రేయర్లను సద్వినియోగం చేసుకోండి



టార్పాలిన్‌లను పంపిణీ చేస్తున్న హార్టికల్చర్ అధికారులు

మడకశిర అర్బన్: ఉద్యానశాఖ మడకశిర తాలూకా పోస్ట్ హార్వెస్ట్ పథకంలో భాగంగా నియోజకవర్గంలోని ఐదు మం డలాల్లో ఉద్యానపంటలుసాగుచేసిన రైతులకు స్థానిక హార్టిక ల్చర్ కార్యాలయంలో శనివారం ఉద్యానశాఖాధికారిణి అనిత ఆధ్వ ర్యంలో పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో పండ్లతో టలు, కూరగాయలు, వక్క, ఆకు, కొబ్బరి, పండ్లతోటలు సాగుచేసిన రైతులకు ఈ టార్పాలిన్‌లను పంపిణీ చేశారు. మొత్తం 1250 టార్పాలిన్‌లు మంజూరయ్యాయని ఒక్కొక్క యూనిట్ పూర్తి ధర రూ.2500లు ఉండగా 50 శాతం సబ్సిడీ పోను రూ.1250 లకే రైతులకు అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా నియో జక వర్గంలోని ఐదు మండలాలకు 17 తైవాన్ స్ప్రేయర్లు మంజూ రయ్యాయని, అందులో ఎస్సీ,ఎస్టీ రైతులకు 3 యూనిట్ల చొప్పున 6 యూనిట్లు ఉంటాయన్నారు. మిగతా రైతులకు 8 యూనిట్లు ఉంటాయ న్నారు. ఒక్కొక్క స్ప్రేయర్ ధర రూ.19116లు ఉంటుందన్నారు. మహిళా రైతులు, సన్న, చిన్న కారు రైతులు, ఎస్సీ,ఎస్టీ రైతులైతే రూ.11116లు డీడీ తీయాల్సి ఉంటుం దన్నారు. పెద్ద రైతులైతే రూ.19116లతో డీడీ తీయాల్సి ఉం టుదన్నారు.పెద్ద రైతులకు రూ8వేల సబ్సిడీ వారి ఖాతాల్లోకి జమా అవుతుందన్నారు. డీడీని VRAGRO equipments, Allagadda పేరు మీద డీడీ తీయాల్సి ఉం టుందన్నారు. డీడీతో పాటు రైతుల పత్రాల వివరాలు జత చేయాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్విని యో గం చేసుకోవాలని కోరారు. ఈకా ర్యక్రమంలో ఎంపీ హెచ్‌ఓలు బిందు, రైతులు పాల్గొన్నారు.

యోగతోనే మానసిక ప్రశాంతత : ప్రిన్సిపాల్



యోగాలో పాల్గొన్న విద్యార్థులు

మడకశిర టౌన్: యోగాతోనే ఏకాగ్రత, ఆరోగ్యం, ప్రశాంతత యోగాతోనే సాధ్యమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సు బ్బయ్య అన్నారు. శనివారం డిగ్రీ కళాశాలలో యోగా తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యతో పాటు యోగా వల్ల ఆరోగ్యం, ఏకాగ్రత అనేది లభించడం వలన కొంత వరకు విద్యపై ద్యాసపె ట్టవచ్చన్నారు. విద్యార్థులు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన డం అభినందనీయమని, సమయాన్ని వృథా చేయకుండా ఖాళీ సమయాల్లో పోలీసు విధులకు సహకరించడానికి స్వచ్చం దంగా ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రంగనా యకులు, అధ్యాప కులు యశోదాదేవి, శారద,తిరుమలదేవి, రవికుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె ఉధృతం



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

మడకశిర టౌన్: మడకశిర నియోజకవర్గంలోని తపాలా ఉద్యోగులు జీడీఎస్‌లు సమస్యలు పరిష్కరించాలంటూ గత నాలుగు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. శనివారం మడక శిర పట్టణంలో తపాలా కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వ హించి అమరాపురం ప్రధాన రహదారిలో మానవహారంగా ఏర్పడ్డారు. సమ్మెను మరింత ఉధృతం చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాము, శ్రీని వాసులు, సంజీవరావు, నరింహులుతో పాటు నియోజక వర్గం లోని తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు కుంచిటిగల సమావేశం

అగళి: మండల కేంద్రంలోని పాత బీసీహాస్టల్‌లో ఆది వారం ఉదయం 11 గంటలకు కుంచిటిగ వక్కలిగల సమా వేశాన్ని నిర్వహించనున్నట్లు కుంచిటిగ సంఘం నాయకులు జేసీబీ నటరాజ్ తెలిపారు. ఈసమావేశానికి మండలంలోని కుం చిటిగ వక్కలిగలందరూ హాజరు కావాలనికోరారు. ఈ సమావేశంలో కుంచిటిగ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్ను కోనున్నట్లు తెలిపారు.

రేపు ఉపాధ్యాయులకు టెలికాన్ఫరెన్స్

గుడిబండ: ఈ నెల 21న ప్రైమరీ స్కూల్స్, 23న హై స్కూళ్లకు సంబంధించి గణితం, తెలుగు, ఈవీఎస్, సోషియల్ స్టడీస్‌లో అధ్యాయన పద్ధతులు, నైపుణ్యతలు, ప్రశ్నాపత్రాల తయారీపై ఉపాధ్యాయులకు టెలికాన్ఫరెన్స్ ఉంటుందని ఎంఈఓ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సా యంత్రం 5 గంటలకు ఈ టెలికాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. 50 శాతం ఉపాధ్యాయులు, ఏకోపాధ్యాయులు మధ్యాహ్నం హాజ రు కావాలన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్స్, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్స్ శిక్షణనిస్తారన్నారు. మండలంలోని ప్రధానోపాధ్యా యులందరూ రూ.2237లు చెల్లించి పాఠశాల పేరుమీద గ్యాస్ కు దరఖాస్తు చేయాలని, తిరిగి స్కూల్ గ్రాంట్స్ నుంచి ఆ మొ త్తాన్ని డ్రాచేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లులను ప్రతి నెల 2,3తేదీల్లో ఎంఆర్‌సీకి పంపాలన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మడకశిర రూరల్: మాజీ శాసనసభ్యుడు వైటీ ప్రభాకర్‌రెడ్డి తల్లి వెంకటశివమ్మ వర్ధంతి సందర్భంగా శనివార ం ఆమిదాలగొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు. వృద్ధాశ్రమ అభివృద్ధి కోసం రూ.5వేల విరాళం అంద జేశారు. వైటీ ప్రభాకర్‌రెడ్డి సతీమణి డాక్టర్ ఉషారాణి వృద్ధుల ఆరోగ్య విషయాలపై అడిగి తెలుసుకున్నారు. వారికి ఆశ్రమ అధ్యక్షుడు తిమ్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానంచేస్తున్న గ్రామస్థులు

రొళ్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో పది మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఈ విషయమై శనివారం పాఠశాలలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. మొదటి సారిగా పెద్ద ఎత్తున ఇంత మంది ఉపా ధ్యాయులు బదిలీ కావడంతో ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. వారు విద్యాభివృద్ధికి చేసి న సేవలను పలువురు కొనియాడారు. ప్రధానోపాధ్యా యుడు గోవిందప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు బోల్తా తప్పిన పెను ప్రమాదం

సోమందేపల్లి : జాతీయ రహదారిపై సోమం దేపల్లి సమీపంలో శనివారం సాయంత్రం కారు బోల్తాపడింది. చిలమత్తూరులో సర్వేయర్‌గా పని చేస్తున్న శ్రీనివాసులు కారులో అనంతపురం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. వీరు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న గోతిలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తోపాటు డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు పాక్షికంగా దెబ్బతింది. ఎస్ఐ ప్రసాద్ సం ఘటనా స్థలానికి చేరుకుని హైవే పెట్రోలింగ్ వాహ నం ద్వారా క్షతగాత్రులను పెనుకొండ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా వరుణయాగం


హోమంలో పాల్గొన్న భక్తులు

గోరంట్ల రూరల్ : మండలంలోని శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో 60గంటలచేత వరుణయాగం జరిపారు. ఆలయ వ్యవస్థాప కులు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు నారాయణానందస్వామి 9మంది రుత్విక్కులచే వరుణయాగం, లక్ష్మీనారాయణ హోమం, సుదర్శనహోమం, మృత్యుంజయ హోమం, గురుహోమాలను నిర్వహించారు. ప్రజలు సుఖశాంతులతో గడపాలని వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలతో తుల తూగాలని దేవున్ని ప్రార్థించారు. షిర్డీసాయి బాబా సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన హోమాలకు ప్రజలు పాల్గొన్నారు.

చంద్రన్నబీమా ఆర్థిక సాయం అందజేత

సోమందేపల్లి : మండలంలోని కదిరే పల్లిలో శనివారం చంద్రన్నబీమా ఆర్థికసా యాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన సాలక్క(45)గుండెపోటుతో మృతిచెందడం జరిగింది. చల్లాపల్లి సర్పంచ్ రామక్రిష్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనసూయమ్మ, దేశం నాయకులు సంజీవరెడ్డి, గ్రామానికి వెళ్లి మృతురాలి కుమార్తె నర్సమ్మకు చంద్రన్నబీమా ద్వారా రూ.5వేలు తక్షణసాయంగా అందజేశారు. మిగిలిన మొత్తాన్ని వారి ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు.

వేణుగోపాలస్వామికి కలశాల ఉత్సవం


కలశాలతో వస్తున్న భక్తులు

రొద్దం : శ్యాపురం గుట్టల్లో వెలసిన వేణుగోపాలస్వామికి శనివారం కలశాల ఉత్సవం ఏర్పాటు చేశారు. హోమాలు, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామికి కలశాల ఉత్సవం నిర్వహించి పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని అనుసరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకుఅ న్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజార్లు పంచాంగం నాగప్రసాద్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు రాంప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

అత్యున్నత విద్యాప్రమాణాలతోనే అభివృద్ధి

- ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఎంపీ నిమ్మల కిష్టప్ప


బహుమతి అందజేస్తున్న ఎంపీ


మాట్లాడుతున్న ఎంపీ నిమ్మల కిష్టప్ప

గోరంట్ల రూరల్ : పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం తోపాటు అత్యున్నత విద్యాప్రమాణాలతో మంచి చదువులు చదివినప్పుడే అభివృద్ధి సాధించ వచ్చని ఎంపీ నిమ్మలకిష్టప్ప పేర్కొన్నారు. గోరంట్ల ఎస్వీఆర్ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే ని ర్వహించారు. ఎస్‌వి ఆర్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ ప్రసంగిస్తూ యువకులు కళాశాలలో సత్ప్రవర్తనతో మెలగాలని ఎలాంటి చెడు అలవాట్లకు పాల్పడకుండా ఉండాలన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన అమ్మాజాన్, బాలచందర్, తదితర విద్యార్థులకు బహుమతులు అందించారు. కళాశాలల ప్రిన్సిపాళ్ల వేణుగోపాల్, భక్తవత్సలం, విజయలక్ష్మీ, లెక్చరర్‌లు ప్రసాద్, అరవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతి కార్యక్రమాలు, ఉల్లాస భరితంగా సాగాయి.

బదిలీ ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు


రొద్దంలో ఉపాధ్యాయులను ఊరేగిస్తున్న విద్యార్థులు


గోరంట్లలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల రూరల్ : మండలంలోని మల్లాపల్లి ప్రాథమిక, కాగానిపల్లి ప్రాథమికోన్నత, పులేరు ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులను శనివారం సన్మానించి ఘనంగా వీడుకోలు పలికారు. మల్లాపల్లి పాఠశాలలో హెచ్ఎం నంజప్ప 8ఏళ్ల పనిచేసి బదిలీకాగా మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ నర్సింహులు, ఎంఈఓ కలీముల్లా, ఉపాధ్యాయులు, సుధాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగేనాయక్, తదితరులు, గ్రామస్థులు, సన్మానిస్తూ ఆయన సేవలను కొనియాడారు. కాగానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీఅయిన అశోక్, అశ్వర్థనారాయణ, లక్ష్మీరాంనాయక్, కవితలను హెచ్ఎం రామక్రిష్ణ ఆధ్వర్యంలో వీడుకోలు పలికారు. పులేరు ఉన్నత పాఠశాలలో శంకర్‌నారాయణతోపాటు ఏడు మంది టీచర్లు బదిలీకాగా వారిని టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్, హెచ్ఎం అమీర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

రొద్దం : కోగిర ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు కోగిర పాఠశాల హెచ్ఎం శివరాం శనివారం ఘనంగా సత్కరించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు పూలమాలలువేసి దుశ్శాలువలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి హెచ్ఎం అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు మాట్లాడారు. కార్యక్రమంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు జాబిలి చాంద్‌బాషా, బాలముని, శ్రీనివాసులు, సోమశేఖర్‌రాజు, పద్మజ, శిష్ప, మాధవి, వరలక్ష్మీ, ప్రభాకర్ తదితరులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

గోరంట్ల రూరల్ : బూదిలి ఉన్నత పాఠశాలలో 1987-88లో పదవతరగతి చదివిన పూర్వపు విద్యార్థులు రమాదేవి, వీరేష్ బాబు ఆధ్వర్యంలో 380మంది విద్యార్థులకు శనివారం నోటు పుస్తకాలు పంపిణీచేశారు. ఒక్కో విద్యార్థికి ఐదు పుస్తకాలు చొప్పున అందజేశారు.ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసి మరణించిన గురువులు గోవిందరెడ్డి, రవిశంకర్‌రావు, వెంకటాచలపతి, జేమ్స్, నర్సింహామూర్తిల భార్యలకు పూర్వ విద్యా ర్థులు ఘనంగా సన్మానించారు. మరణించిన తోటి విద్యార్థులు పాఠశాల సిబ్బంది బంధువులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం జనార్దన్‌రెడ్డి, టీచర్లు శంకర్‌నా రాయణ, తదితరులు పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

2014లో అదృశ్యమైన మహిళ లభ్యం


తహసీల్దార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

రొద్దం : కోగిర గ్రామానికి చెందిన కళావతి అనే మహిళ 2014లో గ్రామం నుంచి అదృశ్యమైంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లా కుప్పంలో లభ్యమైనట్లు జమేదార్ నర్సింహులు తెలిపారు. ఆమె భర్త కోగిర రామాంజినేయులు వేధింపులకు గురిచేయడంతో భరించలేక 2014లో గ్రామం వదిలి వెళ్లిపోయింది. రామాంజినే యులు రొద్దం పోలీసులకు భార్య అదృశ్యమైందని ఫిర్యాదు చేశా డు. గ్రామం నుంచి వెళ్లిపోయిన కళావతి శోభగా పేరు మార్చు కుని కుప్పం కాటన్‌మిల్‌లో పనిచేస్తూ జీవనం సాగించింది. ఈ కసును రొద్దం ఎస్ఐ మునీర్‌అహ్మద్, జమేదార్ నర్సింహులు, సిబ్బంది మనోహర్, మల్లికార్జున, గంగాధర్, శ్రీనివాసులు, విచారణ చేపట్టి గాలించి శోభను గుర్తించి రొద్దం స్టేషన్‌కు తరలించారు. స్థానిక ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామక్రిష్ణ సమక్షంలో శోభ అభీష్టం మేరకే తల్లిదండ్రులైన రాజు, స్వరూపలకు శనివారం అప్పగించినట్లు జమేదార్ తెలిపారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెనుకొండ రూరల్ : మండలపరిధిలోని పెద్దచెరువుకట్ట ఆంజనే య స్వామి ఆలయంలో శనివారం భక్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు నిర్వ హించారు. శ్రావణ చివరి శనివారం పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి ఆకుపూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు చేయించారు. భక్తులు భక్తిశ్ర ద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

గోరంట్ల రూరల్ : శ్రావణ మాసం ఆఖరి శనివారం కావడంతో మండలంలోని ప్రముఖ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. కుటుంబ సమేతంగా కసాపురం ఆంజనేయస్వామి, కదిరి లక్ష్మీనర్సిం హస్వామి, గడిదం వెంకటరమణస్వామి పుణ్యక్షేత్రాలకు వెళ్లి పూజలు జరిపారు.

సోమందేపల్లి : శ్రావణ ఆఖరిశనివారం పురస్కరించుకుని మండల వ్యాప్తంగా వివిధ ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. చెన్నాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమందేపల్లి పాతూరులోని ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారిని పూజించారు.

ప్రత్యామ్నాయ విత్తన పంపిణీకి ప్రణాళిక


ఏడీ కృష్ణమీనన్

పెనుకొండ : వర్షాభావం కారణంగా ఖరీఫ్ సాగుచేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయడానికి అవ సరమైన విత్తనాలుపంపిణీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసి నట్లు ఏడీ కృష్ణమీనన్ తెలిపారు.శనివారం ఆయన మా ట్లాడుతూ డివిజన్‌లోని పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, పుట్ట పర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో కేవలం 40శాతం మాత్రమే వేరుశనగ సాగుచేశారన్నారు. మిగిలిన 60శాతం రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయడానికి అవస రమైన 195క్వింటాళ్ల జొన్నలు, 896క్వింటాళ్ల ఉలవలు, 419క్విం టాళ్ల అలసందులు, 505క్వింటాళ్ల పెసలు, ప్రతిపాదనలు పంపామన్నారు. విత్తనాలు రాగానే పంపిణీచేయడం జరుగుతుందన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలి

పెనుకొండ : విద్యార్థులు తాము సాధించాల్సిన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ కేశవయ్య తెలిపారు. శనివారం స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా ఎస్ఓ ప్రతాప్, ప్రిన్సిపాల్ కేశవయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమకంటూ ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని బాగా చదివి భవిష్యత్తులో గుర్తిం పు పొందాలన్నారు. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవా లన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ఆటలపోటీలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు కుళ్లాయరెడ్డి, శివారెడ్డి, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి రావాలి


మొక్కలు నాటుతున్న ఎస్ఐ జనార్దన్, విద్యార్థులు

పెనుకొండ టౌన్ : ప్రతి విద్యార్థి చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ జనార్దన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పరిటాల శ్రీరాములయ్య కళాశాలలో ర్యాగింగ్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోకుండా విద్యపై శ్రద్ధ ఉంచి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా ఈ ప్రాం తంలో నిరుపేదను దృష్టిలో ఉంచుకుని పరిటాల రవీంద్ర డిగ్రీ కళాశాలను ఏర్పాటుకు కృషిచేశారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ నిలబెట్టాలన్నారు. అనంతరం ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎ ఎస్ఐ సిద్ధయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జే కే పల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్ కట్

అమడగూరు : మండలంలోని జే కే పల్లి ఎస్సీ కాలనీలో వారం రోజులుగా విద్యుత్ సరఫరా నిలిపి వేసినట్లు ఆ కాలనీ వాసులు పేర్కొన్నారు. కాలనీలో విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ సరఫరా నిలిపివేశారన్నారు. తాము ప్రతి నెల బిల్లులు చెల్లిస్తున్నామని, మరో ప్రక్క తమకు ఉచిత విద్యుత్ సరఫరా ఉన్నా.. నిలిపి వేశారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే చీకట్లో విషపురుగులతో భయపడుతున్నామన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి

- ఏబీసీ డబ్ల్యుఓ క్రిష్ణయ్య



రికార్డులు పరిశీలిస్తున్న ఏబీసీ డబ్ల్యుఓ

ఓబుళదేవరచెరువు : ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్దే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ఏబీసీ డబ్ల్యుఓ ఎం క్రిష్ణయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని , మిట్టపల్లిలో బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడం కోసం విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు హాస్టల్ వార్డెన్ సుబ్బరాయుడు, సిబ్బంది శ్రీరాములు, లక్ష్మేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

బుక్కపట్నం: విద్యార్థులు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని రక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. శనివారం ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమంలో భాగం గా డిగ్రీ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. కళా శాల ఆవరణలో, రోడ్డుకు ఇరువైపులా విద్యార్థులు మొక్క లు నాటి కంచెను కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యా పకులు ఓబిలేశు, షమీవుల్లా, రామన్న, షఫీ పాల్గొన్నారు.

తక్కువ ధరకే మీసేవ ద్వారా పట్టాదారు పాసుపుస్తకం



పట్టాదారు పాసుపుస్తకం పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్

ఓబుళదేవరచెరువు : తక్కువ ధరకే పట్టాదారు పాసుపుస్తకం ఇక నుంచి మీసేవ ద్వారా పొందవచ్చని తహసీల్దార్ ఎల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మొట్టమొదటి సారిగా మీసేవ కేంద్రం - 2 లో పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎల్‌రెడ్డి మాట్లాడుతూ టెన్‌వన్ మాదిరిగా రూ. 25/-లకు పట్టాదారు పాసుపుస్తకం వివరాలు పత్రం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌పీరా, ఆర్‌ఐలు శర్మ, వెంకటరెడ్డి, మీసేవ కేంద్ర నిర్వాహకులు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వనం-మనం

అమడగూరు : మండలంలోని జే కే పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వనం-మనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. ఫారెస్టు అధికారులు వెంకట్రామిరెడి, మొక్కలు ఏర్పాటు చేయడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి , వ్యాయామ ఉపాధ్యాయులు రాజేష్, విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి నాటిన మొక్కలను సంరక్షించాలని విద్యార్థులకు పాఠ ప్రధానోపాధ్యాయురాలు సూచించారు. మొక్కల తోనే పాఠ శాల పరిసుభ్రంగా, ఆహ్లాదకరంగా, ఆరోగ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేయండి

పుట్టపర్తి: పట్టణంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేయాలని టీడీపీ, బీజేపీ నాయకులు కోరారు. శనివారం రాష్ట్ర వైద్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసులు, కర్ణాటక వైద్యశాఖ మంత్రి సురేశ్‌కుమార్‌లను సన్మానించారు. ఈసందర్భంగా డాక్టర్ కామి నేనితో నాయకులు మాట్లాడుతూ స్థలం కొరత వల్ల 30 పడకల ఆస్పత్రి మంజూరు కాలేదని, స్థలాన్ని చూపడానికి మేము సిద్ధంగా ఉన్నా మని, ఆస్పత్రిని మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం ట్రస్టు పనిమీద వచ్చామని, ప్రభుత్వ విష యాలు ఇక్కడ చర్చించ వద్దని మంత్రి వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, పుడా చైర్మన్ కడియాల సుధాకర్, కన్వీనర్ రామాంజినేయులు, బీజేపీ నా యకులు జ్యోతి ప్రసాద్, ఉక్కళం శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రి కామినేనిని కలిసి బీజేపీ నాయకులు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసులును స్థానిక బీజేపీ నాయకులు కలిశారు. శనివారం ప్రశాంతి నిలయానికి విచ్చేసిన డాక్టర్ కామినేనిని కలిసి సాదరస్వాగతం పలికారు. ఈసందర్భంగా బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి చర్చించుకున్నారు.

అవార్డు గ్రహీతకు, ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్థులు



ఓడీసీలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: విధి నిర్వహణలో ప్రతిభ కనబరచినందుకు ఉత్తమ అవార్డు పొందిన ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డిని ఎమ్మార్పీ ఎస్ నాయ కులు శనివారం పుట్టపర్తిలో ఘనంగా సన్మానించారు. మండలంలో మూడే ళ్లుగా పని చేస్తూ మంత్రి కాల్వ శ్రీనివా సులు చేతుల మీదుగా ఆగష్టు 15న ఉత్తమ అవార్డును పొందిన ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డిని వారు అభినందించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు లో చర్ల నరసింహులు, రంగప్ప, వెంకటరాముడు, తిప్పయ్య, ఓబి లేశు,సుగాలిలసంఘంనాయకుడుశ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు..

కొత్తచెరువు: మండలంలోని యర్రబల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై మైలేపల్లి పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యా యుడు సాయిశివను యర్రబల్లి గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించారు. ఎనిమిదేళ్లుగా ఈ పాఠశాలలో పని చేస్తూ బదిలీ అయినా ఉపాధ్యాయుడి సేవలను వారు కొని యాడారు. ఈకా ర్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, టీడీపీ నాయకులు కేశప్ప, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్ళిన ఉపాధ్యా యులు సుబ్బరావు, చెన్నక్రిష్ణారెడ్డి, ఆనంద్ , షబ్బీర్, నాగమణి, హసిన్ సుల్తానాలను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంఈఓ లలితమ్మ పాల్గొ న్నా రు. అనంతరం దుశ్శాలువలు, పూల మాలలతో ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ శంకర్‌రెడ్డి, రాజశేఖర్, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, రామాంజినేయులు, వేణుగోడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

పుట్టపర్తి రూరల్: మండలంలోని వెంగళమ్మచెరువు గ్రామంలో వర్షం కోసం ఎంపీపీ రమాదేవి ఆధ్వర్యం లో గ్రామస్థులు పూజలు చేశారు. చెరువు నిర్మాణ సమయంలో వెంగళ ఆదెమ్మ ఉప యోగించిన పురాతన విసరరాయికి శనివారం సాయంత్రం పూజలు చేశారు. పూజలు చేస్తున్న సమయంలో వర్షపు జల్లులు రాలడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశా రు. నాటి వెంగళ ఆదెమ్మ పేరుతోనే నేడు వెంగళమ్మచెరువు అనే నామం గ్రామా నికి రావడం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. ఈ పూజల్లో టీడీపీ నాయకులు శ్రీరామిరెడ్డి, నర్సారెడ్డి, పెద్దఎత్తున గ్రామ స్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ రమాదేవి

ఈ-క్రాప్‌ను పకడ్బందీగా నిర్వహించండి

ఓబుళదేవరచెరువు : ఈ యేడు రైతులు సాగు చేసిన పంటలను ఈ - క్రాప్ ద్వారా పకడ్బందీగా అమలు నిర్వహిం చాలని వీఆర్ఓ లకు తహసీల్దార్ ఎల్ రెడ్డి ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భం గా ఆయన మాట్లాడుతూ గతంలో వెలుగు సిబ్బంది సర్వే నిర్వహించారని, ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాల మేరకు వీఆర్ ఓలు గ్రా మాల లోకి వెళ్ళి రైతులు సాగు చేసిన పంటల వివరాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. ఇందుకు రైతులు వీఆర్ఓలకు సహకరిం చాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో బోర్లు వేసి నీరు ప డని బోర్లను ఉంటే వాటిని స్వచ్ఛందంగా పూడ్చివేయాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఆర్‌డబ్ల్యుఎస్, గ్రామ కార్యదర్శులు వృథాబోర్లను పూడ్చివేయా ల న్నారు. వెంకటాపురం పంచా యతీలో 446 వ్యక్తిగత మరుగు దొడ్ల మంజూరు కాగా వాటిలో 316 పూర్తి అయ్యాయని , 79 అసంపూర్తిగా ఉన్నాయని వాటిని ఐదు రోజు ల్లోగా పూర్తి చేయాలన్నారు. అందుకు లబ్ధిదారులకు మరుగుదొడ్లపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీ ల్దార్ మహబూబ్‌పీరా, ఆర్ఐ శర్మ, వెంకటరెడ్డి, వీ ఆర్‌ఓలు బాలప్ప, నరసింహారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, సర్పంచు నాగి రెడ్డి, శ్రీనివాసులు, క్షేత్ర సహాయకులు మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎల్ రెడ్డి

ఉల్లాసంగా ఉట్లపరుష



ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువత

ఓబుళదేవరచెరువు: ఉత్సాహంగా.. ఉల్లాసం గా మండలంలోని శెట్టివారిపల్లిలో శ్రావణ శనివారం ఉట్లపరుషను ఘనంగా జరుపుకున్నారు. నల్లకొండ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉత్సాహంగా.. ఉల్లాసంగా యువకులు ఉట్లను ఎక్కడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రుణాల మంజూరుకు 30న ఇంటర్వ్యూలు

నల్లమాడ : మండలంలో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 30న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ రాబర్ట్ విల్సన్ తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖా స్తుతో పాటు విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, ఫోటోలు తీసుకు రావాలన్నారు.

రుణయోగం ఎవరికో?

పుట్టపర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీ రుణాలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. పుట్టపర్తి మండలంలోని లబ్దిదారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మౌఖిక పరీ క్షలు నిర్వహించారు. ప్రభుత్వం పలు కార్పొరేషన్ల ద్వారా అంది స్తున్న రాయితీ రుణాలకు ఒక్కో యూనిట్‌కు సగటున 6 మంది లబ్దిదారులు పోటీపడుతున్నారు. ఇందులో జన్మభూమి కమిటీ స భ్యులు, బ్యాంక్ అధికారులు ఎంపికలో కీలకపాత్ర పోషించను న్నారు. పుట్టపర్తి మండల వ్యాప్తంగా 223 యూనిట్లకు 1317 దర ఖాస్తులు వచ్చాయి. ఒక్కో యూనిట్ విలువను రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ఈ మేరకు దరఖాస్తుల పరిశీలన ఎంపీ డీఓ సుబ హాన్ అధ్యక్షతన బ్యాంకర్లు, జన్మభూమి కమిటీ సభ్యుల సమక్షంలో మౌఖిక పరీక్షలు నిర్వహించారు. దరఖాస్తులను పరిశీలించిన తరు వాత ప్రాజెక్టు నివేదిక అందించి రుణాలు పొందాల్సి ఉంటుంది. ఇందులో రుణాలు లబ్దిదారులకు 50 శాతం సబ్సిడీ లభించనుంది. ఇందులో ఎస్సీలకు 29 యూనిట్లు కేటాయించగా, 184 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీలకు 15 యూనిట్లు ఉండగా, 97 మంది దరఖాస్తు చేసుకున్నారు. బీసీలకు 87 యూనిట్లు ఉండగా, 788 మంది, మైనార్టీలకు 12 యూనిట్లు ఉండగా, 64 మంది, కాపులకు 80 యూనిట్లు ఉండగా, 184 మంది దరఖాస్తు చేసుకున్నారు. జన్మ భూమి కమిటీ సభ్యులు, ఎంపీపీ రమాదేవి, వెంకటగారిపల్లి పుల్లప్ప, అత్తర్‌బాషా

సబ్సిడీ రుణాల కోసం 23 నుంచి ఇంటర్వ్యూలు

కనగానపల్లి: మండలంలో సబ్సిడీ రుణాల కోసం 23 నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 23న కనగానపల్లి ఎస్‌బీఐ, పేరూరు, నూతిమడుగు ఏపీజీబీ పరిధిలోని గ్రామాల వారికి, 24న మామిళ్లపల్లి, కనగానపల్లి ఏపీజీబీ పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన మంత్రి సునీత

రామగిరి: మండల కేంద్రమైన రామగిరిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రి కేంద్రానికి వెళ్లగానే అన్న అమృత హస్తం నిర్వహణపై ఆరా తీశారు. అక్కడ ఉన్న గర్భిణీలు, బాలింతలతో పథకం బాగుందా? మీకు ప్రతి రోజూ భోజనం, పాలు, గుడ్లు ఇస్తున్నారా? అంటూ ఆరా తీశారు. అక్కడున్న భోజనాలు, కూరలను ఆమె పరిశీలించారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల బరువు, ఎత్తులను స్వయంగా పరిశీలించారు. వారు ఎంత బరువు ఉండాలి, ఎంత ఉన్నారు అనే అంశాలను ఆరాతీశారు. అంగన్‌వాడీ రికార్డులను కూడా మంత్రి పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఎలాంటి లోటుపాట్లు జరిగినా చర్యలు తప్పవన్నారు. మంత్రి వెంట టీడీపీ నేతలు రామ్మూర్తినాయుడు, రంగయ్య, స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు, మండల ప్రధానకార్యదర్శి పేపర్ శీనా, గుర్రం శీనా తదితరులు పాల్గొన్నారు.



కోడిగుడ్లను పరిశీలిస్తున్న మంత్రి సునీత, తిరుమల దేవరగుడిలో పూజలు చేయిస్తున్న దృశ్యం

మోడల్ వాటర్‌ప్లాంట్ పరిశీలన: మండల కేంద్రమైన రామగిరిలో మోడల్ వాటర్‌ప్లాంట్‌ను మంత్రి పరిటాల సునీత శనివారం పరిశీలించారు. ప్లాంట్‌ను ప్రారంభించి ఏడాది కావస్తుండటంతో దాని నిర్వహణ గురించి మంత్రి ఆరా తీశారు. ప్లాంట్‌కు వెళ్లి పరిస్థితులను, నీరు నాణ్యతను పరిశీలించారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా కాయిన్ వేస్తే 20 లీటర్ల నీరు వచ్చేలా ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. వాటర్‌ప్లాంట్ నిర్వహణపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంత నగదు వస్తోంది, ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటున్నారని కూడా విచారించారు. మంత్రి వెంట తహసీల్దార్ ఆదినారాయణ, ఎంపీడీఓ పూలనరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జనార్ధన, స్థానిక నేతలు పాల్గొన్నారు.

తిరుమల దేవర ఆలయంలో ప్రత్యేక పూజలు

మండలంలోని నసనకోట సమీపంలో గల తిరుమల దేవర ఆలయంలో స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత శనివారం ప్రత్యేకంగా పూజలు చేయించారు. శ్రావణమాస చివరి శనివారంరోజున మంత్రి తన కుటుంబ సభ్యులు, స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఆలయంలో పూజలు చేయించారు. ఈసందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఈసందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. వర్షాలు పడాలని, విశ్వశాంతి కోరుతూ పూజలు చేయించారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయం లో కూడా పూజలు చేయించారు. శ్రావణశనివారం తిరుమలదేవుడికి ప్రత్యేకంగా మొక్కులు తీర్చుకుంటే శుభాలు జరుగుతాయని భక్తుల నమ్మకం. మంత్రి వెంట స్థానిక టీడీపీ నేతలు రామ్మూర్తినాయుడు, రంగయ్య తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి చిరుధాన్యాల పంపిణీ

రామగిరి: వేరుశనగసాగుకు సమయం దాటిపోవడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు వందశాతం సబ్సిడీతో రైతులకు అందించడానికి ఏర్పాట్లు చేపట్టిందని ఏఓ ఉదయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న మంత్రి పరిటాల సునీత పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉలవలు, కొర్రలు, సజ్జలు, అలసందలు, కందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో రైతుకు వీటిలో ఏదేని ఒకరకం మాత్రమే అందించడం జరుగుతుందన్నారు. ఉలవలు 25 కిలోలు, కొర్రలు, పెసలు 4 కిలోల చొప్పున, అలసందలు 10 కిలోలు, కందులు 4 కిలోలు అందిస్తామన్నారు. రైతులు వారి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో వచ్చి విత్తనాలు పొందవచ్చన్నారు. వేరుశనగను సాగు చేసిన రైతులకు ఈ విత్తన పంపిణీ జరగదన్నారు.

అనంతపురం సప్తగిరిసర్కిల్: మండలం పరిధిలోని వేరుశెనగ, కంది సాగుచేయని రైతులకు ఈ-క్రాపింగ్ ద్వారా ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి వాసుప్రకాశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో విత్తనాలు సరఫరా జరుగుతుందన్నారు. 21న ఆలమూరు, కాటిగానికాల్వ, కక్కలపల్లి, 22న కొడిమి, రాచానపల్లి, తాటిచెర్ల, నారాయణపురం, సోములదొడ్డి, 23న కురుగుంట, కామారుపల్లి, సజ్జలకాల్వ, కందుకూరు, జంగాలపల్లి, గొళ్లపల్లి, 24న ఉప్పరపల్లి, ఇటుకలపల్లి, చియ్యేడు, మన్నీల గ్రామాల రైతులకు విత్తనాలు పంపిణీ జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల రైతులు సంబంధిత రోజుల్లో వచ్చి విత్తనాలు తీసుకెళ్లాలన్నారు.

చిరుధాన్యాల పంపిణీ

ఆత్మకూరు: మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం రైతులకు ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలు ఎంపీపీ మారెక్క, వైస్ ఎంపీపీ ప్రతాప్ పంపిణీ చేశారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్‌తో రైతులకు ఉచితంగా పెసలు, అలసందలు, ఉలవలు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు పద్మావతి, భాస్కర్‌నాయక్, టీడీపీ నాయకులు, ప్రధాన కార్యదర్శి శశాంక చౌదరి ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకదరయ్య స్వామికి ప్రత్యేక పూజలు

మరూరు (రాప్తాడు): మండలంలోని మరూరు గ్రామంలో గల చిన్నకదరయ్య స్వామికి శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. పూజా దినోత్సవం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పలురకాల పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో పలుగ్రామాల భజన బృందాలచే భజనలు చేయించారు.

నిరుపేద విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యం

కనగానపల్లి: నిరుపేద విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డు కాకూడదని, వారిని ఆదుకోవడమే లక్ష్యమని సహాయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు గడ్డం ముత్యాలప్ప పేర్కొన్నారు. మండలంలోని బద్దలాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు నిరుపేద బాలబాలికలకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అనాథ, పేదవిద్యార్థులను ప్రతి ఏటా గుర్తించి దుస్తులు, స్కూల్‌బ్యాగులు, నోట్‌పుస్తకాలు, పెన్నులు, పలకలు, ప్లేట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా బాగా చదువుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కేవీ సుందరం, నరేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'20 నిమిషాల్లో ఈ-పాసుపుస్తకం'

రాప్తాడు: కేవలం 20 నిమిషాల్లోనే రైతులకు మీసేవా కేంద్రాల్లో ఈ-పాస్ పుస్తకం అందజేస్తామని మీసేవా నిర్వాహకుడు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం రాప్తాడు మీసేవా కేంద్రంలో పుల్లలరేవుకు చెందిన సాయి, రాజేంద్ర అను ఇద్దరు రైతులకు 20 నిమిషాలలోనే ఈ-పాసు పుస్తకం అందజేశామన్నారు. ప్రభుత్వం ఇటీవలే చేపట్టిన నూతన పద్ధతి ప్రకారం రైతు ఆధార్, ఫోన్‌నెంబర్, 1-బీ నెంబర్‌ను ఇస్తే తక్కువ సమయంలోనే రైతు ఫొటో, పూర్తి వివరాలు కలిగిన పత్రం అందిస్తామన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు ఫొటో భూ వివరాలు కలిగిన పత్రాన్ని అన్ని బ్యాంకులు, కార్యాలయాల్లో పాసుపుస్తకంగానే పరిగణిస్తారన్నారు. రైతులు కేవలం 25 రూపాయలు మాత్రమే చెల్లించాలన్నారు. కావాల్సిన రైతులందరూ మీసేవా కేంద్రాల్లో ఈ పాసుపుస్తకాలను తక్కువ సమయంలోనే పొందవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు సాయి, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం నోట్ పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. రోటరీక్లబ్, యువర్స్‌ఫౌండేషన్ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించింది. మొత్తం 40 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, బ్యాగులను అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల అభివృద్ధి కోసం తమవంతు చేయూతనందిస్తున్నట్టు వారు తెలిపారు. ముఖ్య అతిథి ఎంఈఓ రాజశేఖర్ మాట్లాడుతూ...రోటరీక్లబ్, యువర్స్‌ఫౌండేషన్ వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమవంతుగా పిల్లలకు మెటీరియల్స్ అందించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, పోలా ప్రభాకర్, కార్యదర్శి రంగనాథ్, కోటేశ్వర, శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం మారెప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'దోమలు వృద్ధి చెందకుండా డ్రైడే పాటించండి'

అనంతపురం సప్తగిరిసర్కిల్: దోమలు వృద్ధి చెందకుండా వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలని డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. శనివారం అనంతపురం రూరల్ మండలం పరిధిలోని చంద్రబాబు కొట్టాలలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి ఇళ్లలో నిల్వఉన్న నీటిని పరిశీలించారు. కాలనీలో నీటి ఎద్దడి కారణంగా తొట్లెల్లో దుమ్ము, ధూళి ఉండటంతో దోమ లార్వా అధికంగా ఉన్నాయన్నారు. అనంతరం కాలనీలో డెంగీ సోకిన కేషియన్ అనే చిన్నారిని చూశారు. కాలువల్లో మురికినీరు పేరుకుపోవడం వలన దోమలు మరింత ఎక్కువయ్యాయన్నారు. ఈ విషయాన్ని సర్పంచ్‌కు, పంచాయతీ అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సంస్థకు మంచిపేరు తేవాలి: కమిషనర్

అనంతపురం కార్పొరేషన్ : ప్రతి ఒక్కరూ బాగా పనిచేసి నగరపాలక సంస్థకు మంచి పేరు తేవాలని కమిషనర్ మూర్తి పేర్కొన్నారు. ఈనెల 15న ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్న నగరపాలక సంస్థ డ్రాఫ్ట్‌మ్యాన్ కృష్ణారావును శనివారం కాంట్రాక్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యాలయ ఆవరణలో ఆయన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కమిషనర్ మాట్లాడుతూ... ఆయన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ నాగమోహన్, ఈఈలు రామ్మోహన్‌రెడ్డి, నారాయణ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా రామయ్యతాత విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లి క్రైవారం అమర నారేయణ స్వామితాత ఆశ్రమంలో శనివారం రామయ్యతాత విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. క్రైవారం క్షేత్ర ధర్మాధికారి జయరాం, బసంపల్లి గ్రామస్థుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు జరిగాయి. రెండవరోజు తెల్లవారుజామున రామయ్యతాత విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. 7 గంటలకు నవగ్రహ, లక్ష్మీ నారాయణహోమం, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. 10 గంటల నుంచి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమాల్లో ఆశ్రమ కమిటీ సభ్యులు బళ్లారి ఆదినారాయణ, గవ్వల ఆదినారాయణ, నామాల శ్రీనివాసులు, జింకా రాజేంద్రప్రసాద్, ఓబిలేశు, బయన్న, వెంకటరాముడు పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన రామయ్య తాత విగ్రహం

నేటి నుంచి రామ్‌నగర్‌లోనూ విజయపాలు అమ్మకం

రాప్తాడు: ప్రభుత్వ డెయిరీ విజయ పాలు అనంతపురం నగరంలోని రామ్‌నగర్‌లోనూ పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వ డెయిరీ డీడీ ఎం శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలతోపాటూ రామ్‌నగర్‌లోని దన్నీ హోండా షోరూం దగ్గర ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ డెయిరీ సిబ్బంది మురళి అందుబాటులో ఉంటూ విజయపాల ప్యాకెట్లను విక్రయిస్తారన్నారు. పాల ప్యాకెట్లు కావాల్సిన వారు 9704462706 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిరుపయోగంగా ఉన్న బోరుబావులను పూడ్చివేయండి

ఆత్మకూరు: మండలంలో నిరుపయోగంగా ఉన్న బోరుబావులను పూడ్చివేయాలని శనివారం మండల ఇన్‌చార్జ్ , తహసీల్దార్ భూషణం పేర్కొన్నారు. మండలంలో గ్రామపంచాయతీల్లో సంబంధిత రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు పరిశీలించి వెంటనే వాటిని పూడ్చివేయాలని ఆదేశించారు. గ్రామాల్లో విచారించి ఎక్కడెక్కడ బోరుబావులున్నాయని గుర్తించి అవసరం లేనివాటిని ప్రమాదాలకు కారణం కాకుండా వాటిని పూడ్చివేయాలన్నారు.

సబ్సిడీ రుణాలకు ప్రశాంతంగా ఇంటర్వ్యూలు

ఆత్మకూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సబ్సిడీ రుణాలకోసం ఇంటర్వ్యూలు ప్రశాంతంగా జరిగాయి. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు మంజూరుకు సర్టిఫికెట్లను పరిశీలించినట్లు ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. మండలానికి 163 యూనిట్లు మంజూరు కాగా 1300 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కొందరు సర్టిఫికెట్లు సరిగా లేనందున వాటిని తొలగించినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

రాప్తాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో నాగులచవితి పండుగ వైభవంగా జరిపారు. శ్రావణ శనివారం మహిళలు ఉపవాస దీక్షలతో శివాలయాలు, నాగుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు. పుట్టల్లో పాలుపోసి ప్రజలకు ప్రసాదాలు పంచిపెట్టి ఉపవాస దీక్ష విడిచారు.

రైతులకు జిప్సం పంపిణీ

ఆత్మకూరు: మండల కేంద్రంలో సివిల్ సప్లయ్ గోడౌన్‌లో శనివారం రైతులకు ఎంపీపీ మారెక్క, జడ్పీటీసీ కుళ్లాయప్ప ఉచితంగా జిప్సం పంపిణీ చేశారు. వేరుశనగ దిగుబడికి జిప్సం ఎంతో బాగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు

రేపు ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ

గార్లదిన్నె: మండలంలో సోమవారం నుంచి రైతులకు ప్రత్నామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాధారం కింద ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసుకునేందుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా అందచేస్తోందన్నారు. మండలానికి పెసులు 150 క్వింటాళ్లు, జొన్నలు 50 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయన్నారు. కొర్రలు, సజ్జలు, తదితర విత్తనాలు రావాల్సి ఉందన్నారు. త్వరలోనే ఆ విత్తనాలు వస్తాయని తెలిపారు. సోమవారం నుంచి జొన్నలు, పెసులు పంపిణీ చేస్తామన్నారు.

28 నుంచి బ్యాంకు రుణాలకు ఇంటర్వ్యూలు

నార్పల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 28, 29వ తేదీల్లో ఎస్సీ, బీసీ మైనార్టీ, కాపు రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు శనివారం ఎంపీడీఓ జయచంద్రారెడ్డి తెలిపారు. 28న బీపప్పూరు, గూగూడు, వెంకటాంపల్లి, చియ్యేడు గ్రామాల పరిధిలోని లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 29న నార్పల స్టేట్‌బ్యాంక్, గ్రామీణ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్ పరిధిలోని లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే అర్హులన్నారు.

శింగనమలలో : మండలంలో సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు 23,24 తేదీల్లో ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ జయరాం తెలిపారు. 23న తరిమెల, గార్లదిన్నె, కల్లూరు బ్యాంకుల పరిధిలోని లబ్ధిదారులకు, 24న శింగనమల, సలకంచెరువు, వెంకటాంపల్లి బ్యాంకుల పరిధిలోని లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

12,206 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్

నార్పల: మండలంలో 12,508 మందికి 12,206 మంది పిల్లలకు మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ వేశామని మండల వైద్యాధికారి పుష్పలత తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక వైద్యశాలలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు వ్యాక్సిన్ వేశామన్నారు. మిగిలిన పిల్లలకు ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ వేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వంద శాతం పూర్తికావాలి

నార్పల: గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం వందశాతం పూర్తి కావాలని ఈఓఆర్డీ సాల్మన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కింద మండలంలోని ఏడు గ్రామ పంచాయతీల్లో 1899 మరుగుదొడ్లు మంజూరు అయ్యాయని వాటిని వెంటనే పూర్తిచేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పాఠశాల గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలని

గార్లదిన్నె: మండలంలోని అన్ని పాఠశాలల్లో వంటగ్యాస్‌ను తప్పని సరిగా తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి చంద్రానాయక్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం చేసే పాఠశాలల్లో కట్టెలపొయ్యి మీద చేయకుండా గ్యాస్‌స్టౌ మీద చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. మండలంలో ఉన్న పాఠశాలల్లో వంటగ్యాసు తీసుకోవాలన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

నార్పల: మండలంలో శనివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. బొందలవాడ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం బోల్తాపడి కేశేపల్లి పెద్దన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దన్న నార్పల దూల్‌పేట్ సర్కిల్‌లో కిరాణా షాపు పెట్టుకుని జీవనం సాగించేవాడు. సరుకులు తీసుకురావడం కోసం నార్పల నుంచి బత్తలపల్లికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

మినీవ్యాన్, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు : మండలంలోని నడిమిదొడ్డి గ్రామ సమీపంలో శనివారం రాత్రి మినీవ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కొత్తచెరువు మండలంలోని సీసీ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ధనుంజయ, షాకీర్ తమ ద్విచక్ర వాహనంపై శింగనమలలో జరుగుతున్న పెళ్లికి వస్తుండగా తాడిపత్రి నుంచి ధర్మవరం వెళ్తున్న మినీవ్యాన్ అతివేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఇద్దరూ గాయపడ్డారు. వారిని 108 ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ధనుంజయ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీనిపై ఎస్ఐ రాంప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

అనంతపురం సెంట్రల్: అగ్రిప్రమాదాలు సంభవించినప్పుడు మం టలుఅదుపు చేయడం ఎలా అన్న దానిపై స్టేషన్ ఫైర్ అధికారి లింగమయ్య ఎస్ఎన్ డెంటల్ క్లినిక్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన చర్యల్లో భాగంగా శనివారం సాయినగర్‌లోని ఎన్ఎన్ దంత వైద్యశాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. పలు రకాల విన్యాసాలు చేసి అగ్నిప్రమాదాల నివారణపై చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

'హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయాల్సిందే'


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పుల్లారెడ్డి

బుక్కరాయసముద్రం: తుంగభద్ర డ్యాం నుంచి ఈ ఏడాది హెచ్చెల్సీ కాలువకు నీటిని విడుదల చేసేవాటాలో ఈ ఏడాది శింగనమల నియోజకవర్గంలోని హెచ్చెల్సీ ఆయకట్టు భూమికి సాగునీరు విడుదల చేయాలని హెచ్చెల్సీ కాలువ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ పుల్లారెడ్డి, కాలువ కమిటీ అధ్యక్షుడు కోరారు. శనివారం అనంతపురంలోని హెచ్చెల్సీ కార్యాలయం వద్ద ఉన్న డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కార్యాలయంలో హెచ్చెల్సీ కాలువకు సాగునీరు విడుదలపై సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి చైర్మన్‌తో పాటు 1 నుంచి 29 డిస్ట్రిబ్యూటరీ కాలవ కమిటీ అధ్యక్షులు, మెంబర్లు హాజరయ్యారు. 22వ తేదీన హెచ్చెల్సీ నీటి కేటాయింపులపై ఐఏబీ (ఇరిగేషన్ అడ్వైజర్ బోర్) కమిటీ సమావేశం జరుగనున్న నేపథ్యంలో శింగనమల నియోజకవర్గం సాగునీరు విడదలపై ప్రధానంగా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఇప్పటికే సాగునీరు విడుదల చేయాలని మంత్రి దేవినేని ఉపామహేశ్వరరావు దృష్టికి స్థానిక ఎమ్మెల్యే యామినీబాల, ఎమ్మెల్సీ శమంత కమణి తీసుకెళ్లారన్నారు. 22న జరిగే సమావేశంలో తప్పనిసరిగా సాగునీరు విడుదల చేసేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఏడాది రబీ సీజన్ లో 36 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


కృష్ణాపురంలో డ్రమ్ములను శుభ్రం చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గార్లదిన్నె: డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ నాగరాజు ప్రజలకు సూచించారు. శనివారం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ అధికారులు గ్రామంలో పర్యటించారు. అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అపశుభ్రత ఉంటే దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలు బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం డ్రమ్ముల్లో ఉన్న నీటిని పారవేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు ప్రకాష్, నాగరత్నమ్మ,శివానంద, ధనుంజయ, జయంతి పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు రూ.5వేలు పింఛను ఇవ్వాలి

పుట్లూరు : కరువుతో అల్లాడుతున్న రైతు కుటుంబాలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రూ.5వేల పింఛను ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కార్యదర్శి రామాంజి, రైతుసంఘం నాయకుడు సూరి మాట్లాడుతూ ప్రభుత్వాలు ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు రైతులకు చేసేందేమీ లేదన్నారు. పంటలు పండక అప్పులపాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మరోవైపు ఎరువులు, విత్తనాల ధరలు పెంచుతూ రైతులతో ఆటలాడుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలగురయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఘనంగా శ్రావణ శనివార పూజలు

యల్లనూరు : మండలంలో శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని పలు ఆంజనేయస్వామి దేవాలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. యల్లనూరు ఆంజనేయస్వామి దేవాలయంలో ఉదయం ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లాకు చెందిన భక్తులు పా ల్గొన్నారు. చిలమకూరు ఆంజనేయస్వామి దేవాలయంలో ఆ కుపూజ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

శింగనమలలో : శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకుని శింగనమల చెరువుకట్ట వద్ద వెలసిన దుర్గాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచి అభిషేకాలు, హోమాలు, ఆకుపూజలు, ప్రత్యేక అలంకర ణ చేశారు. వందలాది మంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం గ్రామపెద్దల ఆధ్వర్యంలో అన్నదానం చేశా రు. సిరిదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో పెద్దఎత్తున ఊరేగింపు చేశారు.

గంపమలయ్యకు ప్రత్యేక పూజలు : మండలంలోని 7 కొండల మధ్య వెలసిన గంపమలయ్య స్వామి ఆలయంలో శ్రావణ శనివారం భక్తులతో కిటకిటలాడింది. మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారి గుహలోకి పూజారి వెళ్లి పూజలు చేశారు.


అలంకరణలో స్వామివారు

చేతిపంపు మరమ్మతు చేయించండి

గార్లదిన్నె: మండల పరిధిలోని ఇల్లూరు ప్రాథమిక పాఠశాలలో ఉన్న చేతిపంపును మరమ్మతు చేయించాలని శనివారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునేనాయక్ ఎంపీడీఓకు విన్నవించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మూడు రోజుల నుంచి చేతిపంపు చెడిపోయిందన్నారు. విద్యార్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకు స్పందించిన ఎంపీడీఓ భాస్కర్‌రెడ్డి పాఠశాలలో చేతిపంపు మరమ్మతులు వెంటనే చేయిస్తామని హామీ ఇచ్చారు.

కోతి సమాధి వద్ద అన్నదానం

యల్లనూరు : మండలకేంద్రంలోని వెనకయ్యకాలువ రోడ్డులో ఉన్న కోతిసమాధి వద్ద శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం కోతి సమాధికి పూజలు జరిపి 10 గంటల నుంచి అన్నదానం చేశారు. శ్రావణ మాసం చివరి శనివారం రోజు ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గోపాల్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలి


కళాశాలలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ తదితరులు

శింగనమల: విద్యార్థులందరూ విరివిగా మొక్కలునాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ రమాదేవి కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మనం-వనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు ప్రతిరోజూ నీరు పోస్తూ కాపాడాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి శివరాం, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎన్ఐఓఎస్ పరీక్షలు

శింగనమల: మండలంలో 370 మందికి సాక్షరభారత్ ఆధ్వర్యంలో ఎన్ఐఓఎస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల కో-ఆర్డినేటర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం మూడవ తరగతికి చెందిన వారికి పరీక్ష నిర్వహిస్తామన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి ఆర్థిక సహాయం


హెచ్‌ఎంకు నగదును అందచేస్తున్న పూర్వ విద్యార్థి

గార్లదిన్నె: తాను చదివిన పాఠశాలకు సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నాడు ఓ పూర్వవిద్యార్థి. మండల పరిదిలోని మర్తాడు గ్రామానికి చెందిన యల్లారెడ్డి స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. 2004-05లో పది ఉత్తీర్ణుడయ్యాడు. ప్రస్తుతం పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తాను చదువుకున్న పాఠశాలకు తనవంతు సాయంగా గ్యాస్ క నెక్షన్ కోసం రూ. 2500 పాఠశాల ప్ర ధానోపాధ్యాయురా లు వాణిదేవికి శనివారం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్‌రె డ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

104 వైద్యశిబిరం

పుట్లూరు : మండలంలోని కొండుగారికుంటలో శనివారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఆస్తమా తదితర జబ్బులతో బాధపడుతున్న రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణీలు, బాలింతలకు పలు సూచనలు ఇచ్చారు. 70మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, 104సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కర్రలతో దాడి

తాడిపత్రిరూరల్ : మండలంలోని కోమలి గ్రామంలో కులశేఖర్‌రెడ్డిపై రవి, రామచంద్ర కర్రలతో దాడిచేసి గాయపరిచారని శనివారం ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. గ్రామంలో బస్సు కోసం ఎదురుచూస్తున్న స్కూల్‌పిల్లలను రవి, రామచంద్ర వెకిలిచేష్టలు చేయడమే కాకుండా వారిపై చిన్నరాళ్లతో ఈవ్‌టీజింగ్ చేశారు. ఈ విషయాన్ని తండ్రి కులశేఖర్‌రెడ్డికి పిల్లలు తెలిపారు. ఆగ్రహంతో రవి, రామచంద్రలను కులశేఖర్‌రెడ్డి దండించాడు. తమనే దండిస్తావా అని కులశేఖర్‌రెడ్డిపై వారు కర్రలతో దాడికి దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ, సిబ్బంది కోమలి గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ముందుజాగ్రత్తగా గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఇటుకలకు జీఎస్టీ దెబ్బ!

● భారీగా పెరిగిన ధరలు
● గృహ నిర్మాణాలకు ఆటంకం
● నాసిరకం తయారు చేస్తున్న వైనం

తాడిపత్రి : ఫ్లైయాష్ ఇటుకలకు జీఎస్టీ దెబ్బ పడింది. దీనికారణంగా ధరలు గణనీయంగా పెరిగాయి. పెరిగిన ధరలు గృహనిర్మాణానికి దెబ్బకొడుతోంది. ఇప్పటికే పెరిగిన సిమెంటు ధరలతో కుదేలవుతున్న నిర్మాణరంగం ఇటుకల ధరలతో మరింత దెబ్బతింటోంది. జీఎస్టీ పుణ్యమాని ఒక్కో ఫ్లయాష్ ఇటుక రూ.3.15 నుంచి రూ.3.50 వరకు పలుకుతోంది. జీఎస్టీకి ముందు ఒక్కో ఫ్లైయాష్ ఇటుక రూ.2.80 నుంచి రూ.3 లోపు ఉండేవి. గతంలో ఫ్లైయాష్ ఇటుకల తయారీకి పెద్దగా పన్ను లేకపోవడంతో సామాన్యులకు అందుబాటులో ఇటుకల ధరలు ఉండేవి. జీఎస్టీ దెబ్బకు పెరిగిన ధరలతో వినియోగదారులు కుంగిపోతున్నారు. తాడిపత్రి ప్రాంతంలో భారీగా ఫ్లైయాష్ ఇటుకలు తయారవుతున్నాయి. పట్టణంలోని కడపరోడ్డు, యల్లనూరు రోడ్డు, చుక్కలూరు సర్కిల్, నందలపాడు తదితర ప్రాంతాల్లో సిమెంటు ఇటుకల ఫ్యాక్టరీలు ఉన్నాయి. గతంలో ఒకటి రెండు మాత్రమే ఉండేవి. కానీ ఇటుకలో తయారీలో లాభాలుండడంతో పలుచోట్ల స్థలాలు తీసుకొని అనేకమంది ఫ్యాక్టరీలు నడుపుతున్నారు.


అమ్మకానికి ఉంచిన ఇటుకలు

ప్రతి నిర్మాణానికి ఫ్లైయాష్ ఇటుకలు తప్పనిసరి : తాడిపత్రి పట్టణ, రూరల్‌ప్రాంతాల్లో జరుగుతున్న ప్రతి నిర్మాణానికి తప్పనిసరిగా ఇటుకలు ఉపయోగిస్తున్నారు. ఇళ్లనిర్మాణంతో పాటు కాంపౌండు వాల్స్, షెడ్లు తదితర వాటికి ఇటుకలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ రంగంలో భారీగా ఫ్లైయాష్ ఇటుకలను ఉపయోగిస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం వరకు నిర్మాణ రంగానికి మట్టితో తయారుచేసిన ఇటుకలను ఉపయోగించేవారు. అప్పట్లో పలుచోట్ల మట్టి ఇటుకల తయారీ ఫ్యాక్టరీలుండేవి. సిమెంటు ఇటుకల తయారీ ఫ్యాక్టరీలు రావడంలో మట్టి ఇటుకలు ఆదరణ కోల్పోయాయి. చివరకు కొనేవారు తక్కువ కావడంతో అవి అంతరించిపోయాయి. ఐదేళ్ల క్రితం వరకు సిమెంటు ఇటుకల తయారీ రాజ్యమేలింది. అప్పట్లో బస్తా సిమెంటు ధర రూ.90 ఉండేది. రానురాను ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం రూ.370 వరకు ధరలు ఉంటున్నాయి. భారీగా పెరిగిన సిమెంటు ధరలతో ఇటుకల తయారీ చేయడం నష్టాలతో కూడుకున్నదన్న ఆలోచనతో నిర్వాహకులు ఫ్లైయాష్ ఇటుకల తయారీపై దృష్టిపెట్టారు. ప్రస్తుతం సిమెంటు ఇటుకల తయారీ స్థానంలో వీటి తయారీ ఊపందుకుంది.

థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి ఫ్లైయాష్ : ఇటుకల్లో వాడే ఫ్లైయాష్ కడప జిల్లా ముద్దనూరు వద్దనున్న థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి రవాణా అవుతోంది. థర్మల్ విద్యుత్తు తయారీలో బొగ్గు ఉపయోగిస్తారు. ఉపయోగించిన బొగ్గు ఫ్లైయాష్ రూపంలో బయటకు వస్తుంది. ఇది ఎందుకూ పనికిరాకపోవడంతో గుట్టలుగుట్టలుగా ఉంటోంది. దీన్ని ఇటుకల ఫ్యాక్టరీల యజమానులు రవాణా చేసుకుంటున్నారు. గతంలో ఎలాంటి అనుమతులు లేకున్నా ఉచితంగా ఇచ్చేవారు. కానీ జీఎస్టీ వల్ల ఫ్యాక్టరీ యజమానులు తప్పనిసరిగా కరెంటు బిల్లులు, అమ్మకాలు, తయారీలకు సంబంధించిన బిల్లులు సబ్‌మిట్ చేసిన తర్వాత థర్మల్ అధికారులు ఫ్లైయాష్‌ను నిర్వాహకులకు ఇస్తున్నారు. వీటిని సబ్‌మిట్ చేయడం వల్ల జీఎస్టీ పడుతోంది.

లోకల్ గైడ్

localguide



తాడిపత్రి మార్కెట్‌లో కూరగాయల ధరలు

పచ్చి మిరపకాయలు-రూ.30, టమోట-30, ఉల్లిగడ్డలు-40, ఉర్లగడ్డలు-15, అంకుర వంకాయలు- 30, ముల్లంకాయలు: 40, చిక్కుడుకాయలు-30, మొటిక్కాయలు- 24, బెండకాయలు-24, బీరకాయలు-20, కాకరకాయలు-24, క్యారెట్-40, క్యాబేజీ-20, క్యాలీఫ్లవర్-35, బీట్ రూట్- 25, దోసకాయలు:20, ముల్లంగి : 20, బీన్సు - రూ.50.

తాడిపత్రి సినిమాలు

బీహెచ్ మహల్ : బాహుబలి-2 (సెల్ ఫోన్ :085582227 72), లక్ష్మీనారాయణ : జయ జానకీ నాయక (సెల్‌ఫోన్: 9848957005), విజయలక్ష్మి: లై (సెల్‌ఫోన్: 08558-223078), వరలక్ష్మి: నేనే రాజు నేనే మంత్రి (సెల్‌ఫోన్:08558-223078), జయలక్ష్మి: ఫిదా (సెల్‌ఫోన్: 08558- 223078), సాయితేజ: గౌతమ్‌నందా (సెల్‌ఫోన్: 08558 -221100), దాదా: ఆనందబ్రహ్మ

యాడికి: లక్ష్మీప్రియ: నక్షత్రం (సెల్‌ఫోన్: 90592 90284)

మాంసం ధరలు

చికెన్ (కేజీ) : రూ.140, స్కిన్‌లెస్ చికెన్ : 160, మటన్ : 440, చేప: 120, గుడ్లు (100) : రూ.410

గ్యాస్ సమాచారం

అందుబాటులో ఉన్న సిలిండర్లు
ఇండియన్ : 355 హెచ్‌పీ గ్యాస్ : 340

ఎమ్మెల్యే డైరీ

తాడిపత్రి : ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రజలకు అందుబాటులో ఉంటారు.

ఆటో బోల్తా : ఒకరికి గాయాలు

యాడికి : మండలకేంద్రంలోని కోన రోడ్డులో శనివారం ఆటో బోల్తాపడి మధు(17) అనే యువకుడు గాయపడ్డాడు. కోనుప్పలపాడు గ్రామానికి చెందిన మధు తాడిపత్రిలో ఇంటర్ చదువుతున్నాడు. కాలేజికి వెళ్లేందుకు స్వగ్రామం నుంచి ఆటోలో యాడికి వస్తుండగా ఆటోకు అడ్డంగా పంది రావడంతో డ్రైవర్ ఉన్నఫళంగా పక్కకు తిప్పడంతో అదుపు తప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న మధు గాయపడగా, అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం 108ద్వారా తాడిపత్రికి తరలించారు. ఎస్‌ఐ కత్తిశ్రీనివాసులు గాయపడ్డ మధు నుంచి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.


గాయపడ్డ మధుతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

తాడిపత్రిటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడి మూడేళ్లు దాటినా రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలో వస్తే రైతులకు, దేశానికి మంచిరోజులు వస్తాయని నమ్మించారన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకు రైతులు పెట్టిన పెట్టుబడి కంటే 50శాతం అదనంగా గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. నిరుద్యోగులకు 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేటికీ వందల సంఖ్యలో కూడా ఇవ్వలేదన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేస్తే తప్ప కరువును నివారించడానికి మరోమార్గం లేదన్నారు. తుంగభద్ర ప్రాజెక్టును ఆధునికీకరించాలన్నారు. రైతులకు మద్ధతు ధర కల్పిస్తూ చట్టాలు తేవాలన్నారు. పశువుల క్రయవిక్రయాలపై ఆంక్షలు రద్దుచేయాలన్నారు. ఆహారభద్రతకు నష్టం చేసే విదేశీ ఒప్పందాలు రద్దుచేయాలన్నారు. రైతు కుటుంబాలకు రూ.5వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీయం డివిజన్ కార్యదర్శి ఈరేష్, సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, కేశప్ప, నరసింహారెడ్డి, బషీర్, చౌడయ్య, ఉమాగౌడ్, దస్తగిరి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్

పరిసరాల పరిశుభ్రత-ఆరోగ్యానికి భద్రత

పెద్దవడుగూరు : మండలంలోని కిష్టిపాడు, బందార్లపల్లి, మేడిమాకులపల్లి గ్రామాల్లో కిష్టిపాడు వైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి, ఆరోగ్యసిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో దోమ కుట్టరాదు.. కుట్టకూడదు అంటూ నినాదాలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఇంటింటా తిరిగి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామంలో ఉన్న మురుగు కాలువల్లో మందులు పిచికారి చేశారు. ప్రజలు వారానికోసారి డ్రైడే పాటించి దోమలబారిన పడకుండా నిద్రించే సమయంలో దోమతెరలు వాడాలన్నారు. పీ కొట్టాలపల్లి గ్రామంలో డాక్టర్ వెంకటరమణారెడ్డి వైద్యశిబిరం నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, ఎంపీహెచ్ఓ మక్బూల్, ఏఎన్ఎం రేణుకాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

తాడిపత్రిలో ఓ మోస్తరు వర్షం


పట్టణంలో కురుస్తున్న వర్షం

తాడిపత్రిటౌన్ : పట్టణంలోని శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం మబ్బులు పట్టి ఉంది. మధ్యాహ్నం కొద్దిసేపు వర్షం కురిసింది. అప్పటి నుంచి అడపా దడపా వర్షం కురిసింది.

నెలగొండరాయుడికి ప్రత్యేక పూజలు

పెద్దవడుగూరు : మండలకేంద్రంలోని నల్లగుట్టపై వెలసిన నెలగొండరాయుడికి శనివారం గ్రామప్రజలు ప్రత్యేకపూజలు చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. వచ్చిన భక్తాదులకు అన్నదానం చేశారు.

నేడు హ్యాపీ సండే

తాడిపత్రిటౌన్ : పట్టణంలోని అశోక్‌పిల్లర్ సర్కిల్ వద్ద సోమవారం హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శివరామక్రిష్ణ తెలిపారు. ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి కార్యక్రమానికి హాజరవుతారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లతో పాటు వార్డుసభ్యులు, కోఆప్షన్ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కమిషనర్ కోరారు.

విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన

పెద్దపప్పూరు : మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం మండల న్యాయసేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప మొక్కల పెంపకంవల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. చెట్ల పెంపకం వల్ల పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, తద్వారా మానవ మనుగడకు ముప్పు ఉండదన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

తాడిపత్రిరూరల్‌లో : మండలంలోని అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమ ఆవరణలో శనివారం యూనిట్ హెడ్ మురళీక్రిష్ణ ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమలోని మైన్స్, ఫ్యాక్టరీ, కాలనీ, స్కూల్ ప్రాంతాల్లో 1000 మొక్కలు నాటారు. అలాగే కొండప్రాంతంలో మొక్కల విత్తనాలను చల్లారు. కార్యక్రమంలో ఫంక్షనల్ హెడ్స్, డిపార్ట్‌మెంటల్ హెడ్స్, వసుంధర లేడీస్ క్లబ్ సభ్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.





పెద్దవడుగూరు, తాడిపత్రిలో మొక్కలు నాటుతున్న జడ్జి, న్యాయవాదులు, అల్ట్రాటెక్ పరిశ్రమ ఉద్యోగులు

ప్రతి ఇంటి వద్ద వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలి

పెద్దవడుగూరు : మండలంలోని ప్రజలు తమ నివాస గృహాల వద్ద వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఎంపీడీఓ వెంకటాచలపతి సూచించారు. ప్రభుత్వం ఆరుబయలు మలవిసర్జన లేని గ్రామాలుగా తీర్చిదిద్దడంలో భాగంగా మరుగుదొడ్డి నిర్మించుకునేందుకు అవసరమయ్యే వ్యయాన్ని ప్రభుత్వం సమకూరుస్తోందని, ప్రతిఒక్కరు తప్పనిసరిగా మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. ఆయా పంచాయతీల్లో మండలస్థాయి అధికారులను నియమించామని, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోనివారు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

యాడికి : మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామం వద్దనున్న రామాలయంలో శనివారం పెన్నాసిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలకు కల్యాణం జరిపించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కోర్టు క్లర్కు మృతి


వీరప్రతాప్‌రెడ్డి(ఫైల్)

తాడిపత్రిటౌన్ : గుత్తికోర్టులో క్లర్కుగా పనిచేస్తున్న వీర ప్రతాప్‌రెడ్డి(39) స్థానిక నివాసంలో శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఇతను తాడిపత్రి కోర్టులో క్లర్కుగా పనిచేస్తూ గుత్తికి బదిలీ అయ్యాడు. శనివారం ఉదయం ఇంట్లో అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చేలోపు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇతని మృతికి స్థానిక సివిల్‌కోర్టు జడ్జి బుజ్జప్ప, జిల్లా లీగల్ సర్వీస్ చైర్మన్ కరుణాకర్‌రెడ్డితో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుకుమార్, రమేష్‌నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సతీష్, శివరామక్రిష్ణ, శ్రీనివాసులు సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న సీఐడీ, రెవెన్యూ అధికారులు

శింగనమల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను సీఐడీ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. శనివారం సీఐడీ సీఐ క్రిష్ణారెడ్డి, తహసీల్దార్ జీ నాగేంద్ర, రాచేపల్లి, బందార్లపల్లి, చిలేపల్లి గ్రామాల్లో ఉన్న 300 ఎకరాల భూములను పరిశీలించి, ఎవరైనా వీటిని ఆక్రమించారా అన్న కోణంలో విచారించారు. కార్యక్రమంలో సర్వేయర్ వేణుగోపాల్ గుప్తా, వీఆర్‌ఓ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను తక్షణం రద్దు చేయండి
-ఎన్‌ఎంయూ రీజినల్ కార్యదర్శి

అనంతపురం సప్తగిరిసర్కిల్: జిల్లాలో జరుగుతున్న అక్రమ బదిలీలను తక్షణమే రద్దు చేయాలని ఎన్‌ఎంయూ రీజినల్ కార్యదర్శి భాస్కర్‌నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌ఎం చిట్టిబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ.... రీజియన్‌లో అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో సర్వీసును కుదిస్తున్నారన్నారు. నష్టాలకు కారణాలు తెలుసుకోకుండా నష్టాల పేరుతో బస్సుసర్వీసులను తగ్గించడం దారుణమన్నారు. 15 నుంచి 20 సంవత్సరాల సర్వీసు ఉన్న కార్మికులను జూనియర్‌లుగా బదిలీ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారన్నారు. ఇతర డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్లు ఎక్సెస్ ఉన్నా.... వారిని బదిలీ చేయకుండా సర్వీసులు రద్దు చేసి ఎక్సెస్ పేరుతో బదిలీ చేయడం అన్యాయమన్నారు. జూనియర్‌లుగా బదిలీ చేసిన కార్మికులను తిరిగి మాతృడిపోనందే విధులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలా చేయని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ నాయకులు పుల్లయ్య, నాగరాజు, చలపతి, పరమేష్, ఆచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గర్భిణి, మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయండి : ఎమ్మెల్యే జేసీ

తాడిపత్రిరూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ తనిఖీచేసి నిబంధనల మేరకు పంపిణీ కార్యక్రమాలు జరుగుతున్నాయో లేదో తెలుసుకోవాలని ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని చుక్కలూరు, తలారిచెరువు, వెంకటరెడ్డిపల్లి, చల్లవారిపల్లి గ్రామాల్లో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. చుక్కలూరులో అంగన్‌వాడీ భవనం ప్రారంభం సందర్భంగా స్థానిక మహిళలతో ఎమ్మెల్యే జేసీ మాట్లాడుతూ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి కేంద్రాలకు పౌష్టికాహారంతో పాటు గుడ్లు, తదితరవాటిని సరఫరా చేస్తున్నాయన్నారు. ఇవన్నీ అర్హులైన వారందరికీ అందేవిధంగా చూడాల్సిన బాధ్యత టీచర్లకు ఉందన్నారు. వారిపై పర్యవేక్షణ బాధ్యత స్థానిక మహిళలు తీసుకోవడమే కాకుండా తరచుగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీచేస్తూ లోటుపాట్లను వివరించాలన్నారు. కార్యక్రమానికి తహసీల్దార్ యల్లమ్మ, సీడీపీఓ శశికళ, సర్పంచ్ శారద, గన్నెవారిపల్లి సర్పంచ్ చింబిలి వెంకటరమణ, టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి హాజరయ్యారు.

వాటర్‌షెడ్ పనుల తనిఖీ

యల్లనూరు : మండలకేంద్రంలో జరిగిన వాటర్‌షెడ్ పనులను శనివారం అడిషనల్ పీజీ విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. స్థానిక పాతపేటలో ఉపాధి హామీ పథకం ద్వారా చేయించిన కంప తొలగింపు పనులను పరిశీలించి రూ.6వేల చెక్కు ను అందచేశారు. అనంతరం మీకోసంలో వచ్చిన అర్జీలను పరిశీలించి విచారించారు. ఫారంపాండ్ల పనులతో పాటు పంట సంజీవని గుంతలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పీఓ రాజా, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్ పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న అడిషనల్ పీడీ

పనులను పరిశీలించిన డీఈ : మండలంలోని కోడిమర్రి వద్ద జరుగుతున్న పనులను శనివారం గాలేరు-నగరి సుజల స్రవంతి డీఈ చిన్నక్రిష్ణయ్య పరిశీలించారు. కాలువలో జరుగుతున్న సిమెంటు పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, కంకర కూడా నాణ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జేఈ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

తాడిపత్రిటౌన్ : తమ డిమాండ్లు పరిష్కరించాలని తలాపా జీడీఎస్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం నాలుగోరోజూ కొనసాగింది. మెయిన్ పోస్టాఫీసు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. డిమాండ్లు పరిష్కరించేవరకు సమ్మె ఆపమన్నారు. కార్యక్రమంలో రాజగోపాల్, పద్మనాభరెడ్డి, ఓబులేసు, జయరాం, కేశవరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నాలుగు ఆటోల సీజ్


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ

యాడికి : మండలకేంద్రంలో శనివారం ఎస్ఐ కత్తిశ్రీనివాసులు నాలుగు ఆటోలను సీజ్‌చేశారు. ఆటోడ్రైవర్లు నిబంధనలు అతిక్రమించి అధిక లోడుతో వెళుతున్నందున సీజ్ చేశామన్నారు. అనంతరం ఆటోడ్రైవర్లకు సమావేశం ఏర్పాటుచేసి ఎస్ఐ మాట్లాడుతూ అధికలోడుతో ఆటోలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదాలు జరిగినా అధికలోడుతో ఉంటే బీమా వర్తించదని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


మంటలు చెలరేగుతున్న దృశ్యం

యాడికి : మండలకేంద్రంలోని హైస్కూల్ వద్ద ఆటో టైర్లు నిప్పంటుకొని తృటిలో ప్రమాదం తప్పింది. పంక్చర్ షాపు వెనుక వృథాగా ఉన్న టైర్లను వేసి ఉంచగా ఆకతాయిలు టైర్లకు నిప్పుపెట్టారు. దీంతో బంకుకు నిప్పంటుకుంది. వెంటనే స్థానికులు గమనించి నీళ్లు చల్లి మంటలు ఆర్పడంతో పెద్దప్రమాదం తప్పింది. మంటలు కాస్త ఎక్కువయి ఉంటే పక్కనే ఉన్న ఆయిల్ డ్రమ్ము అంటుకొని చుట్టుప్రక్కల షాపులకు నిప్పంటుకునే ప్రమాదం ఉండేది.

హనుమాన్ ఆలయాల్లో శ్రావణ శనివార పూజలు

తాడిపత్రిటౌన్ : శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నందలపాడు, పుట్లూరురోడ్డు, అశోక్‌పిల్లర్ వద్ద నున్న అభయాంజనేయస్వామి, రైల్వేస్టేషన్, నంద్యాలరోడ్డు, జింకావీధిలోని పంచముఖ ఆంజనేయస్వామి, ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. స్వామివార్లకు విశేష అలంకరణ చేశారు. ఆకుపూజలు, అర్చనలు, మహామంగళహారతి తదితర ప్రత్యేకపూజలు నిర్వహించారు. రూరల్ పరిధిలోని చుక్కలూరు ఆంజనేయస్వామి, ఆలూరు కోనలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. టెంకాయలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.





ప్రత్యేక అలంకరణలో నందలపాడు, పుట్లూరుయడుడ్డ, జింకావారి వీధి, ఏటిగడ్డ ఆంజనేయస్వాములు

సత్యసాయి జ్ఞానమండలి ఆధ్వర్యంలో ఫన్ క్లబ్

ఉరవకొండ: సత్యసాయి జ్ఞాన, వైద్య, యోగా శిక్షణలో భాగంగా శనివారం ఫన్ క్లబ్ నిర్వహించారు. యోగా గురువులు ప్రసాద్, వెంకట్‌ల ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు ఉల్లాసంగా ఆటల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువులు మాట్లాడుతూ యోగా వల్ల శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పది రోజుల పాటు ఈ యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందినఉపాధ్యాయులు

విడపనకల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చీకలగురికిలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. విడపనకల్లులో 20 మంది, చీకలగురికిలో ఐదుగురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వీరిని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పిలిపించి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న, బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం వసుంధర దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం

ఉరవకొండ: మండల కేంద్రంలోని భద్రప్ప బావి వీధిలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. పద్మశాలీలు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పట్టువస్త్రాలను మేళ తాళాల మధ్య ఊరేగింపుగా తీసుకుని వచ్చి అర్చకులకు అందజేశారు. ఆలయ ఆవరణలో లక్ష్మీనారాయణ, వరుణ యాగాలను చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసులును పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం 12-30గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య కన్నుల పండుగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లకు ఊయల సేవ చేపట్టారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం : సీపీఐ

ఉరవకొండ: ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కరువుతో రైతులు అల్లాడుతున్నా ప్రభుత్వం వారి కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. జీబీసీ కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టు సాగుకు నోచుకోలేదన్నారు. పార్టీలకు అతీతంగా ఈ నెల 22వ తేదీన జరిగే బీఏసీ సమావేశంలో గట్టిగా పోరాడలన్నారు. హంద్రీనీవా ఆయకట్టును రెండు లక్షల నుంచి పది లక్షలకు పెంచాలన్నారు.

శివన్నకు పరామర్శ

అనారోగ్యానికి గురైన శివన్నను సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్ పరామర్శించారు. ఇటీవల శివన్న గుండెకు సంబంధించి ఆపరేషన్ చేయించుకుని ఆయన స్వగృహానికి వచ్చారు. ఆయన ఆరోగ్య వివరాలను సీపీఐ జిల్లా కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి వన్నూర్‌సాబ్ ఉన్నారు.

మండలంలో ఓ మోస్తరు వర్షం

విడపనకల్లు: మండలంలోని పెంచలపాడు, గేడుకల్లు, డొనేకల్లు, కడదలబెంచి, ఆర్‌కొట్టాల, విడపనకల్లు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఓ మెస్తారు వర్షం కురిసింది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు రైతులు విత్తనం వేసే పనిలో నిమగ్నమయ్యారు. సాయంత్రం మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. 15 మి.మీ వర్షం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

వైభవంగా ఉట్ల పరుష

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో శనివారం సాయంత్రం ఉట్ల పరుష కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులను పెన్నహోబిలం నుంచి ఆమిద్యాలకు తీసుకుని వచ్చారు. ఉత్సవమూర్తులను ఉట్లమాను వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో యువకులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ రుణాలు ఇవ్వాలి

ఉరవకొండ: కౌలు రైతు గుర్తింపు కార్డు ఉన్న రైతులందరికీ రుణాలు ఇవ్వాలని తహసీల్దారు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. కౌలు రైతులకు వెంటనే రుణాలు ఇవ్వాలని సూచించారు. అలాగే డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. లబ్ధిదారులందరికీ రేషన్ సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

ఉరవకొండ: మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలో శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకురత్నమ్మ, ఆసుపత్రి కమిటీ చైర్మన్ యేళ్ల శంకరప్ప, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మదమంచి శ్రీనివాసులు, టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు చందా వెంకటస్వామి, మండల కన్వీనర్ విజయభాస్కర్, పట్టణ కన్వీనర్ రామాంజినేయులు, రేగాటి నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు రాజేశ్, కో-ఆప్షన్‌సభ్యుడు ఆసిఫ్, మైనార్టీ నాయకులు రహంతుల్లా, నూర్, ఖలందర్, సలాం, ఖాదర్, వజ్రకరూరు నాయకులు నాగేంద్ర, ప్యాపిలి జయన్న, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఆపద్బాంధవ



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఉరవకొండ: స్థానిక సెంట్రల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆపద్బాంధవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నారాయణ స్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆపద్బంధవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు బ్రహ్మశీన, సురేష్, సుధీర్, మహబుబ్‌బాషా, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎం హళ్ళిలో వైద్య శిబిరం



గ్రామంలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కూడేరు: మండలంలోని ఎంఎంహళ్ళి గ్రామంలో జ్వరాలు ప్రబలడంతో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కూడేరు డాక్టర్ తిప్పయ్య ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామంలో జ్వరగ్రస్థులకు పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జ్వరాల గురించి విచారించారు. అనంతరం దోమల నివారణపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు నాగేంద్రప్రసాద్, సరోజమ్మ, శాంతకుమారి, ఏఎన్‌ఎంలు, భాగ్యలక్ష్మి, సులోచన, కరుణమ్మ, కవిత, చంద్రప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు నిరంతరాయంగా ఏడు గంటల విద్యుత్ ఇవ్వాలి

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు వ్యవసాయ ఫీడర్ కింద సాగుకు విద్యుత్‌ను 7 గంటల పాటు నిరంతరాయంగా ఇవ్వాలని రైతులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, రెండు గంటల నుంచి ఆరు గంటల వరకు విద్యుత్‌ను ఇస్తున్నారని తెలిపారు. ఈ విధంగా విద్యుత్ ఇవ్వడం వల్ల రైతులకు పూర్తి ఇబ్బందికరంగా ఉందని, రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, లేదా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్ర వరకు నియంతరాయంగా విద్యుత్ ఇవ్వాలని అధికారులను కోరారు. అలా కరెంటును ఇస్తే పొలాల్లో రైతులు పనులు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లి రైతు సమస్యలను పరిష్కరించండి

ఏడీఏ రవిశంకర్

బెళుగుప్ప : క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల సమస్యలను పరిష్కరించి వ్యవసాయ శాఖ రాయితీలపై అవగాహన కల్పించాలని ఏడీఏ రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన ఏఓ, ఎంపీఈఓలతో సమావేశాన్ని నిర్వహించారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇంతవరకు రైతుల ఖాతాలోకి జమకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంలోగా ఈ సమస్యను పరిష్కరించాలని ఏఓ పృథ్వీసాగర్‌కు సూచించారు. ఎంపీఈఓలు పొలం బాట పట్టి ఖరీఫ్ పం టల సాగు వివరాలను క్షేత్రస్థాయికి వెళ్లి తెలుసుకోవాలన్నారు. రైతులు ఏ పంటలు సాగుచేశారో ట్యాబ్‌లలో నమోదు చేయాలన్నారు. తప్పనిసరిగా ఈక్రాపింగ్ చేపట్టాలన్నారు. వందశా తం సబ్సిడీతో ప్రత్యామ్నా య పంటల విత్తనాలు అర్హులైన రైతులకు ప్రభు త్వం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఉలవలు, జొన్న, సజ్జ విత్తనాలు సరఫరా చేసిందని, సోమవారం నుంచి పంపిణీ చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రవిశంకర్

అంగన్‌వాడీ కేంద్రాలకు వంటసామగ్రి పంపిణీ

ఉరవకొండ: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వంట సామగ్రిని శనివారం సర్పంచు నర్రా సుజాత, ఎంపీడీఓ శివకుమార్, సీడీపీఓ అరుంధతి అందజేశారు. ఉరవకొండలోని 30 అంగన్‌వాడీ కేంద్రాలకు 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వీటిని కొనుగోలు చేసినట్లు ఎంపీడీఓ శివకుమార్ పేర్కొన్నారు. అన్న అమృత హస్తం కార్యక్రమంలో భాగంగా ఒక్కొక కేంద్రానికి రూ. 5 వేలతో సామగ్రి కొనుగోలు చేసి అందించామన్నారు. గర్భవతులు, బాలింతలకు పౌష్ఠి కాహారాన్ని అందజేయాలని సర్పంచు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రబియా, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.



వంట సామగ్రిని అందజేస్తున్న దృశ్యం